



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

శుక్రవారం 23.01.2026 | సంపుటి :12 సంచిక : 184 | పేజీలు :12 వెల : రూ. 4/-







హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## గ్రూప్-1పై తీర్పు వాయిదా

### ఫిబ్రవరి 5న వెల్లడిస్తాం:హైకోర్టు

హైదరాబాద్(జనంసాక్షి): గ్రూప్-1 నియామకాలకు సంబంధించి తెలంగాణ హైకోర్టు తీర్పు వాయిదా వేసింది. ఫిబ్రవరి 5న వెల్లడించనున్నట్లు ఉన్నత న్యాయస్థానం వెల్లడించింది. తీర్పు కాపీ సిద్ధం కాలేదని న్యాయవాదులకు డివిజన్ బెంచ్ తెలిపింది. గ్రూప్-1 నియామకాలపై గతంలో సింగిల్ బెంచ్ స్టే ఇచ్చింది. దీనిపై టీజీపీఎస్సీతో పాటు ఎంపికైన పలువురు అభ్యర్థులు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా ధర్మాసనం స్టే ఎత్తివేసింది. నియామకాలు



తుది ఉత్తర్వులకు లోబడి ఉంటాయని తెలిపింది. గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయని, పారదర్శకత లోపించిందనే కారణాలతో మార్కుల తుది జాబితా, జనరల్ ర్యాంకులను రద్దు చేయడం తోపాటు జవాబు పత్రాలను పునర్ మూల్యాంకనం చేయాలని, లేనిపక్షం లో తాజాగా పరీక్షలు నిర్వహించాలంటూ గతంలో సింగిల్ జడ్జి తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఆ తీర్పును సవాలు చేస్తూ టీజీపీఎస్సీ తోపాటు.. ఇందులో ఉద్యోగాలు పొందిన పలువురు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఆ అప్పీళ్లపై హైకోర్టు గతంలోనే విచారణ పూర్తిచేసింది. దీనిపై నేడు తీర్పు వెలువరించాల్సి ఉండగా.. ఫిబ్రవరి 5కి వాయిదా పడింది.

## వరల్డ్ ఎకానమిక్ ఫోరం ఎండీతో సీఎం రేవంత్

# ముఖాముఖి

- తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను వివరించిన ముఖ్యమంత్రి
- 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ రోడ్‌మ్యాప్‌పై వివరణ
- హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు నిర్వహణకు విజ్ఞప్తి



- ఫ్యూచర్‌సిటీలో యూపీసీ వోల్ట్ పెట్టుబడులు
- ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సంస్థ
- రూ.5వేల కోట్ల పెట్టుబడులు.. సుమారు 4వేల మందికి ఉపాధి
- సౌర,పవన విద్యుత్ ఉత్పత్తికి 'ఐనాక్స్'ఆసక్తి
- గోద్రేజ్ ఛైర్మన్‌తో తెలంగాణ మంత్రుల భేటీ
- ఫ్యూచర్ సిటీలో హౌసింగ్ ప్రాజెక్టులపై చర్చ
- హైదరాబాద్‌ను సందర్శించాలని మంత్రి శ్రీధర్ బాబు వినతి

దావోస్(జనంసాక్షి):స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరంఎండీ జెరెమి జర్గన్స్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఏటా హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని కోరారు. త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని ఎకనామిక్ ఫోరం బృందం ఆయనకు తెలిపింది. సీ4ఐఆర్ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌తోనూ సీఎం భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలను రేవంత్ వివరించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమిజర్గన్స్, అ4ఎఖీ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలతో పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలో అప్ సదస్సు నిర్వహించే ప్రతిపాదనలను చర్చించారు. ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలో-అప్ సమావేశం నిర్వహించాలని ప్రతిపాదించారు. జనవరిలో జరిగే దావోస్ లో జరిగే సదస్సులోని చర్చలు, తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఫాలో అప్ సమావేశం ఉపయోగపడుతుందన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం భాగస్వామ్యంతో ఫాలో అప్ సదస్సు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న అవకాశాలు, పారిశ్రామిక రంగంలో

మిగతా 2లో..

### దావోస్ పర్యటన విజయవంతం

- జూరిచ్ బయల్దేరిన సీఎం రేవంత్
- అక్కడి నుంచి అమెరికాకు పయనం

2లో

### తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్‌కు అపూర్వ స్పందన

- ఏఐ అకాడమీకి పియర్సన్ సహకారం
- యువతకు ఏఐ శిక్షణ అందించాలి: సీఎం రేవంత్
- 'తెలంగాణ రైజింగ్' బృందం పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు

## దిగుబడేకాదు.. కొనుగోళ్లలోనూ



# రికార్డు

### 25 సంవత్సరాలలో అత్యధికంగా ధాన్యం కొనుగోళ్లు జరిపిన రాష్ట్ర ప్రభుత్వం

- తెలంగాణా రైతాంగం భాగస్వామ్యంతోటే ఇంతటి విజయం సాధ్యమైంది
- బోనస్‌తో కలిపి చెల్లించిన మద్దతు ధర మొత్తం 18,532.98 కోట్ల చెల్లింపు
- అగ్రస్థానంలో నిజామాబాద్,నల్లగొండ జిల్లాలు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణా రాష్ట్రం ధాన్యం దిగుబడిలోనే కాకుండా ఖరీఫ్ సీజన్ లో కొనుగోలు చెందిన ధాన్యం దేశచరిత్రలోనే ఆల్ టైం రికార్డ్ నమోదు చేసుకుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గడిచిన 25 సంవత్సరాల వ్యవధిలో ఇదే అత్యధిక రికార్డ్ అని ఆయన చెప్పారు. 2025-26 రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకై పౌర సరఫరా శాఖా రూపొందించిన ప్రణాలికలపై గురువారం రోజున బేగంపేట ఐ.ఏ.ఎస్.ఆఫీసర్స్ అసోసియేషన్ బిల్డింగ్ లో జరిగిన సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల వ్యవదిలో అనుసరించిన విధానాల ఫలితమే ధాన్యం దిగుబడి, కొనుగోలులోనూ సంచలనాత్మక రికార్డ్ నమోదు చేసుకుందని ఆయన చెప్పారు. పౌరసరఫరాల శాఖా,నీటపారుదల, వ్యవసాయ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకోవడంతో పాటు తెలంగాణా రైతాంగం భాగస్వామ్యంతోటే ఇంతటి విజయం సాధించామని ఆయన చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన ఘనత తెలంగాణా రాష్ట్రానికి దక్కిందన్నారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు దేశంలోని మరే ఇతర రాష్ట్రాలలో లేవని ఆయన తెలిపారు.

మిగతా 2లో..

## నిన్న తమిళనాడు, కేరళ.. నేడు కర్ణాటక అసెంబ్లీలోనూ..

### కేవలం రెండు లైన్లు చదివి గవర్నర్ వాకౌట్

చెన్నై(జనంసాక్షి):తమిళనాడు, కేరళ మాదిరిగానే కర్ణాటకలోనూ సీన్ రిపీట్ అయింది. కొత్త ఏడాదిలో కర్ణాటకలో తొలి అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగ ప్రతులను గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ చదవకుండా పక్కన పెట్టారు. 'ఈ రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది.. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ

మిగతా 2లో..



## ఝార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### ఎదురు కాల్పుల్లో 15 మంది మావోయిస్టులు మృతి

### మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పతిరామ్ మాంఝీ అలియాస్ అనల్



రాంచీ(జనంసాక్షి):ఝార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం పశ్చిమ సింగ్భూమ్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయని పోలీసులు వెల్లడించారు. ఈ కాల్పుల్లో ఇప్పటివరకు 15 మంది మావోయిస్టులు మృతి చెందారు. కిరీబురు పోలీస్‌స్టేషన్ పరిధిలో సారండా అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది.మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పతిరామ్ మాంఝీ అలియాస్ అనల్ ఉన్నట్లు తెలుస్తోంది. అతడి తలపై ఆరు రాష్ట్రాల్లో మొత్తంగా రూ.5కోట్ల వరకు రివార్డ్ ఉంది. గత కొన్నేళ్లుగా మావోయిస్టు ఆర్గనైజేషన్‌లో అనల్ కీలకంగా పనిచేస్తున్నాడు. భద్రతా బలగాలపై భారీ దాడులకు ఇతడే పథకరచన చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎన్‌కౌంటర్, సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరగొచ్చని అధికారులు భావిస్తున్నారు.

## సభ నుంచి ఎందుకు వెళ్లిపోతున్నారు?

మహిళలపై నీతీశ్ గరంగరం



2లో..

## కేటీఆర్‌కు సిట్ నోటీసులు

- నేడు విచారణకు హాజరు కావాలని ఆదేశం
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం



హైదరాబాద్(జనంసాక్షి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దూకుడు పెంచిన సిట్ అధికారులు తాజాగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం నాడు ఉదయం 11:00 గంటలకు జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో విచారణకు హాజరవ్వాలంటూ కేటీఆర్‌కు నోటీసులిచ్చారు. సీఆర్‌పీసీ 160 కింద నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఈ నోటీసులను సిట్ అధికారులు అందజేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సిట్ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించనున్నారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రమేయం ఉన్న పోలీస్ ఉన్నతాధికారుల్లో కొందరు ఇప్పటికే అరెస్ట్ అవగా.. ఇప్పుడు నాయకుల విచారణ జరుగుతోంది. ఈ కేసులో ఇటీవలె మాజీ మంత్రి హరీశ్ రావుకు నోటీసులు జారీ చేసిన సిట్ అధికారులు.. ఆయన్ను కూడా ఇటీవల విచారించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన్ను పలు అంశాలపై విచారించిన అధికారులు.. కీలక సమాచారం రాబట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది.ఫోన్ ట్యాపింగ్ కేసులో

మిగతా 2లో..

## సిట్‌ను నేనూ ప్రశ్నిస్తా

- నా ఫోన్ ట్యాప్ అవుతుందా? అని అడుగుతా...
- మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయట్లేదని ప్రమాణం చేసి చెబుతారా?: కేటీఆర్

సిరిసిల్ల(జనంసాక్షి): కాళేశ్వరం స్కామ్, ఫోన్ ట్యాపింగ్ అంటూ డ్రామాలు ఆడుతున్నారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "సీఎం బావమరిది బొగ్గు స్కామ్‌ను హరీశ్‌రావు బయటపెట్టారు. ఉదయం కుంభకోణం బయటపెడితే సాయంత్రానికి నోటీసులు వచ్చాయి. రేవంత్‌రెడ్డి సిట్ అంటే... సిట్, స్టాండ్. సిట్ విచారణ సీరియల్ లా మారింది. ఆర్‌ఆర్ ట్యాక్స్, బొగ్గు

మిగతా 2లో..

## నోటీసులకు భయపడం

హామీలు అమలు చేసే వరకు వెంటపడుతూనే ఉంటాం:హరీశ్

2లో..

### బీఆర్‌ఎస్ హయాంలోనే

## సింగరేణి అప్పులు భారీగా పెరిగాయి

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):భారత రాష్ట్ర సమితి హయాంలో సింగరేణి బోర్డు నామ మాత్రంగా ఉండేదని, వారి హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు."సింగరేణి విద్యుత్ వాడుకొని జెన్‌కో, ట్రాన్స్‌కో డబ్బులు ఇవ్వలేదు. టెండర్ల నుంచి కాంట్రాక్టుల వరకూ అన్నీ కేసీఆర్ కుటుంబమే చూసేది. ఆ సంస్థ సీఎస్‌ఆర్ నిధులు కూడా దుర్వినియోగం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రైవేటు కంపెనీలకు పనులు కట్టబెట్టారు. సింగరేణి బోర్డు సమావేశం వివరాలు కూడా నా దృష్టికి రావు. సింగరేణిపై కేంద్రం అజమాయిషీ ఎప్పుడూ లేదు. నిధులు లేక జిల్లాలకు రూ.1500 కోట్ల డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ఇవ్వలేదు. బీఆర్‌ఎస్ హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయి. గత పదేళ్లలో రూ.32వేల కోట్లకుపైగా సింగరేణి అప్పులు పెరిగాయి. సింగరేణి కార్మికులకు ప్రభుత్వం సుమారు రూ.47వేల కోట్లు చెల్లించాలి. నిబంధనలకు విరుద్ధంగా సీఎండీని

మిగతా 2లో..

## నైని కోల్ బ్లాక్ టెండర్లపై విచారణ

- సింగరేణిపై కేంద్రం సంచలన నిర్ణయం
- ఇద్దరు సభ్యులతో కూడిన బృందం ఏర్పాటు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆదేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణలో సంచలనం సృష్టిస్తోన్న నైని కోల్ బ్లాక్ టెండర్లపై విచారణ చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. నైని కోల్ బ్లాక్ విషయంలో వివాదం తలెత్తిన నేపథ్యంలో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందం సింగరేణిలో పర్యటించనుంది. వివాదానికి, టెండర్ రద్దు

మిగతా 2లో..

## ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోండి

### బిల్లులు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిది: డిప్యూటీ సీఎం భట్టి



కొమురం భీం(జనంసాక్షి): ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమే కాదు వారం వారం బిల్లు ఇస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ లబ్ది దారులు ఏ ఒక్కరోజు ఆలస్యం చేయకండి. వడివడిగా ఇండ్లు కట్టుకోండి.. బిల్లు ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిదే అని భట్టి తెలిపారు. జైనూర్ మండలంలోని జంగాం గ్రామంలో భట్టి విక్రమార్క పర్యటించారు. స్వయం సహాయక మహిళ సంఘాలకు రూ.3.41 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల కు సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సంద్భంగా భట్టి మాట్లాడుతూ.. నీటి పారుదల సమస్యలు అడిగారు. అప్పుడు బ్రిడ్జి అడిగారు. వాటి పనులు పూర్తి చేసే పనిలో ఉన్నామన్నారు. ఓజా కళాకారుల కళ ఎంతో గొప్పది అని కొనియాడారు. కళాకారులను ఆదుకుంటాం అని అండగా ఉంటామని చెప్పాను. అందులో భాగంగా మీ ఓజా కళను కాడుకోవడం కోసం రుణాలు ఇచ్చే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందిరమ్మ చీరలు కట్టుకొని

మిగతా 2లో..

## వీబీ-జీరాంజీ'కి పాతపేరే కొనసాగించాలి



న్యూఢిల్లీ(జనంసాక్షి):జాతీయ ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించి 'వీబీ-జీరాంజీ'పేరుతో కొత్త చట్టం తేవడాన్ని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తప్పుబట్టారు. పేదల పని హక్కులను హరించడమే భాజపా ప్రధాన ఉద్దేశమని ఆరోపించారు. దిల్లీలో నిర్వహించిన ఉపాధి హామీ కార్మికుల సదస్సులో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.దేశంలో రాచరిక పాలనను ప్రవేశపెట్టాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందన్నారు."గతంలోనూ రైతుల హక్కులను కాలరాసేందుకు కేంద్ర వ్యవసాయ రంగంలో మూడు చట్టాలను తీసుకొచ్చింది. అన్నదాతల ఆందోళనలతో వెనక్కి తగ్గింది. అదే మాదిరిగా ఇప్పుడు పేద కూలీలపై 'వీబీ జీరాంజీ'పేరుతో వారి పని హక్కులను హరించాలని చూస్తోంది. దేశంలో ప్రతీదీ రాజు (ప్రధాని) మాత్రమే నిర్ణయించాలనే కొత్త సిద్ధాంతాన్ని భాజపా సృష్టిస్తోంది"అని ఆరోపించారు. వీజీ-జీరాంజీ పథకాన్ని రద్దుచేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ పెద్ద ఎత్తున అందోళనకు సిద్ధమైంది. ఈ నెల 10 నుంచి ఫిబ్రవరి 25 వరకు

మిగతా 2లో..

## లోయలో పడ్డ ఆర్మీ వాహనం..

- 10 మంది మృతి
- మరో 11 మందికి గాయాలు

శ్రీనగర్(జనంసాక్షి):జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భద్రతా సిబ్బంది వెళ్తున్న ఓ వాహనం అదుపుతప్పి లోయలో పడింది. ఈ ఘటనలో 10 మంది ఆర్మీ సిబ్బంది ప్రాణాలు కోల్పోగా.. మరో 11 మందికి గాయాలయ్యాయి. భదేర్వా-చంబా రోడ్డులోని 9వేల అడుగుల ఎత్తైన ఖన్నీ పర్వత ప్రాంతంలో ఈ దుర్ఘటనచోటుచేసుకుంది.సైన్యంతో వెళ్తున్న ఈ బుల్లెట్ ప్రూఫ్ వాహనం శిఖరం పైభాగానికి చేరుకున్న సమయంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దాంతో వాహనం

మిగతా 2లో..



# దౌత్య, సంస్థాగత మార్గాల ద్వారా నిరంతర సహకారం

## అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌తో డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ భేటీ



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్‌లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ తో స్నేహపూర్వక దౌత్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ ఖాన్ ఇటీవల తన అమెరికా పర్యటన వివరాలు వివరించారు. అమెరికా – భారత్ – కజకిస్తాన్ మధ్య త్రైపాక్షిక సహకారానికి ఉన్న అవకాశాలపై మాట్లాడారు. ఈ చర్చలు ముఖ్యంగా అభివృద్ధి, పెట్టుబడులు, సాంకేతిక సహకారం, ఆర్థికం వంటి కీలక రంగాలపై కేంద్రీకృతమయ్యాయి. ఈ భేటీ ద్వారా మూడు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడమే కాకుండా పరస్పర ప్రయోజనాలకు దారితీసే దీర్ఘకాలిక భాగస్వామ్యాలకు పునాది వేయగలదన్న విశ్వాసాన్ని ఇరువురు వ్యక్తం చేశారు. 'తెలంగాణ కనెక్ట్స్ యూఎస్ఏ సమ్మిట్' గురించి కూడా ప్రస్తావించారు. తెలంగాణ, అమెరికా మధ్య ఆర్థిక, సాంకేతిక ఆధారిత భాగస్వామ్యాలను బలోపేతం చేయడంలో ఈ సమ్మిట్‌కు ఉన్న వ్యూహాత్మక ప్రాధాన్యతను వివరించారు. ఈ సమ్మిట్ ద్వారా వాణిజ్యం, పెట్టుబడులు, స్టార్ట్-అప్ ఎకోసిస్టమ్‌లకు మద్దతు ఇవ్వడం, సంస్థాగత, పరిశ్రమల మధ్య సహకారం వంటి కీలక లక్ష్యాలు సాధ్యమవుతాయని చెప్పారు. ఈ చర్చలపై లారా విలియమ్స్ సానుకూలంగా స్పందించారు. సరైన దౌత్య, సంస్థాగత మార్గాల ద్వారా నిరంతర సంభాషణలు, సహకారాన్ని సులభతరం చేయడంలో తన మద్దతు తెలిపారు. ఈ పరస్పర చర్చలు అమెరికా – భారత్ – కజకిస్తాన్ మధ్య త్రైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలన్న ఉమ్మడి సంకల్పాన్ని, పరస్పర లాభదాయక భాగస్వామ్యాలను ముందుకు తీసుకెళ్లాలన్న దృఢమైన సంకల్పాన్ని ప్రతిబింబించాయి. ఈ సమావేశం భాగస్వామ్య దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక మార్పిడి, దీర్ఘకాలిక వ్యూహాత్మక సహకారాన్ని ప్రోత్సహించడంలో ఉన్న పరస్పర సంబంధాల ప్రాముఖ్యతను పునరుద్ఘాటించింది.

## కేటీఆర్‌కు సిట్ నోటీసులు

కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడంపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. 'నిన్న నాకు నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు కేటీఆర్‌కు ఇచ్చారు. బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పే దమ్ములేదు. రేవంత్ రెడ్డి ఎన్ని నోటీసులు ఇచ్చినా.. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసేదాకా వదలబోము. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా.. రేవంత్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఆయన వెంటపడుతూనే ఉంటాం' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## సిట్‌ను నేనూ ప్రశ్నిస్తా..

కుంభకోణంపై మాత్రం సిట్ ఉండదు. ఏదో రూపంలో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతకాదు.. అసమర్థ పాలన. మేము ఏ తప్పూ చేయలేదు.. ఎవరికీ భయపడేది లేదు. కేవలం రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సిట్ విచారణకు కచ్చితంగా హాజరవుతా. ఫోన్ ట్యాపింగ్ కేసులో సంబంధంలేని నేతలను ప్రశ్నించారు. సిట్ అధికారులను కూడా కొన్ని ప్రశ్నలు అడుగుతా. నా ఫోన్ ట్యాప్ అవుతుందా? అని సిట్ అధికారులను అడుగుతా. ఫోన్ ట్యాపింగ్ ప్రభుత్వాలు చేయవు.. పోలీసు వ్యవస్థ చేస్తుంది. శివధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి వంటి అధికారులను ప్రశ్నించట్లేదు. మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయట్లేదని ప్రమాణం చేసి చెబుతారా? కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని చెబితే ఖండించలేదు" అని కేటీఆర్ అన్నారు.

## నోటీసులకు భయపడం



**మెదక్(జనంసాక్షి):** బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పలేక .. నిన్న నాకు, ఇవాళ కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసే వరకు వెంట పడుతూనే ఉంటామన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా సీఎం ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు కాంగ్రెస్ సర్కారు నాటకమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు."పాలన గాలికి వదిలి సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న చిల్లర ప్రయత్నాలు ఇవి. రాష్ట్రంలో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రజల కర్మానికి వదిలేసి దావోస్, అమెరికా పర్యటన పెట్టుకున్నారు. సర్కారు డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పసలేదని న్యాయస్థానాలు తేల్చి చెప్పినా.. కాంగ్రెస్ ప్రభుత్వం మొగలి రేకులు సీరియల్ నడిపిస్తోంది. రేవంత్‌రెడ్డి విదేశాల్లో విహరిస్తూ అక్కడి నుంచి వచ్చే వరకు ఈ సీరియల్ నడిచేలా ప్లాన్ చేసినట్లు అనిపిస్తోంది. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని ప్రభుత్వ శాఖల వెన్ను విరిచారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేతలకు నోటీసులు ఇవ్వడం హాస్యాస్పదం" అని నిరంజన్‌రెడ్డి అన్నారు.


**తెలంగాణ ప్రభుత్వము**
**వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్**

నెం.వ్య.మా.క/హై/2025-26 — **టెండరు నోటీసు** — తేది:22/01/2026

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్ మలక్‌పేట మార్కెట్ యార్డ్ నందు గార్బేజ్ నిర్వహణ మరియు క్యాంటీన్ నిర్వహణ రెండు సంవత్సరాల కాల వ్యవధికి మరియు టాయిలెట్ బ్లాక్ **BOT** పద్ధతిలో నిర్వహణకు సీల్డు టెండర్లు ఆహ్వానించుట.

| క్ర. సం. | పనిపేరు | ధరావత్తు రూ. | టెండరు షెడ్యూలు సరఫరా తేది & సమయము | టెండరు షెడ్యూలు దాఖలుకు చివరి తేది & సమయము | టెండరు తెరవబడు తేది & సమయము |
|---|---|---|---|---|---|
| 1 | గార్బేజ్ నిర్వహణ (చెత్త ఉడ్చి ఎత్తివేయుట) | 1,00,000/- | 27.01.2026 నుండి 28.01.2026 వరకు ఉదయం 10.30. గం॥ నుండి సా॥ 4 గం॥ల వరకు | 29.01.2026 రోజున మధ్యాహ్నం 12.30 గంటల వరకు | 29.01.2026 రోజున మధ్యాహ్నం 1.00 గంటలకు |
| 2 | క్యాంటీన్ నిర్వహణ | 50,000/- | | | |
| 3 | టాయిలెట్ బ్లాక్ (small block on BOT basis) | 25,000/- | | | |

టెండరు షెడ్యూల్ కొరకు రూ.3 వేల డిడి రూపేన సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్ గారి పేరున తీసి వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్, కార్యాలయము నందు లిఖితపూర్వ దరఖాస్తుతో పాటు షెడ్యూల్ ధర, ధరావత్తు డి.డి.లను మరియు ఈ క్రింద తెలిపిన అర్హత ధ్రువీకరణలు సమర్పించిన వారికి మాత్రమే టెండర్ షెడ్యూల్ ఇవ్వబడును.

**అర్హతలు:**
1)ఫర్మ్ రిజిస్ట్రేషన్, జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ మరియు లేబర్ లైసెన్స్ గల కాంట్రాక్టర్లు మాత్రమే టెండరు నందు పాల్గొనుటకు అర్హులు
2.పైన తెలిపిన పనులలో ఏదైనా ప్రభుత్వ సంస్థలో కనీసం(3) సంవత్సరాల అనుభవ ధ్రువీకరణ పత్రములు కలిగి ఉన్నవారిని మాత్రమే అర్హులుగా పరిగణించి టెండరు షెడ్యూల్ అమ్మబడును.
3.చెత్త చెదారము ఊడ్చుట, ప్రోగుచేయుట, ఎత్తివేయులకు గాను సొంత/లీజుకు తీసుకోబడిన డంపింగ్ యార్డు కలిగి ఉండవలెను. అట్టి వాటి వివరాలను దరఖాస్తుతోపాటు జతపర్చవలెను.
4.బుల్ గార్బేజ్ లిఫ్టింగ్, 200 ఎస్.ఎస్.టి.కి తక్కువ కాని చెత్త తరలింపునకు రెండు సొంత టిప్పర్/ట్రాక్టర్ వాహనాలు కలిగి ఉండవెలెను.
5.కాలుష్య నిర్వహణ కొరకు బోర్డు వారి ఎన్ఓసీ లను తప్పనిసరిగా సమర్పించవలెను.
6.క్యాంటీన్ నిర్వహణ కొరకు ఫుడ్ లైసెన్స్, జీఎస్టీ, లేబర్ లైసెన్స్ కలిగి ఉన్నవారిని మాత్రమే అర్హులుగా పరిగణించి టెండరు షెడ్యూల్ అమ్మబడను.
7.టాయిలెట్ బ్లాక్ వారి సొంత డబ్బుతో నిర్మించి బీవోటీ పద్ధతిలో నిర్వహించుటకు జీఎస్‌టీ, ఫర్మ్ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్నవారిని మాత్రమే అర్హులుగా పరిగణించి టెండరు షెడ్యుల్ అమ్మబడును.

అసంపూర్తిగా ఉన్న టెండర్ గాని, అభ్యంతరములు ఉన్న టెండర్లు గానీ ఎలాంటి కారణము చూపకుండా టెండరు రద్దు చేయు అధికారము ఈ దిగువ సంతకం దారులను కలదు.

**సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి (ఎఫ్ఏసీ)**
**వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్**

DIPR No.:14218-PP/CL/ADVT/1/2025-26


## వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీతో సీఎం రేవంత్

# ముఖాముఖి

ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలు, ప్రభుత్వ విధానాలను ప్రపంచానికి చూపించాలనే ఆలోచనను పంచుకున్నారు. అందుకే హైదరాబాద్‌లో ఫాలో అప్ ఫోరమ్ నిర్వహించాలలని కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం సానుకూలంగా స్పందించింది. వివిధ దేశాల నుంచి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ.. సమీప భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని మేనేజింగ్ డైరెక్టర్ జెరెమిజ్గన్స్ తెలిపారు. చైనాలో ప్రతి ఏడాది 'సమ్మర్ దావోస్' జరుగుతోందని,సౌదీ అరేబియా కూడా ఆసక్తి ప్రదర్శిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్, లక్ష్యాలను సీఎం వివరించారు. తెలంగాణ విజన్‌లోని విభిన్న కోణాలు వివిధ కోణాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని జెరెమిజ్గ్గ÷న్స్ ప్రశంసించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లో తాము భాగస్వామ్యం పంచుకుంటామన్నారు. తెలంగాణ ఆర్థిక వృద్ధి ప్రయాణంలో కలిసి వస్తామనే సంకేతాలు ఇచ్చారు. హైదరాబాద్లో ప్రతిభావంతమైన మానవ వనరులున్నాయని అభిప్రాయపడ్డారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డెవెలప్మెంట్, స్పోర్ట్స్కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. హైదరాబాద్‌లో జరిగిన బయోఏషియా 2024లో ప్రారంభించిన తెలంగాణ సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ పురోగతిపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ భారత్లో ప్రారంభించిన తొలి థీమాటిక్ సెంటర్ అదేనని గుర్తు చేశారు. ఆదర్శవంతమైన మోడల్గా గుర్తింపు సాధించిందన్నారు. పరిశ్రమల అభివృద్ధి ప్రణాళికలో ఉత్తమ పద్ధతులపై అ4ఎఖీ చేస్తున్న పరిశోధనల సమాచారాన్ని తెలంగాణ ప్రభుత్వంతో పంచుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు జోన్ల నమూనాను విశ్లేషించారు. ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటును వివరించారు. ఇది నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా, దేశంలో సుస్థిర అభివృద్ధికి రోల్ మోడల్ సిటీగా నిలుస్తుందన్నారు. సమావేశంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఏరోస్పేస్, డిఫెన్స్, బయో-డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్కు ఉన్న అనుకూలతలను వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.

### ఫ్యూచర్‌సిటీలో యూపీసీ వోల్ట్ సంస్థ రూ.5వేల కోట్ల పెట్టుబడులు

**దావోస్(జనంసాక్షి):** భారత్ ఫ్యూచర్ సిటీలో రూ.5వేల కోట్ల పెట్టుబడితో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు యూపీసీ వోల్ట్ సంస్థ ముందుకొచ్చింది. ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వంతో ఆ సంస్థ ఎంవోయూ చేసుకుంది. యూపీసీ వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రిన్యూవబుల్స్ ఏపీఏసీ సహ వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్యాన్, యూపీసీ రిన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్ నిగమ్‌తో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బృందం సమావేశమైంది. నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిపి యూపీసీ వోల్ట్ సంస్థగా ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ సంస్థ భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐకు అనుకూలమైన డేటా సెంటర్‌ను నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లలో రూ.5వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరాకు 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే 3వేల మందికిపైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. డేటా సెంటర్ ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉద్యోగ అవకాశాలుంటాయని ప్రభుత్వం వెల్లడించింది.

సౌర , పవన విద్యుత్ ఉత్పత్తికి ఐనాక్స్ గ్రూప్ ఆసక్తి

దావోస్:తెలంగాణను కాలుష్య రహిత మహానగరంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ఐనాక్స్ గ్రూప్ డైరెక్టర్ దేవాంశ్ జైన్‌తో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా సోలార్ మాడ్యూల్స్ సహా ఆధునిక, సుస్థిర తయారీ రంగాల్లో సహకార అవకాశాలపై చర్చించారు. ఐనాక్స్ గ్రూప్ తెలంగాణలో సౌర , పవన విద్యుత్ ఉత్పత్తి చేపట్టి, ఆ తర్వాత తయారీ రంగంలోకి విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది.రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కాలుష్యం లేని విద్యుత్ (క్లీన్ ఎలక్ట్రిసిటీ) , గ్రీన్ హైడ్రజన్ అందిచాలనే ప్రణాళికలు ప్రభుత్వం రూపొందిస్తున్నది అని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. డేటా సెంటర్ల నుంచి అధిక స్థాయిలో పునరుత్పాదక విద్యుత్ అవసరం పెరుగుతోందని చెప్పారు. నూతన తెలంగాణ ఎనర్జీ పాలసీ కింద అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా క్యూర్ ప్యూర్ రేర్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

గోద్రేజ్ ఛైర్మన్‌తో తెలంగాణ మంత్రుల భేటీ

ప్రపంచ ఆర్థిక వేదిక దావోస్‌లో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి గోద్రేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రేజ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయిల్ ఫామ్ వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం, హైదరాబాద్‌లో ఉన్న గోద్రేజ్ క్రీమ్‌లైన్ డెయిరీ ప్లాంట్‌ను రూ.150 కోట్ల పెట్టుబడితో విస్తరించే అవకాశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ నివాస ప్రాంతంలో భారీ గృహ నిర్మాణాల ప్రాజెక్టులు చేపట్టే అంశంపై మాట్లాడారు.



## తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్‌కు అపూర్వ స్పందన

దావోస్(జనంసాక్షి):దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ కు అంతర్జాతీయ స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ విద్యా, పబ్లిషింగ్ సంస్థ పియర్సన్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలో ఏర్పాటు కానున్న గ్లోబల్ ఏ ఐ అకాడమీకి పియర్సన్ సహకారం అందించనుంది. ఏ ఐ శిక్షణ, పాఠ్య ప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లలో తన నైపుణ్యాన్ని పియర్సన్ ఉపయోగించనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ యువతకు ఏ ఐ శిక్షణ అందించి భవిష్యత్ తరాలకు నైపుణ్యం కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఎంఓయూ కుదుర్చుకున్న బృందాన్ని ఆయన అభినందించారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఏ ఐ సిటీ నిర్మాణానికి అవసరమైన పూర్తి స్థాయి ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే అన్ని ప్రముఖ టెక్ కంపెనీలు ఉన్నాయని, ప్రతిభ, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఐటీ, పరిశ్రమలు) సంజయ్ కుమార్ మాట్లాడుతూ, పియర్సన్‌తో కలిసి ఉన్నత నైపుణ్యాల కలిగిన మానవ వనరుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రాజెక్టు త్వరితగతిన అమలుకు అవసరమైన అనుమతులు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. జార్జ్‌టౌన్ యూనివర్సిటీకి చెందిన ఏ ఐ కోల్యాబ్ సంస్థతో కూడా తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఆరోగ్య రంగంలో ఏ ఐ ఆధారిత పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో అనువర్తిత పరిశోధనలకు ఇది దోహదపడనుంది..

## దావోస్ పర్యటన విజయవంతం

దావోస్(జనంసాక్షి):'తెలంగాణ రైజింగ్' ప్రతినిధుల బృందం స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటన విజయవంతంగా ముగిసింది. గత నెలలో హైదరాబాద్ లో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వం భారీగా రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది.మూడు రోజుల వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులోనూ తెలంగాణ ఆశించిన లక్ష్యాన్ని సాధించింది.వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 2026 సదస్సులో పెట్టుబడులకు మించి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్యాలను ప్రపంచానికి చాటి చెప్పాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ పర్యటనలో ప్రతినిధుల బృందం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించింది. ఏఐ, సస్టైనబిలిటీ, స్కిల్లింగ్ కార్యక్రమాలకు సంబంధించిన పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.ఈ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించిన రెండు కీలక సెషన్లలో పాల్గొన్నారు.

## సభ నుంచి ఎందుకు వెళ్లిపోతున్నారు?

### మహిళలపై నీతీశ్ గరంగరం

పాట్నా(జనంసాక్షి):బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పాల్గొన్న ఓ సభలో మరోసారి ఊహించని పరిణామం చోటుచేసుకుంది. మహిళల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తున్న సమయంలోనే సభ నుంచి మహిళలు నిష్క్రమించడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు వెళ్లిపోతున్నారంటూ వాళ్లపై మండిపడ్డారు.రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా ఇటీవల మొదలుపెట్టిన 'సమృద్ధి యాత్ర'లో భాగంగా సివాన్ జిల్లాలో పర్యటించిన సీఎం నీతీశ్.. రూ.వందల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. మహిళలు, ఇతర వర్గాల కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అదే సమయంలో కొందరు మహిళలు సభ నుంచి వెళ్లిపోతుండటాన్ని గమనించిన సీఎం.. ఎక్కడికి వెళ్లిపోతున్నారు? మేం చెప్పేది వినకపోతే మీ కోసం ఏం చేస్తున్నామో ఎలా తెలుస్తుంది? అని వ్యాఖ్యానించారు.అయినప్పటికీ మహిళలు ఆగకుండా వెళ్లిపోవడంతో మరింత ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. "మీకోసం ఎన్నో చేశాం. కూర్చొని వినండి.. లేదంటే బాగుండదు" అని తీవ్ర స్వరంతో చెప్పడం చర్చనీయాంశమైంది. ఇదిలాఉంటే, బిహార్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న నీతీశ్‌కు మహిళా ఓటర్లలో ప్రజాదరణ ఉంది.


## నిన్న తమిళనాడు, కేరళ నేడు కర్ణాటక అసెంబ్లీలోనూ..

రెండు లైన్లలో తన ప్రసంగాన్ని ముగించారు. అనంతరం సభ నుంచి వెళ్లిపోయారు. ఈ వ్యవహారం గవర్నర్ కార్యాలయం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య విభేదాలకు దారితీసింది. ఈ తీరుపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్యగా సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్యలు చేశారు.రెండేళ్లుగా గవర్నర్ థావర్‌చంద్ కాంగ్రెస్ సర్కారు తయారుచేసిన సభా ప్రసంగాలను ఉభయ సభల్లో యథావిధిగా చదివారు. అయితే ఈసారి తన ధోరణిని మార్చుకున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే అంశాలతో తన ప్రసంగాన్ని సిద్ధంచేసిన తీరును ఆయన ముందుగానే ఆక్షేపించారు. దాంతో గురువారం అసలు ఆయన సభకు వస్తారా? రారా? అనే ఉత్కంఠ కనిపించింది. అయితే ఎట్టకేలకు సభకు వచ్చిన ఆయన్ను సీఎం ఆహ్వానించారు. దాంతో ఆ ప్రసంగంపై అభిప్రాయభేదాలు పరిష్కారం అయ్యాయనే అభిప్రాయం కలిగింది. కానీ కొద్దిసేపటికే అలాంటిది ఏమీ లేదని అర్థమైంది. ఆయన కేవలం రెండులైన్లు చదివి సభ నుంచి వెళ్లిపోయారు.

## 'వీబీ-జీరాంజీ'కి పాతపేరే కొనసాగించాలి

దేశవ్యాప్తంగా 'ఎంజీనరేగా బచావో సంగ్రాం' ఆందోళన కార్యక్రమం చేపడుతున్న విషయం తెలిసిందే.

# దిగుబడేకాదు.. కొనుగోళ్లలోనూ రికార్డు



2020-21 లో నమోదు అయిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు రికార్డ్ ను అధిగమించి తాజాగా జరిగిన ఖరీఫ్ సీజన్ లో71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. మద్దతు ధర తో పాటు సన్నాలకు మొట్టమొదటి సారిగా తెలంగాణా ప్రభుత్వం అందిస్తున్న బోనస్ తో కలిపి మొత్తం 18,532.98 కోట్ల రూపాయలను 14.20 లక్షల మంది రైతులకు చెల్లించామన్నారు. ఖరీఫ్ సీజన్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా బద్దంగా రూపొందించిన మేరకు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు కొనుగోలు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా కొనుగోలు ప్రక్రియ ముగిసిందని ఆయన వివరించారు. అందుకు పౌర సరఫరాల శాఖ సిబ్బంది పని తీరును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అధిక దిగుబడులతో పాటు రికార్డ్ స్థాయిలో కొనుగోలు చెసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థ కు సరఫరా చేయడంతో పాటు తెలంగాణా బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న డిమాండ్ ను పట్టి విదేశాలకు ఎగుమతి చేసేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేందుకు గాను రైతులను ప్రోత్సహించేందుకు ప్రోత్సాహకాల ఆవశ్యకతను ఆయన వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ కు బియ్యాన్ని ఎగుమతి చెసేందుకు కుడా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 38,000 కోట్లను నేరుగా రైతుల ఖాతాలో జమ చేయడం కుడా ఒక అరుదైన రికార్డే అని ఆయన చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతాంగం పట్ల అనుసరించిన విధానాలతో సంచలనాత్మక ఫలితాలు సాధించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థలోనూ విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు.అర్హులైన నిరుపేదలందరికీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్నబియ్యం 3.17 కోట్ల మందికి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని,అంటే రాష్ట్ర జనాభాలో 85? లబ్ది పొందుతున్నారని ఆయన వివరించారు.అర్హులైన ప్రతి లబ్దిదారుకు నెలకు ఆరు కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నామన్నారు. సన్నబియ్యం పంపిణీ మీద 13,650 కోట్లు ఖర్చు పెడుతున్నట్టు ఆయన తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఉన్న నాణ్యతా లోపాలు గుర్తించడంతో పాటు అక్రమంగా బ్లాక్ మార్కెట్ కు తరలి పోయే విధానానికి క్లళెం వేసి నాణ్యతా ప్రమాణాలపై కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చామన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సీజన్ కు సీజన్ కు పెరుగుతున్న నేపద్యంలో అందుకు అనుగుణంగా నిల్వ చేసేందుకు మౌలిక సదుపాయాల ఆధునీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ధాన్యాన్ని నిల్వచేసే గోదాముల సామర్థ్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకు పరిమితము అయ్యిందని,ఈ గోదాములను భారత ఆహార సంస్థ,రాష్ట్ర గోదాముల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగుతుందని అయితే నాణ్యతా లోపాలతో నిల్వ ఉంచిన బియ్యం చెడి పోయి రాష్ట్ర ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లుతుందని ఆయన తెలిపారు.ప్రభుత్వం సహకారంతో పాటు ప్రైవెట్ సంస్థల భాగస్వామ్యం తో ధాన్యం నిలువ ఉంచే గోదాములను సైలో పద్దతిలో ఆధునికరించేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు.. ఆధునికీకరణతో తేమ శాతం నియంత్రణలో ఉండడంతో పాటు నషా నివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. అయితే ప్రారంభంలో ఆధునీకరణకు ఖర్చు ఎక్కువే అయినప్పటికీ నిల్వ చేసిన బియ్యం చెడిపోకుండా ఉంటే అది ప్రయోజనం కలిగిస్తుందన్నారు. బీహార్ వంటి రాష్ట్రాల నుండి వలస వచ్చే కార్మికులపై తెలంగాణా రాష్ట్రంలో రైస్ మిల్లులు ఆధారపడుతున్నాయని,ఇటీవల ఆ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే వలస వచ్చిన కార్మికులు వారి వారి స్వస్థలాలకు వెళ్లిపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆయన చెప్పారు. అటువంటి పరిస్థితి తిరిగి ఉత్పన్నం కాకుండా ఉండేందుకు గాను స్థిరమైన కార్మిక వ్యవస్థ ఏర్పాటు ఆవశ్యకతను ఆయన సూచించారు. అదే విదంగా మిల్లింగ్ రంగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు పాటించిన మిల్లర్లకు సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని తప్పిదాలకు పాల్పడితే మాత్రం చర్యలు కఠినాత్మకంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. రాజకీయ వత్తిళ్లకు లొంగకుండా నిబంధనల అమలులో సిబ్బంది కఠినంగా ఉండాలని ఆయన ఉద్బోధించారు. అదే సమయంలో డిఫాల్ట్ అయిన మిల్లులకు ధాన్యం కేటాయింపు ప్రసక్తే లేదని అన్నారు

## నైని కోల్ బ్లాక్ టెండర్లపై విచారణ

చేయడానికి గల కారణాలు సహా ఇతర అంశాలపైనా సింగరేణి అధికారులతో కలిసి ఈ బృందం దర్యాప్తు చేయనుంది. ఈ బృందంలో బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, బొగ్గు శాఖ టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉన్నారు. ఈ బృందానికి కేంద్రం మూడు రోజుల సమయం ఇచ్చింది . మూడు రోజుల్లో సింగరేణిలో పర్యటించి.. నైని కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై విచారణ జరిపి.. ఆ నివేదికను కేంద్రానికి అందజేయాల్సి ఉంటుంది. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో తీవ్రమైన ఆరోపణలు రావడంతో దీనిపై స్పందించిన తెలంగాణ డిప్యూటీ సీఎం, గనుల శాఖ మంత్రి భట్టి విక్రమార్క టెండర్లు రద్దు చేసిన విషయం తెలిసిందే. అలాగే నైని బొగ్గు గని టెండర్ల నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్) కూడా ప్రకటించింది. అయితే.. ఇంతకుముందు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈరోజు(గురువారం) సాయంత్రం 5:00 గంటల నుంచి బిడ్లు ప్రారంభం కావాల్సి ఉంది. పాలనాపరమైన కారణాలతో టెండర్లను రద్దు చేస్తున్నట్లు సింగరేణి అధికారులు ప్రకటించారు. ఇదిలావుంటే భారత రాష్ట్ర సమితి హయాంలో సింగరేణి బోర్డు నామమాత్రంగా ఉండేదని, వారి హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి విద్యుత్ వాడుకొని జెన్‌కో, ట్రాన్స్‌కో డబ్బులు ఇవ్వలేదు. టెండర్ల నుంచి కాంట్రాక్టుల వరకూ అన్నీ కేసీఆర్ కుటుంబమే చూసేది. ఆ సంస్థ సీఎస్ఆర్ నిధులు కూడా దుర్వినియోగం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రైవేటు కంపెనీలకు పనులు కట్టబెట్టారు. సింగరేణి బోర్డు సమావేశం వివరాలు కూడా నా దృష్టికి రావు. సింగరేణిపై కేంద్రం అజమాయిషీ ఎప్పుడూ లేదు. నిధులు లేక జిల్లాలకు రూ.1500 కోట్ల డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ఇవ్వలేదు. బీఆర్ఎస్ హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయి. గత పదేళ్లలో రూ.32వేల కోట్లకుపైగా సింగరేణి అప్పులు పెరిగాయి. సింగరేణి కార్మికులకు ప్రభుత్వం సుమారు రూ.47వేల కోట్లు చెల్లించాలి. నిబంధనలకు విరుద్ధంగా సీఎండీని మరో 4 ఏళ్లు అదనంగా కొనసాగించారు. ప్రస్తుతం సింగరేణిలో ఇన్‌ఛార్జి సీఎండీతో కాలం గడుపుతున్నారని కేంద్ర మంత్రి విమర్శించారు.

## బీఆర్ఎస్ హయాంలోనే సింగరేణి అప్పులు భారీగా పెరిగాయి

మరో 4 ఏళ్లు అదనంగా కొనసాగించారు. ప్రస్తుతం సింగరేణిలో ఇన్‌ఛార్జి సీఎండీతో కాలం గడుపుతున్నారు" అని విమర్శించారు.

## లోయలో పడ్డ ఆర్మీ వాహనం..

అదుపుతప్పి 200 అడుగుల లోయలో పడిపోయింది. వెంటనే రంగంలోకి దిగిన ఆర్మీ, పోలీసు బృందాలు సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. స్పాట్‌లో నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించగా.. గాయపడిన వారిని ఉధంపుర్ మిలిటరీ ఆసుపత్రికి తరలించాయి. ఈ క్రమంలో మరో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని, పలువురు చికిత్స పొందుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సహా జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తదితరులు తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మహిళలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సంతోషంగా ఉంటుందని కాంక్షించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృతంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ముందుకు పోతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క చెప్పారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ కమ్యూనిటీ హాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరెలు పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా వివిధ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు సంతోషంగా ఉండాలంటే స్వతహాగా ఖర్చు పెట్టుకునే స్వేచ్ఛ ఉండాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టగానే మహిళలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. మండల సమాఖ్య లకు బస్సులు ఇస్తున్నామని అట్టి బస్సులు ఆర్టీసీ ద్వారా నెలకు ఒక బస్ కు 70 వేల రూపాయల వరకు ఆదాయం వస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా ఐకెపి మహిళలకు ఇచ్చామని తెలిపారు. గత సంవత్సరం పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ కుట్టించడం ద్వారా మహిళా సంఘాలకు 30 కోట్ల రూపాయలు ఆదాయం లభించినట్లు తెలిపారు. 560 మంది మహిళలకు మేడారంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరై కట్టుకోలేని పేదలకు లక్ష రూపాయలు రుణం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఫిష్ అవుట్లెట్లు మంజూరు చేసామన్నారు. మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలని మహిళా సంఘాలు బాధ్యత తనకు అప్పగించారని తెలిపారు. పేదరికం తగ్గాలని



ప్రభుత్వ పథకాలు వల్ల ప్రయోజనం చేకూరాలని ఆమె తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు ఏదైనా ప్రమాదం వల్ల మరణిస్తే 10 లక్షల రూపాయల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నామని, ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 410 మందికి ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల మంది మహిళలు మహిళ సంఘాలలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. రుణం తీసుకున్న సభ్యులు మరణిస్తే 2 లక్షలు రుణ బీమా ద్వారా మాఫీ చేస్తున్నామన్నారు. మహిళలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సంతోషంగా ఉంటుందని తెలిపిన మంత్రి మార్చి నెలాఖరు వరకు ప్రతి ఒక్క మహిళలకు చీర అందిస్తామన్నారు. 3500 కోట్లు గత ప్రభుత్వం పావల వడ్డీ ఎగ్గొట్టిందని కానీ తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మహిళల పేరుతో వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. సంఘాలను ఇబ్బంది పెట్టకుండా రుణాలు ఇప్పించాలని సోలార్ పెట్రోల్ బంకులు, క్యాంటీన్లు వంటి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి 63 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 15 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ప్రధాన లక్ష్యంతో మహిళలకు ఇందిరమ్మ క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్తు వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మన నియోజకవర్గంలో విఓ సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విఓ సంఘాలకు 10 ఎకరాలు భూమిక ఇస్తే అందులో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్టీసీకి నెలకి 400 కోట్ల రూపాయలు చెల్లిస్తూ ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. నూతన రేషన్ కార్డులు మంజూరుతో పాటు పాత కార్డులో మార్పులు చేర్పులు చేశామన్నారు. ప్రతి ఒక్కరికి ఆరు కేజీల బియ్యం ఇస్తున్నామన్నారు భూపాలపల్లి మున్సిపాలిటీలో నూతన రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఏటా 14 వేల కోట్ల రూపాయల భారం పడినప్పటికి పేదలకు ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నామన్నారు. 200 లోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. 21,000 కోట్ల రూపాయలు రుణమాఫీ చేసామన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీకి డివిజన్ కి 20 చొప్పున 600 ఇండ్లు మంజూరు చేసామన్నారు. నియోజకవర్గంలో 3500 మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో 12 కోట్లతో ఎమ్మారై యంత్రం ఏర్పాటు చేశామన్నారు. 203 వైద్య, ఇతర సిబ్బంది పోస్టులు భర్తీ చేశామన్నారు. 14 కోట్లతో ఆసుపత్రి ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. 165 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. ఏటీసీ, నర్సింగ్ కళాశాలను నిర్మించినట్లు తెలిపారు. 5.50 కోట్లతో మహిళా సంఘ భవనం, 5.50 కోట్లతో వృత్తి శిక్షణ భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. 200 కోట్ల రూపాయలు రహదారుల అభివృద్ధికి సీతక్క మంజూరు చేశారని ఈ సందర్భంగా అభినందించారు. కోటంచ అభివృద్ధికి 12 కోట్లు కేటాయించి యాదగిరిగుట్ట మాదిరిగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీలో 21326 మందికి ఇందిరమ్మ చీరలు పంపణి చేస్తున్నట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయ సంఘాల సభ్యులతో పాటు 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ చీరెలు పంపిణీ చేసస్తున్నామన్నారు. వార్డుల వారిగా షెడ్యూల్ తయారు చేసి ప్రత్యేక అధికారులను నియమించి చీరల పంపిణీ చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమాలు కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని సూచించారు. మహిళల అభివృద్ధికి కలెక్టరేట్ తో పాటు మండల కార్యాలయాలలలో మహిళ క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు ఫిష్ మొబైల్ అవుట్లెట్స్ మంజూరు చేసినట్లు తెలిపారు. రెండు మెగా వాట్స్ సోలార్ విద్యుత్ ప్లాంట్ లు మంజూరు చేసామన్నారు. 10 మండలాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సులు మంజూరు చేసామని అన్నారు. కుట్టు మిషన్లు, అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా పాఠశాలలో అభివృద్ధితో పాటు విద్యార్థులకు యూనిఫామ్ కుట్టించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మహిళలకు 38 ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. అంతకు ముందు మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ కాలనీలో రామాలయం నుండి 5 ఇంక్లైన్ జంక్షన్ వరకు 2కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్డు, సైడు కాలువ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సమావేశంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జోన, మెప్మా పిడి రాజేశ్వరి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



# కాలిబాట నుండి కార్ల వరకు..

- ఎడ్ల బండి నుండి హెలికాప్టర్ వరకు మేడారం రాకా...
- హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క

**ములుగు బ్యూరో, జనవరి22(జనం సాక్షి):** మేడారంలోని సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకోవడానికి వచ్చే భక్తులు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క అన్నారు. గతంలో కాలినడక నుండి కార్ల మీద వచ్చిన భక్తులు నేడు ఎడ్ల బండ్లను వదిలి హెలికాప్టర్ పై రావడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో తంబి సంస్థవారు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అమ్మవార్లను సత్వరమే దర్శనం చేసుకోవడానికి సమయం వృధా కాకుండా హెలికాప్టర్ సేవలను రాష్ట్ర పర్యాటక శాఖ చేపట్టిందని, హనుమకొండ జిల్లా కేంద్రం నుండి మేడారం వరకు తిరిగి మేడారం నుండి హనుమకొండ కు వెళ్లేందుకు అతి తక్కువ ధరలలో ఒక్కొక్కరికి 31వేల రూపాయల టికెట్ నిర్ణయించిందని, అంతేకాకుండా మేడారం పరిసర ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా పర్యటించడానికి 4 వేల 8 వందల రూపాయల టికెట్ ను ఖరారు చేశారని వివరించారు. గతంలో మహా జాతర సందర్భంగా అప్పటి పాలకులు నామమాత్రంగా నిధులు కేటాయించగా నేడు రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం గద్దెల పునరుద్ధరణ పనులతో పాటు అభివృద్ధి కార్యక్రమాల కోసం 2 వందల 51 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని అన్నారు. గురువారం నుండి ఈ నెల 31 వరకు వీరి సేవలు కొనసాగుతాయని తెలిపారు. థంబి ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ సర్వీస్ నిర్వహిస్తుంది. బుకింగ్ కోసం 9676320139, 8530004309, 7660939509 నెంబర్లను సంప్రదించాలని, www.helitaxii.com వెబ్సైట్లో బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంధాలయ చైర్మన్ రవిచందర్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి అనుగ్రహం ఉంటేనే

# అన్ని రంగాల్లో రాణిస్తాం

- పెద్దమ్మ గుడి దేవాలయా ప్రహరీ గోడకు నిర్మాణానికి 10 లక్షల రూపాయలు కేటాయిస్తా
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**ఆత్మకూర్, జనవరి 22 (జనం సాక్షి):** ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి అనుగ్రహం ఉంటేనే అన్ని రంగాలలో రాణిస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడి దేవాలయాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి- రాజు, ముదిరాజ్ కులస్తులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయానికి చుట్టు ప్రహరీ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే పండు నుంచి పది లక్షల రూపాయలు కేటాయిస్తానని భరోసా ఇచ్చారు.



దేవాలయ నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసి ఉత్సవాలు నిర్వహిస్తే అమ్మ అనుగ్రహం అందరిపై ఉంటుందన్నారు. దేవాలయం పక్కన దుర్వాసన దుర్గంధం వెదజల్లుతుంది వెంటనే శుభ్రం చేయించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. జాతీయ రహదారిపై విద్యుత్ దీపాలు వెలగడం లేదని గ్రామపంచాయతీలో నిధులు లేవని స్థానిక సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ నేషనల్ హైవే అధికారులతో ఫోన్లో మాట్లాడి వెంటనే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కమలాపురం రమేష్, సర్పంచులు తడుక నీరజ- శ్రీనివాస్ గౌడ్, బూర దేవేంద్ర, మందపల్లి మరియా ప్రసాద్, గఫూర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పరికరాల వాసు, ఏరుకొండ రవీందర్ గౌడ్, ముద్దం కృష్ణంరాజు, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, వ్యవసాయ అధికారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుంది

- చట్టవిరుద్ధ కేసులను న్యాయస్థానంలో ఎదుర్కొంటాం
- కేటీఆర్‌పైన పెట్టిన ఏసీబీ, ఈడీ, సిట్ కేసులతో ప్రభుత్వం ఏం సాధించలేదు
- మాజీ బీసీ కమిషన్ సభ్యులు , అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ ఉపేంద్ర



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు వాగ్దానాలతో ప్రజలను ప్రలోభ పెట్టి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినప్పటికీ 420 హామీలు 6 గ్యారంటీలు ఇచ్చి బాండ్ పేపర్లు రాసి ఇచ్చి ప్రజలని మోసం చేస్తూ పరిపాలన సాగిస్తున్నారని వాటిని ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం కమిషన్ల పేరుతో, సిట్ పేరుతో నోటీసులు ఇవ్వడం, ఇన్వెస్టిగేషన్ పేరుతోటి దబదబాలుగా పిలవడం అత్యంత దుర్మార్గమని చట్ట విరుద్ధమని ఆయన అన్నారు కేటీఆర్ గారి మీద ముఖ్యమంత్రి ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ రాక్షస ఆనందం పొందుతున్నారని అన్నారు కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న అవినీతి ఇసుక దందాలు భూ దండాలు కాంట్రాక్టులలో అవినీతి బీసీ రిజర్వేషన్లు మోసం దళితుల భూముల గుంజుకోవడంలో కేసులు పెట్టడం మూసి సుందరీకరణ పేరుతో అవినీతిని ప్రశ్నించినందుకు కేటీఆర్ గారికి సిట్ నోటీస్ లివటం రాజకీయంగా కక్ష సాధింపు ధోరణి మానుకోవాలని ఇప్పటికైనా ఆధారాలు లేకుండా కేసులు పెడితే తప్పుడు కేసులను కోర్టుల్లో ఎదుర్కొంటామని గతంలో ఫార్ములా ఈ కేస్ హైకోర్టు స్టే విధించిందని ఫోన్ టాంపరింగ్ కేసులో హరీష్ రావు గారికి సుప్రీంకోర్టు క్లీన్ సీట్ ఇచ్చిందని కాళేశ్వరం కమిషన్ పేరుతో వేధించిన కేసులో కేసీఆర్ గారికి హరీష్ రావు గారికి హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ తపదపాలుగా ఈ ప్రభుత్వం ప్రజలలో వ్యతిరేకత పెరిగినప్పుడు అవినీతి అక్రమాలు బయటపడినప్పుడు ప్రశ్నిస్తున్న నాయకుల పై కేసులు పెట్టి ప్రజల దృష్టిని మళ్లించాలని ప్రయత్నించిందని ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలను ప్రజల్లో ఎండగడతామని ఆయన అన్నారు కేసుల పేరుతో ఇన్వెస్టిగేషన్ పేరుతో నోటీసుల పేరుతో ఉద్యమకారులను భయపెట్టలేరని రాబోయే కాలంలో తప్పకుండా ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వారి విధానాలని వారి అరాచకాలని వారి అన్యాయాలని చీల్చి చెండాడుతోమని ఆయన అన్నారు ఇప్పటికైనా ముఖ్యమంత్రి చట్ట విరుద్ధమైన కేసులను పెట్టి ఏమి సాధించలేవని హితవు పోలికారు

## తెలుగు సినిమాలకు

# గద్దర్ అవార్డులు

**ఫిబ్రవరి 3లోగా దరఖాస్తులకు ఆహ్వానం**

**హైదరాబాద్, జనవరి 22 (జనంసాక్షి) :** 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ తెలిపింది. ఫీచర్ ఫిలిమ్స్, జాతీయ సమైక్యతపై ఫీచర్ ఫిలిమ్స్, పర్యావరణం, హెరిటేజ్, చరిత్ర, సామాజిక చైతన్యం, బాలల చిత్రాలు, చలన చిత్ర రంగంలో టెక్నీషియన్లు, డాక్యుమెంటరీ, షార్ట్ ఫిలిమ్స్,సినిమా రంగంపై బుక్స్ తదితర రంగాలలో ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సామాజిక స్పృహను ప్రతిబింబించే చిత్రాలకు 'ఉత్తమ సామాజిక సందేశ చిత్రం' అవార్డు, ప్రత్యేక విభాగంలో డా. సి. నారాయణరెడ్డి అవార్డులను అందజేయనున్నామన్నారు.

ఈ గద్దర్ అవార్డులకు అర్హులైన నిర్మాతలు, ఇతర దరఖాస్తుదారులు అవార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, మార్గదర్శకాలను జనవరి 31, 2026 వరకు పొందవచ్చని, తగిన డాక్యుమెంట్లతో కూడిన ఎంట్రీల సమర్పణకు ఫిబ్రవరి 3 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవార్డుల వివరాలు వెబ్‌సైట్ లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపే దరఖాస్తులను సమర్పించాలని అర్హులైన నిర్మాతలను కోరారు.

# నేడు కేరళ పర్యటనకు ప్రధాని మోడీ

- ఎన్‌డిఎ కూటమిలో చేరిన ట్వంటీ20 పార్టీ

**తిరువనంతపురం, జనవరి 22 (జనంసాక్షి) :** ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన కేరళలో బీజేపీకి మరింత బలం చేకూరే కీలక పరిణామం చోటుచేసుకుంది. ట్వంటీ20 పార్టీ లాంఛనంగా ఎన్డీయే కూటమిలో గురువారంనాడు చేరింది. బీజేపీ కేరళ చీఫ్ రాజీవ్ చంద్రశేఖర్‌ను ట్వంటీ20 చీఫ్ సాబూ ఎం జాకబ్ కలుసుకుని ఎన్డీయేకు తమ పార్టీ మద్దతును ప్రకటించారు. శుక్రవారం ప్రధాని కేరళ పర్యటనకు వస్తున్న సందర్భంగా ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. జాబూ ట్వంటీ20 పార్టీతో పొత్తును చంద్రశేఖర్ స్వాగతించారు. ఎన్డీయే విజన్‌కూ, సాబూ విజన్‌కు చాలా దగ్గర సామీప్యం ఉందని, సాబూ చేరికతో అభివృద్ధి చెందిన కేరళ నిర్మాణం దిశగా చేస్తున్న తమ ప్రయత్నాలకు మరింత బలం చేకూరుతుందని అన్నారు. అభివృద్ధి, ప్రగతి, నిజమైన ప్రజాసేవకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ/ఎన్డీయే కట్టుబడి ఉన్నాయని, తమ అభివృద్ధి సిద్ధాంతాలను విశ్వసించే ప్రతి ఒక్కరూ తమకు సహజ భాగస్వాములేనని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చంద్రశేఖర్ పేర్కొన్నారు. విజయవంతమైన పారిశ్రామికవేత్తగా, ఉపాధి సృష్టికర్తగా, రాజకీయ నేతగా సాబూను తాను ఎంతగానో అభిమానిస్తానని చెప్పారు. 'వికసిత కేరళం' విజన్ ఇప్పుడు కేరళ అంతటా ప్రతిధ్వనిస్తోందనడానికి ఎన్డీయేలో సాబూ చేరికే నిదర్శనమని అన్నారు. కాగా, రాష్ట్రంలో ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరువనంతపురం మేయర్ పోస్టును బీజేపీ సొంతం చేసుకోవడం ఆ పార్టీ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపింది. షెడ్యూల్ ప్రకారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 23వ తేదీ శుక్రవారంనాడు కేరళలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా తిరువనంతపురంలో పలు కొత్త ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు. బహిరంగ సభలోనూ పాల్గొంటారు.

# ముగిసిన చంద్రబాబు దావోస్ పర్యటన

- నాలుగు రోజుల పాలు బిజీగా కార్యక్రమాలు
- దిగ్గజ పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు
- నేటి ఉదయం హైదరాబాద్‌కు చేరిక

**అమరావతి, జనవరి 22 (జనంసాక్షి) :** దావోస్ పర్యటన ముగించుకుని స్వదేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బయల్దేరారు. శుక్రవారం ఉదయం 8.25 నిమిషాలకు హైదరాబాద్ కు చేరుకోనున్నారు. మొత్తంగా నాలుగు రోజుల దావోస్ పర్యటనలో 36కు పైగా కార్యక్రమాలకు సీఎం హాజరయ్యారు. ఇజ్రాయెల్, యూఏఈ, స్విట్జర్లాండ్ దేశాల ప్రతినిధులతో 3 సమావేశాల్లో పాల్గొన్న చంద్రబాబు.. ప్రపంచ ఆర్థిక సదస్సు వేదిక వద్ద ఆర్సెలార్ మిట్టల్ చైర్మన్ లక్ష్మి మిట్టల్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, ఐబీఎం సీఈఓ అర్వింద్ కృష్ణ సహా 16 దిగ్గజ పారిశ్రామిక వేత్తలతో కీలక సమావేశం నిర్వహించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో నిర్వహించిన 9కి పైగా సెషన్స్, సమావేశాల్లో పాల్గొన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం వేదిక నుంచి ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక రంగ పోకడలు, పారిశ్రామిక వేత్తల ఆలోచనలు తెలుసుకునేందుకు ఉపకరించాయని సీఎం చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ను మరింత విస్తరించేందుకు రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ పాలసీలను అంచనా వేసేందుకు కూడా సదస్సు దోహదం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2025 దావోస్ పర్యటన ద్వారా ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు సాకారం అయ్యాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. మూడు రోజుల పాటు జరిగిన సమావేశాల ద్వారా గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యవసాయం, టూరిజం లాంటి రంగాల్లో ఏపీ సాధిస్తున్న విజయాలను వనరుల్ని సమర్ధంగా వివరించామని పేర్కొన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రపంచ దిగ్గజ సంస్థలు భారత్ వైపు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయని అన్నారు. యువ శక్తి, సమర్థ నాయకత్వం, పాలసీల కారణంగా ప్రస్తుతం ప్రతీ రంగంలో భారత్ లో కంపెనీలకు అవకాశాలు పెరుగుతున్నాయని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఇక, యూరప్ లోని తెలుగు ప్రజలతో మమేకం అవుతూ తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొని వారిలో చంద్రబాబు ఆత్మవిశ్వాసం నింపారు. ఇక, దావోస్ వేదికగా జాతీయ అంతర్జాతీయ మీడియా సంస్థల ప్రతినిధులకూ ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చారు. అయితే, రేపు ఉదయం 8.25 గంటలకు హైదరాబాద్ చేరుకుని.. అక్కడి నుంచి అమరావతికి బయల్దేరనున్నారు. ఉదయం 11.30 గంటల నుంచి అమరావతి సచివాలయంలో అధికారిక కార్యక్రమాల్లో చంద్రబాబు పాల్గొంటారు.



# ఢిల్లీ పబ్లిక్ పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన

**మహబూబాబాద్ బ్యూరో, జనవరి 22(జనం సాక్షి):** రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పిల్లలకు రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై జిల్లా రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పక్కగా పాటించడం, జీబ్రా క్రాసింగ్ లను వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరించడం, వాహనాలను ఓవర్టేక్ చేయడం, రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కాగా పాటించవలసిన అంశాలు సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక దూరం ప్రయాణించినప్పుడు విశ్రాంతి తీసుకోవడం, శీతాకాలం వర్షాకాలం లలో రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై పిల్లలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ ఎం.సాయి చరణ్, వెంకట్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

# అఖండ్ అమెరికా భ్రమ

ఒక 'చిత్రం' వేల మాటలు మాట్లాడుతుందన్న సామెతను నిజం చేస్తున్న సంఘటన ఇది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, తన సోషల్ మీడియా ప్లాట్ఫారమ్ 'ట్రూత్ సోషల్'లో ఒక మ్యాప్ ను పోస్ట్ చేసి, అంతర్జాతీయ వ్యంగ్యం, కోపం, విమర్శల తుఫానును రేపాడు. ఆ మ్యాప్ లో ఉత్తర అమెరికా ఖండం పూర్తిగా "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా"గా కన్పించేలా చిత్రించబడి, కెనడా, గ్రీన్ల్యాండ్ (డెన్మార్క్ పాలనలో ఉండే ద్వీపం), వెనెజువెలా దేశాలు అమెరికాలో విలీనమైనట్లు చూపబడ్డాయి. ఇది కేవలం ఒక సాంఘిక మాధ్యమ పోస్టుగా మిగిలిపోకుండా, అమెరికన్ ప్రత్యేకత్వవాదం, ప్రపంచ వ్యవహారాలపై అజ్ఞానం అలాగే రాజకీయ ప్రచారానికి వాస్తవాలను వంచించే ప్రయత్నం యొక్క ప్రతీకగా మారింది.



ఈ మ్యాప్ పై ప్రభావిత దేశాలు చూపిన ప్రతిస్పందన నిస్సందేహంగా తీవ్రంగా ఉంది. కెనడా, అమెరికా యొక్క సన్నిహిత మిత్ర రాజ్యం.అంతే కాదు వ్యాపార భాగస్వామి అయినప్పటికీ, స్పష్టమైన నిరసనను వ్యక్తం చేసింది. కెనడియన్ పౌరులు, మాధ్యమాలు దీనిని హాస్యాస్పదంగా, అవివేకంగా తీసుకున్నారు. కెనడా యొక్క స్వాభిమానాన్ని, దాని స్వంత గుర్తింపును ఈ చిత్రం తప్పుగా అర్థం చేసుకుందనే భావన వ్యక్తమైంది. అమెరికన్ విస్తరణవాద భయాలను ఇది మళ్లీ రేపిందని అనేకులు భావించారు. వెనెజువెలా ప్రభుత్వం దీనికి విస్తృతమైన నిరసన తెలిపింది. దేశాన్ని ఒక అమెరికన్ రాష్ట్రంగా చూపించడం ద్వారా, వెనెజువెలాపై అమెరికా చారిత్రక, సమకాలీన హస్తక్షేపం భావనను ఈ చిత్రం బలపరిచిందని వారు భావించారు. ఇది వెనెజువెలా సార్వభౌమత్వాన్ని తిరస్కరించడానికి సమానమని వారు పేర్కొన్నారు. గ్రీన్ల్యాండ్ సంబంధించి, ఇది డెన్మార్క్ యొక్క స్వయంప్రతిపత్తి గల భూభాగం. ట్రంప్ గతంలో గ్రీన్ ల్యాండ్ ను కొనాలనే ఆలోచనను వ్యక్తం చేసిన సందర్భం ఉన్నందున, ఈ మ్యాప్ ను అతని విస్తరణవాద ఆకాంక్షలకు మరొక నిదర్శనంగా చూస్తున్నారు. డెన్మార్క్ మాధ్యమాలు దీనిని గంభీరంగా తీసుకోకపోయినా, ఇది అమెరికా యొక్క భౌగోళిక అజ్ఞానానికి నిదర్శనమని వ్యంగ్యంగా కామెంట్స్ చేశాయి.

ప్రపంచ మాధ్యమం మరియు విశ్లేషకుల వ్యాఖ్యానాలు విమర్శనాత్మకంగానే ఉన్నాయి. దీనిని విస్తృతంగా రెండు కోణాల్లో చర్చించారు: ఒకటి, ట్రంప్ చేసింది సాదాసీదాగా తప్పు మాత్రమే కాదు,ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని నిర్లక్ష్యంగా ధిక్కరించటం; రెండు, స్పష్టమైన రాజకీయ లక్ష్యంతో కూడిన ప్రచార సాధనం. అనేక ప్రముఖ అంతర్జాతీయ పత్రికలు ఈ చిత్రం పాఠ్యపుస్తకాల్లోని ప్రాథమిక భౌగోళిక నిజాలతో వ్యతిరేకంగా ఉన్నందున దీనిని "భ్రమపూరితమైనది" - "అపాయకరమైన అజ్ఞానం"గా వర్ణించాయి. వారి అభిప్రాయంలో, ఇది ట్రంప్, అతని అనుచరులకు ప్రపంచ వ్యవహారాలు, అంతర్జాతీయ సంబంధాలు ఇతర సంస్కృతుల పట్ల ఉన్న అల్పభావనను ప్రతిబింబిస్తుంది. ప్రపంచ ప్రింట్ మీడియా సంపాదకీయాలు దీనిని "అమెరికా మొదట" భావజాలం యొక్క తీవ్రమైన అభివ్యక్తిగా చూశాయి, ఇక్కడ ఇతర దేశాలు కేవలం కొనుగోలు చేయదగిన వస్తువులు లేదా విస్తరించదగిన భూమిగా మాత్రమే గుర్తించబడతాయి.

కొందరు విశ్లేషకులు దీన్ని మరింత లోతుగా పరిశీలించారు. వారు ఈ చిత్రాన్ని ఒక నియోజకవర్గానికి చేసే సందేశంగా చూశారు. ఇది అమెరికా యొక్క అణు ఆయుధ శక్తి ఆధిపత్యాన్ని గొప్పగా చూపించడానికి ఒక ప్రతీకాత్మక చర్య. మ్యాప్లో వెనెజువెలా చేర్చబడటం ప్రత్యేక శ్రద్ధకు పాత్రమైంది. ట్రంప్ - అతని రాజకీయ శిబిరం ప్రతిపక్షాన్ని (డెమాక్రట్స్) వామపక్షం, సోషలిజం తో అనుబంధించడం వలన, ఒక సోషలిస్ట్ దేశం అయిన వెనెజువెలాను చిత్రంలో చేర్చడం వారి రాజకీయ ప్రచారానికి ఉపయోగపడుతుందని భావించవచ్చు. అంటే, "అమెరికన్ కాకపోయినవారు" లేదా "మనతో ఏకీభవించనివారు" అమెరికాలో భాగమే అని చూపించడం. ఇది విభజన కలిగించే రాజకీయాలకు ఒక సాధనం.

ఈ సంఘటన నుండి రెండు ప్రధాన అంశాలు బయటపడతాయి. మొదటిది, ఆధునిక రాజకీయాల్లో వాస్తవాలు మరియు ప్రతీకల శక్తి. ట్రంప్ చాలా సార్లు వాస్తవాలను విస్మరించి, భావోద్వేగాలు మరియు గుర్తింపును లక్ష్యంగా చేసుకున్న ప్రతీకాత్మక చర్యల ద్వారా ప్రజలను చేరుకోవడానికి ప్రయత్నించాడు. ఈ మ్యాప్ అదే వ్యూహం యొక్క భాగం. ఇది ఒక వాస్తవిక చిత్రం కాదు, కానీ ఒక భావనను ప్రచారం చేస్తుంది: అమెరికా అన్నీ, అన్నింటికంటే ఉన్నతమైనది మరియు ఇతర దేశాలు దాని భాగమయ్యేందుకు యోగ్యమైనవి. రెండవది, ఇది అంతర్జాతీయ సంబంధాలపై ప్రభావం. అటువంటి చర్యలు అమెరికా యొక్క మిత్రరాజ్యాలలో నమ్మకాన్ని బలహీనపరుస్తాయి. కెనడా వంటి దేశం తన స్వంత స్నేహితుడిని అనుమానించేలా చేస్తాయి. ఇది అమెరికా యొక్క ప్రపంచ నాయకత్వ స్థానాన్ని దెబ్బతీస్తుంది, ఎందుకంటే నాయకత్వానికి విశ్వసనీయత ముఖ్యం.ఇతర దేశాల గౌరవం పొందటం అవసరం. చివరగా, ఈ మ్యాప్ వైరల్ కావడం ఒక సాంస్కృతిక విక్షేపాన్ని చూపిస్తుంది. ఇది రాజకీయ వ్యాఖ్యానంలో వాస్తవాల కంటే భావోద్వేగాలు ప్రాధాన్యత పొందే యుగాన్ని సూచిస్తుంది. ఇది అధికారంలో ఉన్న లేదా అధికారాన్ని కోరుకునే వ్యక్తులు, ప్రపంచాన్ని వారి భావనలకు అనుగుణంగా మార్చి చిత్రించే ప్రయత్నాలను ప్రతిబింబిస్తుంది. ఇది రాజకీయంగా ఒత్తిడి లేని వ్యక్తులకు కూడా హెచ్చరికగా ఉండాలి. ప్రపంచం సంక్లిష్టమైనది, దాన్ని సరళీకృత మ్యాప్ ల ద్వారా అర్థం చేసుకోలేము. ట్రంప్ యొక్క ఈ మ్యాప్ నిజమైన అమెరికాను కాదు, కానీ ఒక భ్రాంతిని ప్రతిబింబిస్తుంది. ఒక భ్రమ, ఒక ఉన్మాదం లో మునిగి ఉన్న అతిపెద్ద శక్తి యొక్క వికృత భ్రమ. ఈ భ్రమ, నిజమైన ప్రపంచంలో, విలువైన మైత్రిని, నమ్మకాన్ని, సహకారాన్ని, నైతిక విలువలను కోల్పోవడానికి కారణమవుతుంది.



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్
9849328496

# నేటి యువతలో ఆయన స్ఫూర్తి క్షీణిస్తోంది

భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో జనవరి 23కు ప్రత్యేకత ఉంది. 1897 జనవరి 23న ఒరిస్సాలోని కటక్లో జన్మించారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆయన చూపించిన ధైర్యం,ధూ రదృష్టి భార త యువతకు నేటికి స్ఫూర్తి దాయకం,స్వాతంత్ర్యం విజ్ఞప్తులతో రాదు అనిసాయుధ పోరాటంతోనే సాధ్య మనివిశ్వశించిన నేతాజీ ఆజాద్ హింద్ ఫౌజ్ను స్థాపించి బ్రిటిష్ వారికి గట్టి సవాల్ విసిరినారు. జై హింద్ అనే నినాదం ద్వారా నాకు రక్తాన్ని ఇవ్వండి మీకు స్వతంత్ర్యాన్ని ఇస్తాను అనే మాటలకు యువత స్ఫూర్తి పింది,దేశ స్వాతంత్ర్య పోరాటానికి కొత్త దిశను



చూపా యి.రెండవ ప్రపంచ యుద్ధ కాలం లో జపాన్ మొదలగు దేశాల పర్యటనచేసి నిధులు సమకూర్చుకోవడంతో పాటు భారత్కు మద్దతు కూడకొట్టుటలో సఫలి కృతులు అయ్యారు. సుభాష్ చంద్రబోస్ మరణం నేటికి మిస్టరీగానే ఉంది.ఆయన సేవలు, త్యాగానీరతి గుర్తించి జనవరి 23ను పరాక్రమధివాస్ జరుపుకోవడం జరుగుతుం ది.నేటి యువత వ్యక్తిగతస్వా ర్థాన్ని పక్కన బెట్టి జాతీయ ప్రయోజనాల కోసం పనిచేయలన్న ఆయన సందేశం నేటి యువతలో క్షిణిస్తుంది. ఆయన ఆశయాల కొనసాగింపు అతనికి నిజమైన నివాళి.

ఉమాశేషారావు వైద్య, 9440408080

# శీల సంపదలు

ఓ మానవులారా!
తరాలుగా కన్యత్వం
లోతైన పరస్పరంగా
శృంగార సమ్మేళనంగా
లైంగిక సమ్మోహనంగా
బలమైన
అభిప్రాయాలతో
సమాజంలో
పాతుకుపోయినది
బహిరంగ ప్రపంచంలో
నిలిచిపోయినది
మానవ కన్యత్వం మూడు
రకాలు
ఒకటి పుంలింగం రెండవది
స్త్రీలింగం
చివరిది అర్ధనారీశ్వరమైన..
నపుంసకలింగం!!
ఆది నుండే వస్త్రాధారణలో
స్త్రీలింగానికి కొన్ని ఆంక్షలు
కొన్ని కఠిన నియమాలు
సమానత్వం దూరం
చేయడం
గమ్యం కాదు.. లక్ష్యం కాదు!
సృష్టించిన పుంలింగం కన్నా
తీర్చిదిద్దిన స్త్రీలింగంలో..
అణువణువు ప్రవహించే
అందాలు
సంభోగపరమైన ఆకర్షణలు
ప్రకృతి తీగల సంబంధాలు!!
శీల సంపదలు రక్షించడం



వివాహ బాంధవ్యాలు
గౌరవించడం
అనివార్యమై నిలిచింది!
ఆనవాయితై కొనసాగింది!!
ఏమైనా శీల సంపద అంటే..
చెడిపోని కన్యత్వం మాత్రమే
కాదు!
అంతకుమించిన గొప్పదైన
హృదయం!!
ఆదర్శమైన జీవన విధానం!!

కోటం త్రిశూల్
8523005678

# విస్తరించాలంటే ఇంగ్లీష్ అవసరం తప్పదు

ప్రస్తుతం చైనాలో కూడా ఇంగ్లీష్ నేర్చుకునే వాళ్ళు పెరుగుతున్నారు. చైనా వాళ్ళు మెడిసిన్, ఇంజనీరింగ్, స్పేస్ సైన్స్ ఇలాంటి కోర్సులు అన్నీ వాళ్ళ చైనీస్ భాష లో నే చదువుతారని అనుకునే వాళ్ళం. అయితే మారుతున్న రోజుల్ని బట్టి వాళ్ళు కూడా ఇంగ్లీష్ భాష నేర్చుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం 400 మిలియన్ల చైనీయులు ఇంగ్లీష్ భాష నేర్చుకోవడానికి ఆయా శిక్షణా కేంద్రాల్లో చేరారు. చైనా,జపాన్ లాంటి దేశాల్లో వాళ్ళ సొంత భాషల్లోనే అన్నీ నేర్చుకుంటున్నారు. మన దేశం లో అది ఎందుకు వీలుపడదు అని కొందరు అంటూ ఉంటారు.

చైనా మొత్తం లో ఒకే భాష అధికార భాష. అది మాండరిన్, దేశం మొత్తం లో 80 శాతం మందికి పైగా ఆ భాష మాట్లాడతారు.అలాగే జపాన్ దేశం లో నిహాంగో అనబడే జపనీయ భాషని 99 శాతం మంది మాట్లాడుతారు. కాబట్టి ఆయా భాషల్లో బోధించడం కష్టమేమీ కాదు.అదే మన దగ్గర చూస్తే దేశ భాష గా చెప్పబడే హిందీ ని 40 శాతం మందే మాట్లాడుతారు.మిగతా వాళ్ళు వివిధ ప్రాంతీయ భాషలు మాట్లాడుతారు. దానివల్ల పెద్ద సంఖ్య లో ఉండే నిరుద్యోగులకు లింక్ భాష గా ఇంగ్లీష్ ఉంటేనే ఏ ఇతర రాష్ట్రానికి అయినా వెళ్ళి ఉద్యోగం పొందడానికి వీలుగా ఉంటుంది. అందునా చైనా లాంటి దేశం లోనే భేషజాలు విడిచి ఇంగ్లీష్ నేర్చుకుంటున్నారు.



గ్లోబలైజేషన్ వల్ల ప్రపంచం కుగ్రామమై పోయింది. ఇంటర్నెట్ లేనిదే రోజు గడవడం కష్టమైపోయింది.ఇంగ్లీష్ భాష కి ఉన్న ప్రాముఖ్యం మీడియా పరంగా కూడా బాగా పెరిగింది. నెట్ లో ఉన్న 54 శాతం వార్తా చానెళ్ళు ఇతర వెబ్ సైట్ లు ఇంగ్లీష్ లోనే వెలువడుతుండగా, రెండవ స్థానం లో ఉన్న స్పానిష్ భాషలో కేవలం 5.6 శాతం మాత్రమే వెలువడుతున్నాయి. 98 శాతం సైన్స్, సాంకేతిక పరమైన మేగజైన్లు ఆంగ్లంలో వెలువడుతున్నాయి.2022 లో లభ్యమైన డేటా ప్రకారం అ భాషని నేర్పడానికి వెలసిన శిక్షణా కేంద్రాల మార్కెట్ 19.17 అమెరికన్ బిలియన్ డాలర్లు గా ఉన్నది.

ఇంగ్లీష్ ఈ రోజున 58 దేశాల్లో అధికార భాషగా ఉంది. 142 దేశాల్లో తమ ఎడ్యుకేషన్ పాలసీ లో తప్పనిసరి గా చేశారు. మన సాఫ్ట్ వేర్ ఉద్యోగులు ప్రపంచం అంతటా వ్యాపించడానికి ఆంగ్ల భాషా పరిజ్ఞానమే కారణం. ఒకప్పుడు ఇంగ్లీష్ లో రాసే భారతీయులు చాలా తక్కువ గా ఉండేవారు. ప్రస్తుతం యువతరం ఐ.టి. రంగం ఇంకా ఇతర కార్పోరేట్ రంగాల నుంచి ఎంతోమంది ఇంగ్లీష్ లో రాస్తూ దేశ విదేశాల్లో మిలియన్ల కొద్దీ కాపీలు అమ్ముతున్నారు. ఆ మేరకు పబ్లిషింగ్ రంగం కూడా కొత్త పుంతలు తొక్కుతోంది.అమిత్ త్రిపాఠి,దేవ దత్ పట్నాయక్, దుర్జయ దత్తా, చేతన్ భగత్, ఆనంద్ నీలకంఠన్, రవీందర్ సింగ్, అనూజా చౌహాన్, శరత్ కొమ్మరాజు, సుదీప్ నాగర్కర్,ఇలాంటి ఎందరో నేడు ఇంగ్లీష్ లో లవ్,క్రైం,థ్రిల్లర్,స్పిరిచ్యూల్ వంటి జానర్ లలో రాస్తూ భారత దేశ సరిహద్దులు దాటి తమ గళాన్ని వినిపిస్తున్నారు. కనుక ఈ రోజున ఇంగ్లీష్ ఎంత మాత్రం పరాయి భాష కాదు.

ఒకవైపు ఇంగ్లీష్ లో రాస్తూనే తమ మాతృభాష లోకూడా విరివిగా రాస్తున్న వారు అనేక రాష్ట్రాల్లో అనేకమంది ఉన్నారు. కనుక ఇంగ్లీష్ వచ్చి స్థానిక భాషల్ని నాశనం చేస్తుందనేది పూర్తి సత్యం కాదు. ఉదాహరణకి కేరళ రాష్ట్రం తీసుకుంటే మళయాళ మనోరమ గ్రూప్ "ద వీక్" అనే ఇంగ్లీష్ పక్ష పత్రిక ను నడుపుతుంది.మళయాళ దినపత్రికల్ని కొనేవారు కూడా చాలామంది ఆ వీక్లీ కొంటారు.అంత మాత్రం చేత అక్కడ స్థానిక భాషలో వెలువడే దిన పత్రికలు ఏమీ దెబ్బ తినలేదు.పైగా ఆ ఇంగ్లీష్ పత్రిక వల్ల కేరళ కి చెందిన ఆర్ట్ గ్యాలరీలు,పర్యాటకం,కళలు,వివిధ రంగాల్లోని వ్యక్తులు దేశ సరిహద్దు దాటి ప్రఖ్యాతి పొందుతుంటారు. అలాగే తమిళ నాడు కి ఇంగ్లీష్ లో ప్రచురించబడే ది హిందూ,ఫ్రంట్ లైన్ వంటివి ఉన్నాయి. ఇవన్నీ ఆయా రాష్ట్రాలకి చెందినవి అవడం మూలంగా, పేరుకి జాతీయ పత్రికలు అయినప్పటికి ఆ రాష్ట్రాల విషయాల్ని చాలా ప్రాధాన్యత ని ఇచ్చి ప్రచురించుకుంటాయి. గమనిస్తే ఇలాంటివి ఎన్నో అంశాలు ఉన్నాయి.



మూర్తి కెవివిఎస్
7893541003

# దావోస్ వేదికగా భవిష్యత్ తెలంగాణ - 2047 రైసింగ్ విజన్

**తెలంగాణ రాష్ట్రం ప్రపంచ ఆర్థిక వేదికపై తన స్థానం మరింత బలపరుచుకునే దిశగా సాగుతున్న కీలక సందర్భంగా దావోస్ ఆర్థిక సదస్సు నిలిచింది. స్విట్జర్లాండ్లోని దావోస్ పట్టణంలో ప్రతి సంవత్సరం నిర్వహించబడే ఈ అంతర్జాతీయ ఆర్థిక సదస్సు ప్రపంచంలోని ప్రభుత్వాధినేతలు, ఆర్థిక విధాన రూపకర్తలు, పరిశ్రమాధిపతులు, పెట్టుబడిదారులు ఒకే వేదికపై కలుసుకుని భవిష్యత్ ప్రపంచ ఆర్థిక దిశలను నిర్ణయించే అత్యంత ప్రాముఖ్యమైన సమావేశంగా గుర్తింపు పొందింది. 2026 సంవత్సరానికి సంబంధించిన దావోస్ ఆర్థిక సదస్సు జనవరి 20 నుండి 23 వరకు నిర్వహించబడింది. ఈ సదస్సులో పాల్గొనడం అనేది కేవలం హాజరు కావడం మాత్రమే కాకుండా, ఒక రాష్ట్రం తన ఆర్థిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం కూడా.**

ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన రాష్ట్ర చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచింది. ఆయన నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఈ సదస్సును గౌరవప్రదమైన కార్యక్రమంగా కాకుండా, స్పష్టమైన పెట్టుబడి లక్ష్యాలతో, ఉద్యోగ కల్పన కేంద్రంగా చేసుకున్న దృష్టితో వినియోగించింది. తెలంగాణ అభివృద్ధి అనే భావనను కేంద్రంగా చేసుకుని రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలకు అనుకూలమైన విధానాలు, బలమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన యువత, వేగవంతమైన నిర్ణయ వ్యవస్థ వంటి అంశాలను ప్రపంచ పెట్టుబడిదారుల ముందుంచారు. ఇది ఒక ప్రకటన మాత్రమే కాదు, తెలంగాణ భవిష్యత్ దిశను గర్జనగా ప్రకటించిన సందర్భం.

దావోస్ వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ దేశాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థల అధినేతలతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో తెలంగాణను కేవలం పెట్టుబడి గమ్యస్థానంగా మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక భాగస్వామ్యానికి అనువైన రాష్ట్రంగా వివరించారు. సమాచార సాంకేతిక రంగం, పచ్చ శక్తి రంగం, జీవ శాస్త్రాలు, సేవా కేంద్రాలు, విమానయాన రంగం, తయారీ రంగం వంటి విభాగాల్లో తెలంగాణకు ఉన్న ప్రత్యేక బలాలను వివరించారు. రాజకీయ స్థిరత్వం, పరిశ్రమలకు అనుకూలమైన పాలన, యువత నైపుణ్యం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచాయి. ఈ ప్రయత్నాల ఫలితంగా దావోస్ సదస్సులో తెలంగాణ ప్రభుత్వం పలు ప్రముఖ సంస్థలతో పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకుంది. రాష్మి గ్రూప్?తో సుమారు Rs 12,500 కోట్లు పెట్టుబడికి సంబంధించిన ఒప్పందం కుదరడం రాష్ట్ర పారిశ్రామిక రంగానికి ఒక కీలక మైలురాయిగా నిలిచింది. ఈ పెట్టుబడి ద్వారా సుమారు 12,000కు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడతాయని అంచనా వేయబడుతోంది. ఇది పరిశ్రమల స్థాపనతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోసే అంశంగా మారనుంది.

అదేవిధంగా వినియోగ వస్తు తయారీ రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన సంస్థలు హైదరాబాద్?లో సేవా కేంద్రాల ఏర్పాటు పట్ల ఆసక్తి వ్యక్తం చేశాయి. ఈ కేంద్రాలు ఏర్పడితే వేల సంఖ్యలో ఉన్నత నైపుణ్య ఉద్యోగాలు సృష్టించబడతాయి. అమెరికాకు చెందిన ఒక విమానయాన సంస్థతో సుమారు Rs 1,000 కోట్లు పెట్టుబడికి సంబంధించిన ఒప్పందం కుదరడం ద్వారా తెలంగాణ విమానయాన మరమ్మత్తులు మరియు నిర్వహణ రంగంలో కూడా కొత్త అవకాశాలు తెరుచుకున్నాయి. ఇది అనుబంధ పరిశ్రమలకు, చిన్న మరియు మధ్యతరహా సంస్థలకు కొత్త ఉపాధి అవకాశాలను కల్పించనుంది. దావోస్ పర్యటన ద్వారా తెలంగాణకు లభించిన ముఖ్యమైన లాభం పెట్టుబడుల పరిమాణమే కాకుండా రాష్ట్ర ప్రతిష్ఠ పెరగడమే. ప్రపంచ స్థాయి ఆర్థిక వేదికపై తెలంగాణ ఒక నమ్మదగిన, స్థిరమైన, భవిష్యత్ దృష్టి కలిగిన రాష్ట్రంగా గుర్తింపు పొందింది. ఈ పెట్టుబడులు పరిశ్రమలకే పరిమితం కాకుండా మౌలిక వసతుల అభివృద్ధి, పట్టణ విస్తరణ, గ్రామీణ ఉపాధి, నైపుణ్య శిక్షణ వంటి అనేక రంగాలకు విస్తరించే అవకాశాలు ఉన్నాయి.

2.ఈ నేపథ్యంలో దావోస్ ఆర్థిక సదస్సులో తెలంగాణ ప్రభుత్వం ప్రదర్శించిన చురుకుదనం, ముందుచూపు రాష్ట్ర పాలనలో వచ్చిన దృక్పథ మార్పును స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. గతంలో పెట్టుబడులు అనేవి కొన్ని నగరాలకు, కొన్ని రంగాలకు మాత్రమే పరిమితమయ్యే పరిస్థితులు కనిపించగా, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో పెట్టుబడుల ఆహ్వానం జరుగుతున్నది. దావోస్ వేదికపై జరిగిన చర్చల్లో ఈ అంశం స్పష్టంగా ప్రతిధ్వనించింది. పరిశ్రమలు కేవలం లాభాల కోసం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో కూడిన అభివృద్ధికి దోహదపడేలా ఉండాలనే భావనను తెలంగాణ ప్రభుత్వం బలంగా ముందుంచింది.

పెట్టుబడులు రాష్ట్రంలోకి వచ్చినప్పుడు వాటి ప్రభావం కేవలం కర్మాగారాల గేట్లలోనే ఆగిపోదు. పరిశ్రమల స్థాపనతోపాటు రవాణా వ్యవస్థలు విస్తరిస్తాయి, నివాస అవసరాలు పెరుగుతాయి, విద్యా మరియు ఆరోగ్య సేవలకు డిమాండ్ పెరుగుతుంది. దీని వల్ల సమగ్ర ఆర్థిక చక్రం వేగవంతమవుతుంది. దావోస్ సదస్సులో ఈ అంశాన్ని పెట్టుబడిదారులకు వివరించడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడుల ప్రయోజనం ద్వైపాక్షికంగా ఉండబోతుందని స్పష్టం చేసింది. ఒకవైపు పెట్టుబడిదారు లకు లాభదాయక వాతావరణం, మరోవైపు ప్రజలకు ఉపాధి, జీవన ప్రమాణాల మెరుగుదల అనే సమన్వయం స్పష్టంగా కనిపిస్తుంది.

రాష్ట్రంలో యువత అధిక సంఖ్యలో ఉండటం తెలంగాణకు ఉన్న పెద్ద బలంగా దావోస్ వేదికపై ప్రస్తావించబడింది. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, విద్యా సంస్థలు, శిక్షణ కేంద్రాల ద్వారా యువతను పరిశ్రమలకు అనుగుణంగా తీర్చిదిద్దే విధానాన్ని ప్రభుత్వం వివరించింది. దీని ద్వారా పరిశ్రమలు అవసరమైన మానవ వనరులు రాష్ట్రంలోనే లభిస్తాయనే విశ్వాసం పెట్టుబడిదారుల్లో ఏర్పడింది. ఇది పెట్టుబడులు నిర్ణయించుకునే సమయంలో కీలక పాత్ర పోషించే అంశంగా మారింది. రాష్ట్రంలో పరిశ్రమలు వస్తే యువతకు ఉద్యోగాలు లభిస్తాయి, ఉద్యోగాలు లభిస్తే నైపుణ్యం పెరుగుతుంది, నైపుణ్యం పెరిగితే మరిన్ని పరిశ్రమలు వస్తాయి అనే ఒక సానుకూల చక్రం ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.




దావోస్ ఆర్థిక సదస్సు సందర్భంగా జరిగిన సమావేశాల్లో వ్యవసాయానికి అనుబంధ పరిశ్రమలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టిన విషయం గమనించదగినది. తెలంగాణ రాష్ట్రం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ కలిగిన ప్రాంతం కావడంతో, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ పెంచే పరిశ్రమలు ఏర్పడితే రైతులకు ప్రత్యక్ష లాభం చేకూరుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆహార ప్రాసెసింగ్, నిల్వ సదుపాయాలు, ఎగుమతి ఆధారిత పరిశ్రమలు ఏర్పడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఈ దిశగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని దావోస్ వేదికపై తెలియజేయడం గ్రామీణాభివృద్ధికి సంబంధించిన సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది.

మౌలిక వసతుల అభివృద్ధి అంశం కూడా దావోస్ చర్చల్లో కీలకంగా నిలిచింది. పరిశ్రమలకు అవసరమైన భూమి, నీరు, విద్యుత్, రవాణా వంటి అంశాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు వివరించింది. పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి, కొత్త పారిశ్రామిక మండలాల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న మండలాల విస్తరణ వంటి చర్యల ద్వారా పెట్టుబడులకు అనుకూల వాతావరణం సృష్టిస్తున్నట్లు పేర్కొంది. ఇది పెట్టుబడిదారులకు భరోసా కలిగించే అంశంగా మారింది.దావోస్ వేదికపై తెలంగాణ ప్రభుత్వం ప్రదర్శించిన మరో ముఖ్యమైన అంశం పారదర్శకత. పెట్టుబడుల విషయంలో స్పష్టమైన విధానాలు, వేగవంతమైన అనుమతులు, అవినీతి రహిత పాలన అనే అంశాలను ప్రభుత్వం గట్టిగా ముందుంచింది. పరిశ్రమలకు సంబంధించి తీసుకునే నిర్ణయాలు కాలపరిమితిలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పడం ద్వారా పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగింది. ఇది పెట్టుబడులు ఆకర్షించడంలో అత్యంత కీలకమైన అంశంగా మారుతోంది. పరిశ్రమల అభివృద్ధితో పాటు సామాజిక సమతుల్యత కూడా అవసరమనే భావనను ప్రభుత్వం దావోస్ వేదికపై స్పష్టం చేసింది. పరిశ్రమలు వస్తే స్థానిక ప్రజలకు ప్రాధాన్యత కల్పించడం, పర్యావరణాన్ని కాపాడడం, సహజ వనరుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలను పాలనా విధానంలో భాగంగా అమలు చేయాలనే సంకల్పాన్ని వ్యక్తం చేసింది. దీని ద్వారా అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో కూడిన ప్రగతి అనే భావన బలపడుతోంది.ఈ విధంగా దావోస్ ఆర్థిక సదస్సులో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు రాష్ట్ర ఆర్థిక దిశను కొత్త మలుపు తిప్పే శక్తిని కలిగి ఉన్నాయి. అంతర్జాతీయ పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్య వనరులు కలిసి రాష్ట్ర అభివృద్ధి పయనాన్ని వేగవంతం చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది ఒక తాత్కాలిక కార్యక్రమంగా కాకుండా, దీర్ఘకాలిక ఆర్థిక వ్యూహంలో భాగంగా అమలవుతున్న ప్రయత్నంగా అర్థం చేసుకోవచ్చు. ఈ దిశగా కొనసాగుతున్న ప్రయత్నాలు రాబోయే కాలంలో తెలంగాణను మరింత బలమైన ఆర్థిక శక్తిగా మలచే పునాదిగా నిలుస్తున్నాయి.

3.దావోస్ ఆర్థిక సదస్సులో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పర్యటనను 2047 తెలంగాణ రైసింగ్ దృష్టికోణంతో పరిశీలిస్తే, ఇది కేవలం తక్షణ పెట్టుబడుల సాధనకే పరిమితం కాకుండా, రాష్ట్ర భవిష్యత్ ఆర్థిక నిర్మాణానికి ఒక దిశానిర్దేశక ఘట్టంగా కనిపిస్తుంది. 2047 నాటికి భారతదేశం స్వాతంత్ర్యానికి 100 సంవత్సరాలు పూర్తిచేసుకునే సందర్భంలో, తెలంగాణ తనదైన అభివృద్ధి నమూనాతో దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో ఒక ఆర్థిక శక్తిగా ఎదగాలనే లక్ష్యాన్ని ముందుంచుకుంది. ఈ దీర్ఘకాలిక లక్ష్యానికి దావోస్ వేదిక ఒక కీలక ఆరంభ బిందువుగా మారింది.

2047 తెలంగాణ రైసింగ్ విజన్లో ప్రధానంగా మూడు అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి. మొదటిది ఆర్థిక బలోపేతం, రెండవది సామాజిక సమానత్వం, మూడవది స్థిరమైన అభివృద్ధి. దావోస్ పర్యటనలో ఈ మూడు అంశాలు సమగ్రంగా ప్రతిఫలించాయి. పెట్టుబడుల ద్వారా రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో గణనీయమైన వృద్ధి సాధించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు సగటున 8శాతం నుండి 9శాతం మధ్య కొనసాగుతుండగా, 2030 నాటికి దీనిని 12శాతం స్థాయికి తీసుకెళ్లడం, 2047 నాటికి నిరంతరంగా ద్వంకంకాల వృద్ధిని సాధించడం ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యంగా పేర్కొనబడింది.

దావోస్ పర్యటనలో ఆకర్షించిన పెట్టుబడులు ఈ లక్ష్యాలకు పునాదిగా నిలుస్తాయి. భారీ పరిశ్రమలు, సేవా రంగం, పచ్చ శక్తి, ఆధునిక తయారీ రంగాల్లో వచ్చిన పెట్టుబడులు 2047 నాటికి తెలంగాణను ఉపాధి హబ్?గా మార్చే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగ రేటు సుమారు 6 శాతం చుట్టూ ఉన్నట్లు వివిధ అంచనాలు సూచిస్తున్నాయి. ఈ పెట్టుబడులు పూర్తిస్థాయిలో అమలైతే, 2035 నాటికి ఈ రేటును 3 శాతం కంటే తక్కువకు తగ్గించడం, 2047 నాటికి దాదాపు సంపూర్ణ ఉపాధి స్థితిని సాధించడం సాధ్యమనే అంచనాలు వెలువడుతున్నాయి.

2047 తెలంగాణ రైసింగ్ విజన్లో గ్రామీణ, పట్టణ అభివృద్ధి మధ్య సమతుల్యత కీలకమైన అంశంగా ఉంది. దావోస్ వేదికపై ప్రభుత్వం పరిశ్రమలు కేవలం మహా నగరాలకే పరిమితం కాకుండా జిల్లా కేంద్రాలు, వెనుకబడిన ప్రాంతాలకు కూడా విస్తరించే విధానాన్ని స్పష్టంగా వివరించింది. దీనిద్వారా ప్రాంతీయ అసమాన తలను తగ్గించి, సమగ్ర రాష్ట్రాభివృద్ధిని సాధించాలనే సంకల్పం వ్యక్తమైంది. ప్రస్తుతం రాష్ట్ర జనాభాలో సుమారు 62 శాతం గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తుండగా, 2047 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోనే పారిశ్రామిక ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరగాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

2047 నాటికి తెలంగాణ ఆర్థిక నిర్మాణంలో సేవా రంగం వాటా సుమారు 65శాతం వరకు పెరగాలనే అంచనాలు ఉన్నాయి. అదే సమయంలో తయారీ రంగం వాటాను ప్రస్తుత స్థాయి నుండి 25 శాతం వరకు పెంచాలనే లక్ష్యం కూడా దావోస్ చర్చల్లో ప్రస్తావించబడింది. ఇది రాష్ట్రాన్ని వినియోగాధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి ఉత్పత్తి ఆధారిత ఆర్థిక వ్యవస్థ వైపు నడిపించే వ్యూహంగా భావించవచ్చు. ఈ మార్పు ద్వారా రాష్ట్ర ఆదాయంలో స్థిరత్వం, ఉపాధిలో వైవిధ్యం ఏర్పడుతాయి.

పచ్చ శక్తి రంగం 2047 తెలంగాణ రైసింగ్ విజన్?లో ఒక కీలక స్థంభంగా ఉంది. దావోస్ పర్యటనలో పర్యావరణ అనుకూల పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తామని తెలంగాణ ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్ర విద్యుత్ అవసరాల్లో పునరుత్పాదక శక్తి వాటా సుమారు 30 శాతం వరకు ఉన్నదని అంచనా. 2047 నాటికి దీనిని కనీసం 60 శాతం వరకు పెంచాలనే దీర్ఘకాలిక లక్ష్యం పెట్టుబడిదారుల ముందు ఉంచబడింది. ఇది కేవలం పర్యావరణ పరిరక్షణ కోసమే కాకుండా, శక్తి భద్రత, ఖర్చుల తగ్గింపు, స్థిరమైన అభివృద్ధి కోసం కూడా కీలకం.

సామాజికపరంగా 2047 తెలంగాణ రైసింగ్ విజన్?లో మానవాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ఉంది. దావోస్ పర్యటనలో పెట్టుబడులు విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి రంగాలకు ఎలా దోహదపడతాయో ప్రభుత్వం వివరించింది. ప్రస్తుతం రాష్ట్ర సాక్షరత రేటు సుమారు 72 శాతం చుట్టూ ఉండగా, 2047 నాటికి దీనిని 95 శాతం పైగా తీసుకెళ్లాలనే లక్ష్యం ఉంది. అదే విధంగా నైపుణ్య శిక్షణ పొందిన యువత వాటాను 2047 నాటికి కనీసం 80 శాతం వరకు పెంచాలనే వ్యూహం కూడా స్పష్టంగా ప్రతిఫలించింది.

2047 నాటికి తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాలంటే విశ్వసనీయ పాలన అత్యంత కీలకం. దావోస్ వేదికపై తెలంగాణ ప్రభుత్వం పారదర్శకత, వేగవంతమైన నిర్ణయాలు, అవినీతి రహిత పాలన వంటి అంశాలను తన బలాలుగా ప్రదర్శించింది. ఇది దీర్ఘకాలిక పెట్టుబడులకు అవసరమైన విశ్వాసాన్ని పెంచే అంశంగా నిలుస్తుంది. 2047 నాటికి తెలంగాణ పెట్టుబడి అనుకూల రాష్ట్రాల జాబితాలో దేశంలోనే అగ్రస్థానంలో ఉండాలనే ఆశయం ఈ పర్యటనలో స్పష్టంగా కనిపించింది.

మొత్తంగా చూస్తే, దావోస్ పర్యటన 2047 తెలంగాణ రైసింగ్ విజన్కు ఒక వ్యూహాత్మక ముగింపుగా కాకుండా, ఆ విజన్ను కార్యరూపంలోకి తీసుకెళ్లే సంకల్పాన్ని ప్రపంచానికి ప్రకటించిన ఘట్టంగా నిలిచింది. ఇది పెట్టుబడుల సంఖ్యలతో మాత్రమే కొలవలేని మార్పు. ఇది ఒక దిశ, ఒక ఆశయం, ఒక దీర్ఘకాలిక ప్రయాణానికి బలమైన ప్రకటన. 2047 నాటికి తెలంగాణ ఒక ఆర్థిక శక్తిగా, సామాజికంగా సమానత్వం కలిగిన రాష్ట్రంగా, పర్యావరణ పరిరక్ష ణకు నమూనాగా ఎదగాలనే గర్జన ఈ దావోస్ పర్యటన ద్వారా ప్రపంచ వేదికపై స్పష్టంగా వినిపించింది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
పౌర సంబంధాల అధికారి, యుఏఎస్సి

# సంగారెడ్డి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చుకుందాం

- డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- మాదక ద్రవ్యాల నిరోధానికి శాఖల సమన్వయం అవసరం
- అడిషనల్ కలెక్టర్ పాండు, అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు



**సంగారెడ్డి, జనవరి 22 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చుకుందామని అడిషనల్ కలెక్టర్ పాండు, అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు, అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్?లతో కలిసి నార్కోటిక్స్ కోఆర్డినేషన్ జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల రవాణా చేసినా, వినియోగించినా ఎన్?డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధించడం జరిగిద్దన్నారు. డ్రగ్స్ నియంత్రణకు జిల్లాలోని అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల అలవాటుకు ఎవరూ బానిసలు కావొద్దని, ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అర్బన్, రూరల్ అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, బస్ స్టాండ్లు, డ్రగ్స్ వినియోగానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో డ్రగ్స్, గుడుంబా తదితర మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. కళాశాలల్లో ఏర్పాటు చేసిన డ్రగ్స్ నిరోధక కమిటీలు చురుకుగా పనిచేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు మాట్లాడుతూ ముఖ్యంగా విద్యాసంస్థల్లో సూక్ష్మ నిఘాతో పటిష్ట చర్యలు తీసుకుని విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా చూడాలని తెలిపారు. గంజాయి సాగు చేస్తున్న వారిని గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డ్రగ్స్ నిరోధానికి వివిధ కళాశాలలు, వివిధ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, గీతం యూనివర్సిటీ, మహేశ్వర మెడికల్ కళాశాల, ఎమ్మెన్నార్ విద్యాసంస్థలు, వోక్సెన్ యూనివర్సిటీ ప్రతినిధులు, డీడబ్ల్యూవో, డీసీహెచ్ఎస్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ, ఆర్టీసీ, వ్యవసాయ, విద్యాశాఖ అధికారులు, ఆటో యూనియన్ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట



**వెల్దండ, జనవరి 22 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదాలకు అవగాహనతోటే అడ్డుకట్ట వేయొచ్చని , రోడ్డు భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని తహసిల్దార్ భీమ కార్తీక్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం వెల్దండ మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితం చాలా విలువైనది, తప్పనిసరిగా రోడ్డు ప్రమాదాలను పాటించాలన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, మద్యం మత్తు, అతివేగం వంటి కారణాలతోనే ఎక్కువ మొత్తంలో ప్రమాదాల సంభవిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప తహసిల్దార్ మహమ్మద్, ఏఎస్సై శ్రీనివాసులు, ఎంపీ ఓ లక్ష్మణ్ రాథోడ్, పర్యవేక్షకుడు మోహన్ లాల్, ఆర్ ఐ శంకర్ నాయక్,సర్పంచ్ మణిపాల్ నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పాటిగడ్డతండాలో డయాబెటిక్ రెటినోపతి సదస్సు



**రేవల్లి, జనవరి 22 (జనంసాక్షి) :** అనియంత్రిత మధుమేహం వల్ల కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని, ముందస్తు నేత్ర పరీక్షలు జరుపుకుంటే ఈ ముప్పు తప్పించవచ్చునని జిల్లా కంటి వైద్య బృందం డాక్టర్ క్లవిన్ తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గోపాలపేట మండలంలోని బుద్దారం పాటిగడ్డ తండా గ్రామ పంచాయతిలో డయాబెటిక్ రెటినోపతి సదస్సు నిర్వహించారు. గ్రామంలోని 94 మందికి కంటి పరీక్షలు చేయగా ఇందులో కాటరాక్ట్ 15, డయాబెటిక్ రెటినోపతి కేసులు ఒకరిని, ఎఎమ్డీ ఇద్దరిని గుర్తించడం జరిగిందన్నారు. గుర్తించిన అందర్నీ కూడా గవర్నమెంట్ జర్నల్ హాస్పిటల్ వనపర్తికి రెఫర్ చేయడం జరిగినది తెలిపారు. ఈ సందర్భంగా మధుమేహ వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ దృష్టి కార్యక్రమాన్ని ప్రతి ఒక్క షుగర్ పేషంటు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉషా హర్యా నాయక్,రజనీ రాందాస్, జిల్లా కంటి వైద్య బృందం డాక్టర్ క్లవిన్, సీహెచ్ సిద్ద గౌడ్, ఆప్తమాలజిస్టు పార్వతి, జిల్లా హెల్త్ అసిస్టెంట్స్ మధుబాబు, జ్ఞానేశ్వర్, ఏఎన్ఎమ్ లక్ష్మీ, శివలీల, ఆశా కార్యకర్త రమణి తండా వాసులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలి

- జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 22 (జనంసాక్షి) :** రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శామీర్?పేట్ రహదారిపై ప్రమాదాలు అధికంగా జరుగుతున్న బ్లాక్ స్పాట్స్‌ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి,మేడ్చల్ ట్రాఫిక్ సీఐ మధుసూదన్, మేడ్చల్ సీఐ సత్యనారాయణ, శామీర్?పేట్ ఎస్?ఐ శశివర్ధన్ రెడ్డి,అల్వాల్ ట్రాఫిక్ ఎస్ఐ నవీన్ రెడ్డి, ఏఎంవీఐ కిరణ్ కుమార్,ఆర్ అండ్ బి ఏఈ రంజిత్, జి హెచ్ ఎంసి ఏఈ తిరుపతి,తదితరులు సందర్శించారు. గతంలో ఈ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలను సమీక్షించారు. ప్రమాదాలకు గల కారణాలను పరిశీలించి,భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు,యూ-టర్న్?ల మార్పు,సరైన లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు,రహదారి సూచిక బోర్డుల ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవాలని ఇందుకు సంబంధించి వివిధ శాఖల మధ్య సమన్వయంతో త్వరితగతిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం అధికారులు వాహనదారులతో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని,మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ద్వి చక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పక ఉపయోగించాలని సూచించారు.రోడ్డు నిబంధనలు పాటిస్తే తమ ప్రాణాలతో పాటు ఎదుటి వారి ప్రాణాలు కూడా సురక్షితంగా ఉంటాయని తెలిపారు.ముఖ్యంగా రాత్రిపూట వాహనాలు నడిపే వారు ఉదయం పూట, ఉదయం పూట వాహనాలు నడిపే వారు రాత్రి పూట తప్పనిసరిగా తగినంత విశ్రాంతి తీసుకున్న తర్వాతే ప్రయాణం చేయాలని కోరారు. రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో అవగాహన పెంచడమేనని అధికారులు తెలిపారు.ప్రజల సహకారం ఉంటేనే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించగలమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి,రోడ్డు నిబంధనలు పాటించి సురక్షిత సమాజ నిర్మాణానికి భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

# శ్రీశ్రీశ్రీ శివస్వామి ఆధ్వర్యంలో వనితా శంఖారావం

- సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్‌లో ఫిబ్రవరి 22న 1,51,116 మంది భక్తులచే నిర్వహణ



**బోడుప్పల్, జనవరి 22 (జనంసాక్షి) :** వాసవి ఇంటర్నేషనల్ పరివార్ మహిళా విభాగ్ తెలంగాణ రాష్ట్ర శాఖ నిర్వహిస్తున్న వనితా శంఖారావం శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శివస్వామి ఆధ్వర్యంలో సుమారు ఒక లక్షా యాబై వేల మందితో సికింద్రాబాద్ పేరెడ్ గ్రౌండ్ లో ఫిబ్రవరి 22న ఆదివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ మేరకు గురువారం శ్రీ విద్యాశంకరానంద స్వామి ఆధ్వర్యంలో పీర్జాదిగూడ నగర పరిధి వనితా శక్తి మహిళలు సాయిబాబకు ప్రత్యేక పూజలు నిర్వహించి వనితా శంఖారావంలో మహిళలు అదిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.అనంతరం శ్రీ విద్యాశంకరానంద స్వామి మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని కాపాడాడడం కోసం మనందరం పాటు పాడాలని పిలుపునిచ్చారు.లోక క్షేమం కోసం ప్రతి ఒక్కరు పాటు పడాలని,స్త్రీలు శోభబాగ్యాలతో వెలుగొందుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎలాంటి భాదలు కలగకుండా సుఖశాంతులతో ఉండాలని తలపెట్టిన మహత్తర కార్యక్రమమని తెలిపారు.వనితా శంఖారావం శ్రీ శైవక్షేత్ర వనితా ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ ధర్మ శిరోమణి అవార్డు గ్రహీత అయిత హైమ,మేనేజర్ విశ్వనాథుని కోటేశ్వరరావు నిర్వహణలో మణి ద్వీప వర్ణన,భగవద్గీత, శివ సహస్రనామ పారాయణాలు, హనుమాన్ చాలిసా పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు.పూజలో పాల్గొనే మహిళలకు పసుపు,కుంకుమ,పూజ పుస్తకం,పేపర్ ప్లేట్లు,మంచి నీరు కల్పిస్తున్నారని,ఇంటి? నుండి పండ్లు, పూలు, గందం,కర్పూరం, తమలపాకులు, హారతి ప్లేట్లు స్వయంగా వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ అద్యక్షురాలు సమత, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.క్రిష్ణవేణి, బుద్దానగర్ అద్యక్షురాలు ప్రభావతీ, జనరల్ సెక్రటరీ శోభారాణి,ట్రెజరర్ రమ్య,భాగ్య నగర్ ఉపాద్యక్షురాలు సంధ్య,మేడ్చల్ జిల్లా రెడ్డి మహిళ సంఘం అద్యక్షురాలు శ్రీలత రెడ్డి,సభ్యులు చైతన్య,ప్రేమలతా రెడ్డి,జ్యోతి,చందన,సంధ్య, శ్రీపద, పార్వతీలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయాలి



**గద్వాల నడిగడ్డ, జనవరి 22 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రత్యేక దృష్టి సారించి పురోగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత ఎంపీడీవోలతో నిర్మాణపు పనుల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జిల్లా ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో 19వ స్థానంలో ఉందని, అందరూ సమన్వయంతో పనులను వేగవంతం చేసి పురోగతి సాధించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వము ఇప్పటివరకు జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు జిల్లాకు రూ.75 కోట్లను లబ్ధిదారులకు మంజూరు చేసినట్లు తెలిపారు. మంజూరీలు పొందిన వారందరూ తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. 45 రోజుల లోపు మార్క్ అవుట్ చేయని లబ్ధిదారులకు రద్దు చేసి వారి స్థానంలో అర్హులైన కొత్త లబ్ధిదారులను గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు.అలంపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో మరింత ప్రగతి సాధించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇండ్ల నిర్మాణ పనులు నిర్దేశిత గడువులో పూర్తయ్యేలా ఎంపీడీవోలు గ్రామ కార్యదర్శులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆయా నిర్మాణ దశలను బట్టి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలలో బిల్లులు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో లబ్ధిదారుల వివరాలను ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పోర్టల్?లో ఆన్లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస రావు, జెడ్.పి. డిప్యూటీ సి.ఈ.ఓ నాగేంద్రం,డిపిఒ శ్రీకాంత్, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

## జెఈఈ (మెయిన్) పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 22 (జనం సాక్షి) :** జెఈఈ (మెయిన్)-2026 పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సజావుగా, పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఉప్పల్, ఫీర్జాదిగూడ, మేడిపల్లి మండలాల్లోని జెఈఈ (మెయిన్) పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచీలు తీసుకురాకుండా కఠినంగా పర్యవేక్షించాలని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్, ఓఆర?స్ ప్యాకెట్లతో వైద్య బృందం అందుబాటులో ఉందా, సెక్షన్ 144 అమలు చేస్తున్నారా అనే అంశాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, నిబంధనల ప్రకారం నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

## ఓటరు మ్యాపింగ్‌లో నిర్లక్ష్యం చేస్తే సస్పెన్షన్




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 22 (జనం సాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే బీఎల?లు, సూపర్వైజర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. అవసరమైతే సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు. గురువారం మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు మ్యాపింగ్ పురోగతిలో జిల్లా రాష్ట్రంలోనే చివరి స్థానంలో ఉండటం ఆందోళనకరమన్నారు. ఈ నెలాఖరులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సూపర్వైజర్లు తమ పరిధిలోని బీఎల్ఓలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని, ఇంటింటి సర్వే ద్వారా ప్రత్యక్ష పరిశీలన జరపాలని సూచించారు. హాజరు కాని బీఎల్ఓల స్థానంలో చురుకైన సిబ్బందిని నియమించి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ ఝుకీరా సుల్తానా, ఆర్డీఓ శ్యాంప్రకాష్, తహసీల్దార్ సీతారాం, ఏఈఆర్‌లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- వనపర్తి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సైదులు



**వనపర్తి బ్యూరో, జనవరి 22 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఏ ఎమ్ వి ఐ సైదులు అన్నారు. రోడ్డు భద్రత మాస్రోత్సవాల సందర్భంగా గురువారం వనపర్తి పట్టణంలోని భగీరథ చౌరస్తాలో రోడ్డు భద్రతపై రవాణా శాఖ అధికారులు వినూత్న ప్రచారం నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలు పాటించే వారికి హెల్మెట్ ధరించిన వారికి పువ్వులు ఇచ్చి ప్రోత్సహించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు సీట్ బెల్ట్, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని అన్నారు. తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

# ఇసుక అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ చర్యలు

- ఆన్‌లైన్‌లోనే పారదర్శకంగా ఇసుక అనుమతులు
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 22 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా లో ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందిగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.గురువారము వీడియో కాన్ఫరెన్సు హాలు నందు జిల్లా ఎస్ పి స్నేహ మెహర లతో కలిసి ఏం పి డి ఓ లు, తహసిల్దార్ల కు విడియో కాన్ఫరెన్సు సంబంధిత అధికారులతో ఇసుక రవాణా పై సమావేశము నిర్వహించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మ్యానువల్ ఇసుక అక్రమ రవాణా ను అరికట్టాలని, అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా జరిగితే వాహనాన్ని సీజ్ చేసి ఫైన్ వేయాలని అధికారులకు ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రభుత్వానికి భారీ ఆదాయ నష్టం ఏర్పడుతుందని, ఇసుక అక్రమ రవాణా ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్దేశించిన పరిమితులను మించి నదులు, వాగులు, చెరువులు, సముద్ర తీర ప్రాంతాల నుండి ఇసుకను తవ్వి తరలించడం. ఇది పర్యావరణానికి, సమాజానికి మరియు ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుందని అన్నారు. ఆన్లైన్ పర్మిషన్ తో రవాణా జరగాలి, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఇసుక అక్రమ రవాణా జరగకుండా విస్తృత తనిఖీలు చేపట్టడంతో పాటు సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెవెన్యూ, పంచాయతి రాజ్,పోలీస్ ,ట్రాన్స్ పోర్ట్ శాఖల సమన్వయంతో జాయిశీట్ ఇన్స్పెక్షన్ చేసి రిపోర్ట్ ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు.జిల్లా ఎస్ పి స్నేహ మెహర మాట్లాడుతూ అన్ని శాఖ ల సమన్వయము తో ఇసుక అక్రమ రవాణా ను అరికట్టాలన్నారు. ఆన్లైన్ పద్ధతి ద్వార బుక్ చేసుకోవాలని ,పోలీస్ పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. అనంతరం స్కూల్స్ లో నిర్మాణం లో ఉన్న టాయిలెట్స్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలనీ తహసిల్దార్ల కు ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న భూభారతి దరకస్తులను క్లియర్ చేసి రోపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండలం వారిగా ఏ మండలం లో ఎన్ని పెండింగ్ ఉన్నవని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఇంచార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాజేశ్వరి, జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్, జిల్లా పంచాయతి అధికారి జయసుధ, ఎ డి మైన్స్ సత్యనారాయణ , ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకట్ రెడ్డి , డి సెక్షన్ సుపరింతెన్డేంట్ మున్నిర్, ఇ డి ఎం మహమూద్ , తహసిల్దార్లు, ఏం పి డి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలి

• జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జనవరి 22 (జనం సాక్షి) :** ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితు లకు నష్టపరిహారం అందిం చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో షెడ్యూల్ కులాలు తెగల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్ష తన జరిగింది. ఈ సమావే శానికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, జిల్లా రెవెన్యూ అదన పు కలెక్టర్ శ్రీను హాజరయ్యా రు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కేసులను పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.అదే విధంగా కలెక్ట రేట్ లోని సంబంధిత విభాగం అధికారులు ఎస్సీ ఎస్టీ కేసు లలో బాధితులకు త్వరిత గతిన నష్టపరిహారం చెల్లించేం దుకు తక్షణ చర్యలు తీసుకో వాలని ఆమె సూచించారు. సమావేశంలో పాల్గొన్న డిఎస్పి నల్లపు లింగయ్య మాట్లాడుతూ 2023 లో 31, 2024 లో 34, 2025 లో 24 ఎస్సీ ఎస్టీ కేసులు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల లో నమోదు అయ్యాయని తెలిపారు. 2025 లో నమో దైన కేసులలో 4 కేసులు భూ సమస్యల పరిష్కారం కోసమే పెట్టారని తెలిపారు. మరో 2 కేసులకు చార్జిషీట్ వేయడం జరిగిందని , మరో 3 కేసులకు సంబంధించి డాక్యు మెంట్స్ రావాల్సి ఉందని, ఒక కేసు మైనర్ కు సంబంధించి నదిగా డీఎస్పీ వివరించారు. ఆయా కేసులలో ఎఫ్. ఐ. ఆర్ కానీ చార్జిషీట్ కానీ, డీసీ ఆర్ బి నుంచి అవుతాయని చెప్పారు. 2024లో జరిగిన ఓ హత్య కేసు గురించి కలెక్టర్ ఆరా తీయగా, ఆ కేసులో మద్యం మత్తులో ఓ వ్యక్తి కొట్టడంతో అవతలి వ్యక్తి చనిపోయాడని, నిందితుడికి జైలు శిక్ష పడిందని డీఎస్పీ తెలిపారు. ఒక కేసు ఫాల్స్ గా నిర్ధారణ అయిందన్నారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో నష్టపర హారం ఎంత మందికి అందిం చారని కలెక్టర్ ప్రశ్నించగా సీ సెక్షన్ అధికారిని జయసుధ 2023 నుంచి ఇప్పటిదాకా ఎఫ్ ఐ ఆర్ అయిన 17 కేసు ల బాధితులకు నష్టపరిహారం ఇవ్వడం జరిగిందని, మిగతా కేసులలో బాధితులకు నష్టప రిహారం అందించేందుకు ప్రొసీడింగ్స్ సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు.మిగతా కేసు ల నష్టపరిహారం కోసం మొత్తం 40.45 లక్షల ప్రతిపా దనలు పంపించడం జరిగింద ని కలెక్టర్ కు తెలిపారు.ప్రతి నెలా 30 న సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నాం అని డీ ఎస్పీ తెలపగా, ఆయా మీటింగుల మినిట్స్ ఇవ్వడం లేదని ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దు ల్ ఖలీల్ చెప్పడంతో స్పందిం చిన కలెక్టర్ ఇకపై నెల నెలా చేసిన మీటింగ్ మినిట్స్ పంపించాలని ఆదేశించారు. సమావేశంలో గిరిజనసంఘం నాయకులు కిష్ట్యా నాయక్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కేసు లు తొందరగా నమోదు చేయ డం లేదని నాలుగైదు రోజుల తర్వాత చేస్తున్నారని కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. కేసు నమోదు చేయకపోతే నేరుగా తన కార్యాలయంలో వచ్చి తెలియజేయాలని ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు.జిల్లా లో ఎస్టీ విద్యార్థుల కోసం బెస్ట్ అవలెబుల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని, పంచాయ తీలుగా మారిన గ్రామాల్లో ఇంటి నంబర్లను మార్చాలని, ప్రభుత్వ పథకాల అమ లులో పైలెట్ ప్రాజెక్టు కింద గిరిజన గ్రామ పంచాయతీ నీ ఎంపిక చేయాలని కిష్ట్యా నాయక్ కోరారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పైలేట్ ప్రాజె క్టు కింద గిరిజన పంచాయ తీలను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉల్లాస్ స్కీం అమలు జరుగుతోందని, జిల్లాలో మహిళా అక్షరాస్యత కేవలం 38 శాతమే ఉందని, గట్టు మండలం తర్వాత దేశంలో మహిళా అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్నది నారాయణ పేట జిల్లానే అని కలెక్టర్ తెలిపారు. ఉల్లాస్ పథకంలో భాగంగా 4 నెలల వరకు నిరక్షర్యాశులకు వాలంటీర్లను నియమించి ప్రత్యేక తరగతులను నిర్వ హించడం జరుగుతుందినీ ఆమె తెలిపారు.మరో సభ్యు డు ఆశప్ప మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఎర్ర గుట్ట వద్ద 8 ఎకరాలను 1994 దళి తులకు ఇండ్ల పట్టాలిచ్చా రని, ఆ తర్వాత ఆ స్థలంలోనే డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణం చేపట్టారని, ఇప్పు డు అక్కడితోనే ఆగిపోయిందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని దళిత వాడల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆయన కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. చివరగా వచ్చే త్రైమాసిక సమావేశంలో విజిలెన్స్ అండ్ మానిట రింగ్ కమిటీ లో కొత్త సభ్యు లను ఎన్నుకోవాలని తీర్మానిం చారు.ఈ సమావేశంలో ఆర్డీవో రామచందర్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ శైలజ, జిల్లా పంచాయతీ అధికారి సుధా కర్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ అజీమ్, డీ పీ ఎం. జయన్న,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్లాలి

• ఫ్లేమింగ్ ఎండీ. జేఎం ప్రకాష్



**శివ్వంపేట, జనవరి 22 (జనంసాక్షి) :** విద్యార్థులు చిన్నతనంలోనే వారియొక్క ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలని ఫ్లెమింగ్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ జయమురుగన్ ప్రకాష్ స్పష్టం చేశారు. శివ్వంపేట మండలం లచ్చిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని శివయ్యగూడెం తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం మండల పరిధిలోని నవాబుపేట గ్రామ శివారులోని ఫ్లెమింగ్ ల్యాబొరేటరీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో సీఎస?ర్ నిధుల నుంచి కొనుగోలు చేసి తీసుకువచ్చిన బ్యాగులు, పుస్తకాలు, పెన్నులను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరిశ్రమ ఎండీ ప్రకాష్ అందజేశారు. ఈ సందర్భంగా జయ మురుగన్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అనీ అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ మంచి లక్ష్యాలను సాధించాలని సూచించారు. తమ యొక్క సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చూడతామని జయ మురుగన్ ప్రకాష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫ్లెమింగ్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ ప్రతినిధులు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రామ్?కుమార్, హెడ్ హెచ?ర్ మనోహర్, సైట్ హెచ?ర్ జి. రాజేంద్రలు గ్రామ సర్పంచ్ ఆలేటి ఉమా శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ మాణిక్యరెడ్డి, పాఠశాల హెచ?ం శివాజీ, ఉపాధ్యాయులు, నాయకులు బిక్షపతి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'జనంసాక్షి' క్యాలెండర్ ఆవిష్కరించిన సిఐ అనిల్ కుమార్



**వట్పల్లి, జనవరి 22 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా వట్పల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం సిఐ అనిల్ కుమార్, ఎస్సై లవ కుమార్ జనం సాక్షి నూతన సంవత్సర 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ... పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజలకు ఉపయోగపడే వార్తా కథనాలు ప్రచురించాలని కోరారు. వార్తా కథనాలు ప్రచురించే ముందు వాస్తవాలు తెలుసుకొని వార్తలు ప్రచురిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వట్పల్లి విలేఖరి మోష పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తాం

**గద్వాల నడిగడ్డ, జనవరి 22 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికలను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. గురువారం మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై హైదరాబాదు నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్సో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అనుభవజ్ఞులై ఉండాలని వారికి అవసరమైన శిక్షణను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, కొన్ని హరిత పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల లోపలనే కాక బయట కూడా వెబ్ కాస్టింగ్ నిర్వహించడంపై ఆలోచించాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన వెంటనే బ్యాలెట్ పేపర్స్ ను తప్పులు లేకుండా ప్రింటింగ్ చేయించాలన్నారు. కౌంటింగ్ త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైనన్ని ఎక్కువ టేబుల్స్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయా జిల్లాల ఎన్నికల యంత్రాంగం పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పలువురు ఎన్నికల అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలోని నాలుగు పురపాలికల్లో మొత్తం 77 వార్డులలో 189 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి అవసరమైన శిక్షణ పూర్తి చేస్తామన్నారు. పోలింగ్ సందర్భంగా 430 మంది ప్రిసైడింగ్, 846 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో పాటు 1964 మంది ఓపిఓలు విధులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్, ఎన్నికల సామాగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలతో పాటు కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లన్నీ చేయనున్నట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ బాక్సుల కొరత లేకుండా



అదనంగా బాక్సులను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. సమస్యత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన పోలీస్ బందోబస్తును నియమించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం,మున్సిపల్ కమిషనర్లు,ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లే అవుట్ల అభివృద్ధి ప్రభుత్వ నిబంధనల మేరకు జరుగేలా తగిన చర్యలు చేపట్టాలి

• జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



**గద్వాల నడిగడ్డ, జనవరి 22 (జనం సాక్షి) :** లే అవుట్ల అభివృద్ధి ప్రభుత్వ నిబంధనల మేరకు జరుగేలా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం గద్వాల మున్సిపల్ పరిధిలోని వెంకంపేట శివారు లోని సర్వే నంబర్ 20 లో లేఅవుట్ ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లే అవుట్?కు సంబంధించిన మ్యాపులను పరిశీలించి,రోడ్డు కనెక్టివిటీ,నీటి వనరులు,బఫర్ జోన్ తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.లే అవుట్ల అభివృద్ధిలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని,ల్యాండ్ డెవలప్?మెంట్ ప్రణాళికకు అనుగుణంగా మౌలిక వసతులు సమకూర్చాలని సూచించారు. అంతర్గత రహదారులు,నీటి సరఫరా,డ్రైనేజీ వ్యవస్థలను నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని సూచించారు. బఫర్ జోన్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.అనంతరం గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 494 లేఅవుట్?ను పరిశీలించిన కలెక్టర్,లే అవుట్?లో నీటి కనెక్షన్,స్ట్రామ్ వాటర్ డ్రెయినేజ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.తదనంతరం గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని పరమాల శివారులోని సర్వే నంబర్ 1028 లో లేఅవుట్?ను పరిశీలించిన కలెక్టర్,నీటి వనరులు,విద్యుత్,డ్రెయినేజ్ కనెక్షన్లు సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఓపెన్ స్పేస్?లను పచ్చదనంతో అభివృద్ధి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జానకిరామ్,టౌన్ ప్లానింగ్ అధికారి కుర్మన్న,తహసీల్దార్ మల్లికార్జున్,ఎ.ఈ లు,తదితరులు పాల్గొన్నారు.

## పురపాలికల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

• జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, జనవరి 22 (జనంసాక్షి) :** త్వరలో జరుగబోయే మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్.ఆదర్శ్ సురభి అన్నారు.గురువారం మున్సిపల్ ఎన్నికల నిర్వహణ పై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల సన్నద్ధత పై సమీక్ష నిర్వహించారు. ఫోటోతో కూడిన ఎలక్టరల్ రోల్ పబ్లిష్ చేయడం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్, రిటర్నింగ్ అధికారులు ఎంపిక, పోలింగ్ సిబ్బంది, తదితర అంశాల పై కలెక్టర్లతో సమీక్ష నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.బ్యాలెట్ పేపర్ ముద్రణ విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకొని పకడ్బందీగా ముద్రణ జరిగే విధంగా చూడాలని సూచించారు.నామినేషన్ సమయంలో వెబ్ క్యాస్టింగ్ లేదా వీడియో కవరేజీ చేయించాల్సిందిగా సూచించారు. కౌంటింగ్ కొరకు పకడ్బందీగా ముందస్తు ప్రణాళికలు చేసుకోవాలన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో జరగబోయే ఐదు మున్సిపాలిటీల ఎన్నికలకు సంబంధి ఇప్పటికే ఫోటో తో కూడిన ఎలక్ట్రల్ రోల్ విడుదల చేయడం జరిగిందని, ప్రజల నుండి వచ్చిన దాదాపు 200 అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించినట్లు తెలిపారు. జిల్లాలోని 5 మున్సిపాలిటీల్లో 80 వార్డులకు గాను 117441 ఓటర్లకు సరిపడా 191 పోలింగ్ కేంద్రాలను గుర్తించి మున్సిపల్ అధికారులు పరిశీలించి వాటిలో మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రేపు రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు.చేయడం జరిగిందని, పోలింగ్ సిబ్బంది వివరాలు ఇప్పటికే టి పోల్ లో నమోదు చేసినట్లు తెలియజేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ చేయించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇప్పటికే పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్లను గుర్తించి తగిన ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. వనపర్తి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చిన పకడ్బందీగా ప్రశాంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, డి.పి. ఒ రఘునాథ్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు వి.సి.లో పాల్గొన్నారు.

## రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుంది



**సదాశివపేట, జనవరి 22 (జనం సాక్షి) :** సదాశివపేట పట్టణంలో రానున్న మున్సిపల్ ఎన్నికలకు జనసేన పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఉమ్మడి మెదక్ జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ్ రాధా రామ్ రాజలింగం అన్నారు. గురువారం పట్టణంలో జనసేన పట్టణ అధ్యక్షుడు సాకేత్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి సిద్ధమని అధికారికంగా ప్రకటించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి మెదక్ జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ్ రాధా రామ్ రాజలింగం హాజరై మాట్లాడారు.జనసేన పార్టీ ప్రభావం ఆంధ్రప్రదేశ్?కే పరిమితం కాదని, తెలంగాణలో కూడా ప్రజా సమస్యల పరిష్కారంలో జనసేన కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ జనసేన ముందువరుసలో నిలుస్తుంది. ప్రజల తరఫున పోరాడటమే మా విధానం" అని స్పష్టం చేశారు. తెలంగాణలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను పట్టించుకోని పాలకులపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్న వారందరూ జనసేన వేదికగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానికంగా తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, నిరుద్యోగం వంటి మౌలిక సమస్యలపై జనసేన ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా జనసేన నిలుస్తుందని, అవినీతి రహిత పాలన లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ సదాశివపేట పట్టణ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'జనంసాక్షి' క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కాంగ్రెస్ జిల్లా నాయకులు నరేందర్ రెడ్డి



**వెల్దుర్తి, జనవరి 22 (జనం సాక్షి) :** నూతన సంవత్సర 2026 క్యాలెండర్ను గురువారం వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ జిల్లా నాయకులు నరేందర్ రెడ్డి ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే వార్త కథనాలు దినపత్రికలో ప్రచురించాలన్నారు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి అనునిత్యం తీసుకువెళ్లాలన్నారు సమాజంలో నాలుగవ స్తంభం పాత్రికేయులదేనన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవితో పాటు కుకునూర్ మాజీ సర్పంచ్ తలారి మల్లేశం పిఎసిఎస్ డైరెక్టర్ కృష్ణ గౌడ్ మంగళపర్తి మాజీ సర్పంచ్ రామకృష్ణారావు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రాణాలకు రక్షణ

• డీఎస్పీ నల్లపు లింగయ్య

**నారాయణపేట జిల్లా బ్యూరో, జనవరి 22 (జనం సాక్షి) :** రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రాణాలకు రక్షణ అని నారాయణపేట డీఎస్పీ ఎన్.లింగయ్య అన్నారు.జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు నారాయణ పేట జిల్లా కేంద్రంలో అరయివ్ అలైవ్ కార్యక్రమంలో భాగం గా పాత బస్టాండ్, మట్టన్ మార్కెట్ వద్ద రోడ్డు ప్రమాదా ల నివారణే లక్ష్యంగా ప్రజలకు, వాహనదారులకు, డ్రైవర్ లకు డిఎస్పీ నల్లపు లింగయ్య , నారాయణపేట పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సంధర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అరయివ్ అలైవ్ అంటే ఇంటి నుండి క్షేమంగా వెళ్లి, క్షేమంగా రావడం అని బయటకు వెళ్ళే వారు అంతే క్షేమంగా ఇంటికి వస్తే మంచిది అని రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రాణాలకు రక్షణ అని ఆయన తెలిపారు.అలాగే ఒక ఇంట్లో ఒక్క వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ ఇంట్లో కుటుంబ సభ్యులు మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఉంటుందని అలాంటివి చాలా వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా యి అని అలాంటివి జరు గకుండా వాటిని దృష్టిలో ఉంచుకొని, వాహనదారులు, ఆటో డ్రైవర్లు, స్థానిక ప్రజలకు రోడ్డు భద్రత నియమాలు కచ్చితంగా పాటించాలని డీఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు అతి ముఖ్యమైన ప్రధాన కారణాలు అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, ట్రాఫిక్ నియమాలను నిర్లక్ష్యం చేయడమేనని తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించాలని, ట్రాఫిక్ సంకేతాలను గౌరవించాలని, నిర్ధేశిత వేగ పరిమితిని పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికుల భద్రతను ముఖ్యంగా పరిగణలోకి తీసుకొని వాహనాలు నడపాలని, మైనర్ పిల్లలు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కోరారు.రోడ్డు భద్రత అనేది ఒక్కరి బాధ్యత కాదని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి నియమాలు పాటించినప్పుడే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు.అరయివ్ అలైవ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ప్రజలు



సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకోవడమేనని స్పష్టం చేశారు.ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని తెలిపిన వ్యక్తికి పూలమాలసి డిఎస్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీఐ శివశంకర్, ఎస వెంకటేశ్వర్లు, కృష్ణ చైతన్య, పోలీస్ సిబ్బంది, ప్రజలు, వాహనదారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## నా భూమి నాకు ఇప్పించండి సారు?

- ఓ వృద్ధురాలి ఆవేదన
- రెవెన్యూలో పనిచేస్తున్న ప్రైవేట్ వ్యక్తి దుశ్చర్య



**సారంగాపూర్, జనవరి 22 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం ఆలూరు గ్రామానికి చెందిన ప్యాట అడేళ్ల బర్త దేవన్న 70 సంవత్సరాల వృద్ధురాలు వంశపారంపర్యంగా వస్తున్న భూమి సర్వే నంబర్ 182 విస్తీర్ణం 0.11 గుంటలు తనకు తెలియకుండానే అక్రమంగా అదే గ్రామానికి చెందిన మర్మ రంజిత్ కుమార్ అను వ్యక్తి కబ్జా చేసినట్లు తెలిపింది. ఎన్నాళ్ళుగా ఈ భూమి ద్వారా వచ్చిన పంటతోనే తన జీవనాధారం సాగిస్తున్నాన్న క్రమంలో నాకు తెలియకుండానే నా పేరు పై ఉన్న భూమిని వేరొకరు కబ్జా చేసుకున్నారు. ఇది ఎలా జరిగిందని పెద్దలకు అడగగా రెవెన్యూ లోపంతో జరిగినట్టు సమాచారం ఇచ్చారు. మర్మ రంజిత్ కుమార్ కు రెవెన్యూలో భూ కొలతలు కొలిచే సర్వేయర్ కింద ప్రైవేట్ గా పనిచేస్తున్న చింతకుంట సాగర్ అనే వ్యక్తి రంజిత్ కు సహకరించాడని తెలిసింది గుట్టు చప్పుడు కాకుండా నిరక్షరాస్యులైన వృద్ధురాలికి మోసం చేసినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ విషయమై ప్రశ్నించడానికి వెళ్తే బెదిరింపులకు పాల్పడుతున్నరూ నన్ను ఎవరు ఏమి చేయలేరు ఏం చేసుకుంటారు చేసుకోండి అంటూ మొండి వైఖరి చూపుతున్నారు. తాసిల్దార్ కార్యాలయంలో ఇలాంటి కమిషన్లు తీసుకుంటూ అక్రమ కార్య కలపాలకు పాల్పడుతున్న ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న వ్యక్తులను తొలగించి న్యాయబద్ధంగా కబ్జా చేసిన తన భూమిని తిరిగి నా పేరు పై చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.

## బాసరలో వసంత పంచమి వేడుకలకు పటిష్ఠ బందోబస్తు

- జిల్లా ఎస్పీ జానకీ షర్మిల



**నిర్మల్ బ్యూరో (జనంసాక్షి) :** చదువుల తల్లి బాసరలో వసంత పంచమి వేడుకలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాంతియుతంగా వేడుకలు నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి దిశానిర్దేశం చేశారు. వసంత పంచమి సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో, భక్తుల రాకపోకలు అధికంగా ఉండే మార్గాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలను మోహరించనున్నట్లు తెలిపారు. భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా బారికేడింగ్, క్యూలైన్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ సౌకర్యాలు, లడ్డు కౌంటర్ల వద్ద రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటి చర్యలను ముందుగానే సిద్ధం చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. అదేవిధంగా సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా, సాదా దుస్తుల్లో పోలీసుల మోహరింపు, కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు కనిపించినా వెంటనే సమీప పోలీసు సిబ్బందికి లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని భక్తులను జిల్లా ఎస్పీ కోరారు. వసంత పంచమి వేడుకలు ప్రశాంతంగా, భద్రంగా జరిగేందుకు నిర్మల్ పోలీస్ శాఖ పూర్తిగా సంసిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

- వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష



**హనుమకొండ ప్రతినిధి జనవరి 22 (జనంసాక్షి) :** కిషోర బాలికలు, బాలుర కోసం చేపడుతున్న స్నేహ కార్యక్రమం పటిష్టంగా అమలు చేయడంపై అధికారులు దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డిఆర్డిఏ సెర్ప్ ఇందిరా మహిళా శక్తి మిషన్ లో భాగంగా స్నేహ కార్యక్రమం నిర్వహణపై జిల్లా కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేయడంపై వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ కిషోర బాలికలు, బాలుర కోసం చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా 15-18 సంవత్సరాల వయసున్న కిషోర బాలబాలికలకు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో స్నేహ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. బాలబాలికలకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు ఏమేమి కావాలో ముందుగా అధికారులు గుర్తించాలన్నారు. చైల్డ్ లేబర్, చైల్డ్ మ్యారేజ్, పోక్సో చట్టాలపై అధికారులు అవగాహన కార్యక్రమలు నిర్వహించాలన్నారు. స్నేహ కార్యక్రమంపై సంవత్సర కాలానికి సంబంధించి ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో మేన శ్రీను కిషోర బాలికలు, బాలురకు స్నేహ కార్యక్రమం ద్వారా కలిగే ప్రయోజనాలను, స్నేహ కమిటీల ఏర్పాటు సంబంధించిన వివిధ అంశాలను కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, డీఈవో గిరిరాజ్ గౌడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహ స్వామి, డీఐఈవో గోపాల్, జిల్లా యువజన క్రీడల అధికారి అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, మెప్మా డీఎంసీ రజిత రాణి, డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ మదన్ మోహన్ రావు, డాక్టర్ ప్రదీప్ రెడ్డి, డీఆర్డీఏ డీపీఎం పద్మప్రియ, ఇతర అధికారులతో పాటు సర్వోదయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కవిరాజ్, ఇందిర, తరుణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కవిత, తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం


- మంత్రి కొండా సురేఖ



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో అత్యంత వైభవంగా జరుగుతున్న ప్రసిద్ధ నాగోబా జాతర సందర్భంగా గురువారం నిర్వహించిన 'నాగోబా దర్బార్' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాగోబా దేవతను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, ఎస్పీ అఖిల్ మహాజన్, మేస్రం వంశీయులు మంత్రికి సాదర స్వాగతం పలికారు. మేస్త్రం వంశీయులు, అధికారులు మంత్రిని శాలువాలతో సత్కరించి నాగోబా చిత్రపటాన్ని అందించారు.అనంతరం నిర్వహించిన నాగోబా దర్బార్లో మంత్రి పాల్గొని మాట్లాడుతూ, నాగోబా జాతర భారతదేశంలో ఆదివాసీలు నిర్వహించే పండుగల్లో రెండవ అతిపెద్ద జాతర అని పేర్కొన్నారు. ఈ జాతర గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఆదివాసీలు, ప్రజలందరికీ నూతన సంవత్సరం, సంక్రాంతి, సమ్మక్క, సారలమ్మ జాతర శుభాకాంక్షలు తెలిపారు. నాగోబా దేవాలయ సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 22 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి ప్రకటించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనతో పాటు ఆలయ పరిసరాల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగించనున్నట్లు తెలిపారు. నాగోబా చరిత్ర, విశిష్టత, సాంప్రదాయాలను మంత్రి వివరించారు. ధూప, దీప, నైవేద్యం పథకం కింద నాగోబా ఆలయంలో పనిచేస్తున్న ఏడుగురు సిబ్బందికి ప్రభుత్వం తరఫున వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దేవాలయంలో సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజన సంప్రదాయ దేవాలయాల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుందన్నారు. 1942 నుంచి కొనసాగుతున్న నాగోబా దర్బార్ ప్రధాన ఉద్దేశ్యం ఆదివాసీల అర్జీల పరిష్కారమేనని మంత్రి స్పష్టం చేశారు. అటవీ భూముల సమస్యలు, పోడు భూముల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. అటవీ ప్రాంతాలు రహదారులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వంటి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అలాగే రూ. 13 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు, పోడు భూముల సర్వే వేగవంతం చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద 16,405 ఇండ్లు మంజూరు చేశామని, ఇందుకోసం రూ. 156 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. పీవీటీజీ కుటుంబాలకు ప్రత్యేకంగా 639 ఇండ్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు. ఆదివాసీ కనకరాజుకు పద్మశ్రీ లభించిందని తెలిపారు. ఈనెల 26న దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలలో పెందూర్ శాంతాబాయికి ఆహ్వానం లభించిందని వివరించారు. ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, మౌలిక వసతులు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాలలో విద్యా, వైద్యం, రవాణా సౌకర్యం వంటి సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ చర్యలు తీసుకుం టుందని వివరించారు. అనంతరం ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను గిరిజనులకు మంత్రి, కలెక్టర్ అందజేశారు. అటవీశాఖ కు సంబంధించి పాటల సీడిని మంత్రి ఆవిష్కరించారు. అంతకుముందు దర్బార్లో గిరిజన, ఆదివాసి చిన్నారులు చేసిన నృత్యాలు, భద్రాచలం, మధ్యప్రదేశ్ నుండి వచ్చిన ఆదివాసిల సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకర్షించాయి. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, పోలీస్ శాఖ అధికారులు, సర్పంచ్ మెస్రం తుకారం, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, మేస్రం వంశీయులు, పెద్ద సంఖ్యలో ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలి

- ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి
- వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య
- కలెక్టరేట్‌లో చీఫ్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష



**హనుమకొండ ప్రతినిధి జనవరి 22 (జనం సాక్షి) :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని ఎంపీ ఛాంబర్‌లో చీఫ్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల కోసం ఎంపీ నిధుల నుండి మొత్తం రూ. 8 కోట్ల 30 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులకు అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ ఇచ్చిన తేదీ నుంచి మూడు నెలల లోపు పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో పనులు రద్దు చేయాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు. నియోజకవర్గంలోని మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, ఆరోగ్యం, విద్య వంటి రంగాలతో పాటు ప్రజలకు ప్రత్యక్షంగా మేలు చేసే కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత కాలపరిమితిలోనే పనులు పూర్తయ్యేలా కఠినంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అధికారులు ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు, పెండింగ్ ప్రాజెక్టుల స్థితి, భవిష్యత్తులో అమలు చేయనున్న ప్రణాళికలను ఎంపీకి వివరించారు. ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చీఫ్ ప్లానింగ్ అధికారులు సత్యనారాయణ రెడ్డి, చంద్రకళ, కొట్యా నాయక్, బాబురావు, పంచాయతీరాజ్ అధికారులు ఆత్మా రామ్, రమేష్ బాబు, కిషన్, సతీష్ బాబు, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, టీజీఈడబ్ల్యూఐడిసీ అధికారి కిషన్, డిడబ్ల్యూఓ రాజమణి, మిషన్ భగీరథ అధికారి శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏరువాక కేంద్రం కోసం భూ పరిశీలన

- హర్షం వ్యక్తం చేస్తున్న దుగ్గొండి మండల రైతులు



**వరంగల్ ప్రతినిధి, జనవరి 22(జనంసాక్షి):** వ్యవసాయ రంగంలో అన్నదాతల కండగా ఉండి సలహాలు సూచనలు అందించే ఏరువాక కేంద్రం కోసం దేశాయిపల్లి గ్రామంలో నిరుపయోగకరంగా ఉన్నటువంటి 20 ఎకరాల భూమి ఏరువాక కేంద్రం కోసం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వ్యవసాయ శాస్త్రవేత్తలు స్థానిక కాంగ్రెస్ నాయకులు తో కలిసి పరిశీలించారు. గురువారం దుగ్గొండి ప్రాంతంలోని రైతులకు వ్యవసాయం పట్ల పూర్తి అవగాహన కల్పించడం కోసం ఏరువాక కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ ఏరువాక కేంద్రంలో సైంటిస్టులు, వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండి రైతులకు సూచనలు సలహాలు ఇవ్వడానికి కృషి చేస్తారని తెలిపారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా రైతులకు వ్యవసాయంలో సమస్యలు ఏర్పడుతున్నందున వ్యవసాయ సమస్యల నివృత్తి మెలకువల కోసం ఏరువాక కేంద్రం దోహదం చేస్తుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. ఈ ఏరువాక కేంద్రానికి భూమి అవసరమైతే ఎమ్మెల్యే సీడీఎఫ్ నిధులనుండి కొనుగోలు చేసిఇస్తామన్నారు. ఈకార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు భూమ్ పెల్లి దేవేందర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, శనర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, దుగ్గొండి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చుక్క రమేష, క్లస్టర్ ఇంచార్జ్ ఓలిగే నర్సింగరావుతోపాటు గ్రామ సర్పంచ్ ఉత్తరేణి భాగ్యలక్ష్మి రాజబాబు, బిక్కాజిపల్లి సర్పంచ్ బందారి రమేష్ నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ హింగే రామారావు,అజ్మీరా దంజ్య నాయక్,కాంగ్రెస్ మండల నాయకులు బండారి ప్రకాష్, కాంగ్రెస్ యువజన నాయకులు సుమంత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యాల కుమారస్వామి,నాచినపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు స్వామి,మండలంలోని సర్పంచ్ లు,రైతులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- ములుగు జిల్లా రవాణా శాఖ అధికారులు బారాగాడి శ్రీనివాస్, వై.వినోద్

**ములుగు బ్యూరో, జనవరి 22 (జనంసాక్షి):** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున ములుగు జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో మరియు జిల్లా ప్రజా పరిషత్ బాలికల పాఠశాలలో రోడ్డు భద్రత పట్ల ట్రాఫిక్ నియమాల గురించి వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ బాలికల పాఠశాలలో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఫోటో ముద్రణతో కూడిన నోట్ బుక్స్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా రవాణా శాఖ అధికారులు బారాగాడి శ్రీనివాస్ వై.వినోద్ రెడ్డి ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసాక్షి దినపత్రిక 2026 నూతన క్యాలెండర్




**ఏటూరు నాగారం, జనవరి 22 (జనంసాక్షి) :** ఏటూరు నాగారం మండలంలోని రామన్నగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పెద్దలు సర్పంచ్ గద్దల నవీన్,ఉప సర్పంచ్ కోడి ధర్మరాజు, జనంసాక్షి దిన పత్రిక 2026 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా ఎప్పటికప్పుడు సమాచారం అందించే పత్రిక జనంసాక్షి దినపత్రిక అన్నారు. జనాలలో మధ్యలో తిరుగుతూ జనాల సమస్యల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి వెలికి తీసే పత్రిక జనంసాక్షి దినపత్రిక అని అన్నారు. గ్రామ పెద్దలు అందరితో కలిసి జనంసాక్షి దినపత్రిక 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గద్దల నవీన్, ఉప సర్పంచ్ కోడి ధర్మరాజు, కొడాలి శ్రీనివాస్, బొల్లె ఆదినారాయణ, ఏంపెల్లి ఇస్తారీ ,గద్దల భాస్కర్, గద్దల నరేష్,యనమల్ల నారాయణ, వేమునూరు సృజన్, ఏంపెల్లి బాబు, తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు రూ.165 కోట్లతో రహదారుల నిర్మాణం

- 1418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయం





**మేడారం,జనవరి 22(జనం సాక్షి):** ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ గిరిజన జాతర ప్రారంభానికి మరో ఐదు రోజులు మాత్రమే ఉండడంతో ఇప్పటికే మేడారానికి ప్రతీ రోజూ లక్షలాది మంది భక్తులు ముందస్తు మొక్కులకై తరలి వస్తున్నారు. కేవలం, జాతర జరిగే జనవరి 28 వతేదీ నుండి 31 తేదీ మధ్యలోనే దాదాపు కోటిన్నరకు పైగా భక్తులు హాజరవుతారని అంచనా వేసినందున,మేడారానికి వచ్చే ప్రధాన రహదారులు,జాతీయ రహదారులు, రోడ్లు, భవనాల శాఖ నిర్వహణలో ఉండే రహదారులతో పాటు పంచాయితీ రాజ్ శాఖ ద్వారా నిర్వహించే రహదారులన్నింటిని పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసింది. వివిధ శాఖల క్రింద మేడారానికి దారితీసే 39 ప్రధాన రహదారులు ఉన్నాయి. ఇవే కాకుండా, మరో 10 రోడ్లను, మూడు కల్వర్టులను కొత్తగా నిర్మించారు.జాతీయ రహదారులకు చెందిన 8 రహదారుల పటిష్టత, మరమ్మతు,నూతన బ్రిడ్జిల నిర్మాణాన్ని రూ. 360 లక్షలతో చేపట్టి పూర్తి చేశారు. వీటిలో,ప్రధానంగా, కటాక్షపూర్, మల్లంపల్లి లవద్ద నూతన బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేశారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా దాదాపు రూ. 102 కోట్ల వ్యయంతో రహదారుల నిర్మాణం, పటిష్ట, ఇతర సివిల్ పనులు రికార్డు సమయంలో పూర్తిచేశారు. ఈ శాఖ క్రింద ఉన్న పస్రా నుండి భూపాల పల్లి వరకు 33 కిలోమీటర్లు, తాడ్వాయి నుండి నార్లాపూర్ వరకు 20 కిలోమీటర్లు, చిన్నబోయినపల్లి నుండి ఊరట్టం వరకు 23 కి.మీ. రహదారుల పటిష్టత, రీకార్పెటింగ్ చేపట్టారు. వీటితోపాటు, చిలకల గట్టు సమ్మక్క మార్గం నుండి గద్దెల వరకు, సమ్మక్క టెంపుల్ వద్ద, పోలీస్ క్యాంపు ల వద్ద బారికేడింగ్ ఏర్పాట్లు చేశారు. పోలీస్ క్యాంపు వద్ద హెలీపాడ్స్ నిర్మాణం, మరమత్తులు చేపట్టడం జరిగింది.పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ. 52 .21 కోట్ల వ్యయంతో 84 పనులు చేపట్టడం జరిగింది. ఇదేకాకుండా, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ. 8.08 కోట్ల వ్యయంతో 3 కొత్త భవనాల నిర్మాణం, 29 ప్రస్తుత భవనాల మరమత్తులు, 5 కొత్త రోడ్ల నిర్మాణం తదితర పనులను చేపట్టి పూర్తి చేశారు.

### 1418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయం

మేడారం జాతరకు ఆర్టీసీ బస్సులతో పాటు భారీ సంఖ్యలో ప్రయివేటు వాహనాలలో భక్తులు వస్తారు.లక్షల సంఖ్యలో వచ్చే ఈ వాహనాల పార్కింగ్ కు ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రధానంగా. 43 ప్రాంతాల్లో 1418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయాలను కల్పించారు. వీటిలో, అటవీ శాఖకు చెందిన 15 ప్రాంతాలలో 235 ఎకరాల్లో, ట్రైబల్ వెల్ఫేర్, పట్టా భూములకు చెందిన 24 ప్రాంతాల్లో 1164 ఎకరాల్లో,ప్రభుత్వ భూములకు చెందిన 3 ప్రాంతాల్లో 19 ఎకరాల్లో పార్కింగ్ సదుపాయంతో పాటు ఇక్కడ ఉండే భక్తులు, డ్రైవర్లకు తాగునీటి సౌకర్యం, టాయిలెట్ తదితర సౌకర్యాలను కల్పించారు.

# మినీ ట్యాంక్‌బండ్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి

- రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 22 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని సద్దలచెరువు మినీ ట్యాంక్ బండ్ ను ప్రజలందరూ సేదతీరే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణం ప్రతిబింబించే విధంగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు.గురువారం ఆయన మినీ ట్యాంక్ బండ్ వద్ద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు.సూర్యాపేటను ఒక ప్రత్యేక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతోనే సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.గత ప్రభుత్వ కాలంలో ట్యాంక్ బండ్ సంబంధిత పనులు పూర్తిగా నిలిచిపోయి ఉండటంతో, ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రూ.5 కోట్లతో మినీ ట్యాంక్ బండ్ సుందరికరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ అభివృద్ధి పనులను ఆరు నెలల్లోపు పూర్తి చేసి సూర్యాపేట ప్రజలకు మినీ ట్యాంక్ బండ్?ను ఒక ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతంగా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా క్యాంటీన్, వాకింగ్ ట్రాక్, లైటింగ్, విశ్రాంతి ప్రదేశాలు సహా అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.తాను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రత్యేకంగా కోటి రూపాయల అంచనా వ్యయంతో 80 సీట్ల ఏసీ బోట్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ బోట్ నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని, నెలలోపు పూర్తిచేసి పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ బోట్?ను ప్రధానంగా బర్త్‌డే పార్టీలు, చిన్న ఫంక్షన్లు, చెరువు మధ్యలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించుకునే విధంగా అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.సద్దుల చెరువు పరిసర ప్రాంతంలోని సుమారు 5 ఎకరాల పార్క్ స్థలంలో రూ.15 కోట్లతో ఒక అ అంతర్జాతీయ పార్క్ అభివృద్ధికి నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ పార్క్?కు త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని, అవసరమైతే ఇంకా నిధులను అదనంగా వెచ్చించి అయినా పార్క్‌ను ట్యాంక్ బండ్, ఐలాండ్ పార్క్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా సూర్యాపేటను పర్యాటక రంగంలో ముందుకు తీసుకువెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.సూర్యాపేట పర్యాటక అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసినందుకు పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు,సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా,ముదిరెడ్డి రమణారెడ్డి, డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్,వెలుగు వెంకన్న, ఫరూక్, దొంతిరెడ్డి సైదిరెడ్డి,ధర్మానాయక్, అదికారులు తదితరులు పాల్గొన్నారు.

## జానపహాడ్ దర్గా ఉర్సు ఉత్సవానికి పటిష్ట భద్రత



**పాలకవీడు, జనవరి 22 (జనంసాక్షి) :** జాన్ పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ ఉత్సవం జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు,దర్గాను సందర్శించి ప్రార్థనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లను చేస్తున్నాము అని,సోదరభావంతో కలిసి మెలిసి ఉత్సవం నిర్వహించుకోవాలని కోరారు.దర్గా,వాహనాల పార్కింగ్ స్థలాలు, ఉత్సవ ప్రాంతంలోకి వచ్చిపోయే మార్గాలను ఎస్పీ పరిశీలించారు.ఉత్సవ ప్రాంతంలో 65 సీసీ కెమెరాలతో ఉత్సవం పర్యవేక్షణ చేయడం జరుగుతుంది అని. వాహనాలు రద్దీ వల్ల భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ రెగ్యులేషన్ చేస్తూ,పార్కింగ్ పాయింట్ లు ఏర్పాటు చేయడం జరిగినది,భక్తులకు ఇబ్బందులు కలగకుండా రక్షణ కల్పిస్తూ బందోబస్తు నిర్వహించాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్ళాలని అధికారులను ఆదేశించారు.బందోబస్తు పర్యవేక్షణకు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి ని నియమించమని తెలిపారు.ఎస్పి వెంట అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిఎస్పీ శ్రీనివాస్,సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు, మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, కోటేశ్ ,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశ్నించే ప్రజా గొంతుక జనంసాక్షి

- కులమతాలకు అతీతంగా పేద ప్రజలకు చేయూతనివ్వాలి
- ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలి
- జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా




**వికారాబాద్, జనవరి 22 (జనంసాక్షి) :** ప్రజలకు ప్రభుత్వానికి మధ్యల పత్రికలు వారధిగా ఉండాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా అన్నారు. జనంసాక్షి తెలుగు దినపత్రిక 2026 నూతన సంవత్సర జిల్లా క్యాలెండర్ ను జిల్లా కలెక్టరేట్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో వారి చేతుల మీదుగా వేరువేరుగా గురువారం నాడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...కులమతాలకు అతీతంగా పేదవారికి సేవ చేయాలని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండాలని కోరారు. మారుమూల ప్రాంతాల నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకోలేని పేదవారు వారియొక్క సమస్యలు తెలుపుకునేంత చైతన్యవంతం కూడా లేని పేద ప్రజల పక్షాన జనంసాక్షి నిలబడాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా క్యాలెండర్ ఆవిష్కరించారు. జిల్లాలో జరుగుతున్న పరిణామలపై జిల్లా ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగానికి వారధిగా జనంసాక్షి ప్రతినిధులు పనిచేయాలని పత్రిక ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా బ్యూరో కె.నరసింహులు, తాండూర్ అర్సీ శంకర్, వికారాబాద్ అర్సీ అంజిలయ్య, యాలాల్ ప్రతినిధి రవీందర్ చారి, నవాబ్ పేట్ ప్రతినిధి లక్ష్మణ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి

- నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ, జనవరి 22 (జనం సాక్షి) :** బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని హైదరాబాద్ నుండి మున్సిపల్ ఎన్నికల నిర్వహణ విషయమై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశం లో నల్లగొండ జిల్లా కలెక్టర్ మాట్లాడుతు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల కు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని అని మున్సిపల్ ఎన్నికలకు నల్లగొండ జిల్లాలో 475 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, రిజర్వేషన్ల అమలు చేశామని, 70 మంది ఆర్వో లు,68 మంది ఏఆర్వోలను నియమించామని,వివిధ నోడల్ టీములను ఏర్పాటు చేశామని,నోడల?ధికారుల శిక్షణ, నామినేషన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ,కౌంటింగ్ సెంటర్లు, సదుపాయాలు కల్పిస్తున్నామని, సీసీ కెమెరాల ఏర్పాటు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టర్ అధికారుల నియామకం ఇప్పటికే పూర్తి చేశామని, శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు బ్యాలెట్ పేపర్ ముద్రణ, పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, మూత్రశాలను ర్యాంపులు, దివ్యాంగులకు వీల్ చైర్లు ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు .ఎఫ్ ఎస్ టి ,ఎస్ ఎస్ టి ల. టీములకు శిక్షణ తరగతులు పూర్తి చేసామని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుమిదిని మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల వివరాలను అప్లోడ్ చేయటం, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, వివిధ రకాల కమిటీల ఏర్పాటు వంటి అంశాలపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ , స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి , దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు.

## యాప్‌లో యూరియా కొనలేక రైతుల ఇబ్బందులు

- రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- రైతుబంధు సమితి మాజీ మండల కన్వీనర్ బచ్చు రామకృష్ణ




**మర్రిగూడ, జనవరి 22 (జనం సాక్షి) :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ లో యూరియా బుక్ చేసుకున లేక కొనలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతుబంధు సమితి మాజీ మండల కన్వీనర్ బచ్చు రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర?స్ మర్రిగూడ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న బచ్చు రామకృష్ణ మాట్లాడుతూ..సాంకేతిక నైపుణ్యం లేక యూరియాను ఎలా కొనుగోలు చేయాలో తెలియక అయోమయం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అదునుగా నైపుణ్యం ఉన్నవారు యూరియాను ఏదేచ్ఛగా తరలిస్తున్నారని వాపోయారు. యాప్ లో దొరకని యూరియా షాపులో ఏవిధంగా దొరుకుతుందని ప్రశ్నించారు.రైతుల దగ్గర స్మార్ట్ ఫోన్లు ఉంటాయని నిలదీశారు. కేసిఆర్ ప్రభుత్వంలో సకాలంలో ఎరువులను అందుబాటులో ఉంచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో యరగండ్లపల్లి సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్, మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు రాపోలు యాదగిరి, నాయకులు చెరుకు శ్రీరామ్ గౌడ్, ఎండి యాకూబ్ అలీ, ఆంబోతు హరిప్రసాద్ నాయక్,వట్టి కోటి శేఖర్, పగడాల రఘు, నల్ల శేఖర్, వనమాల మహేష్, కోన్ రెడ్డి యాదయ్య, గుణగంటి నగేష్, పోలె సైదులు, కొండాపురం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడి వద్దకే వెళ్లి ఫిర్యాదు నమోదు చేసిన కనగల్ పోలీసులు

- నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్



**నల్లగొండ, జనవరి 22 (జనం సాక్షి) :** బాధితులు వివిధ కారణాల వల్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చి స్వయంగా ఫిర్యాదు ఇవ్వలేని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, తెలంగాణ పోలీస్ శాఖ పౌర కేంద్రిత బాధిత కేంద్రిత పోలీసింగ్ విధానంలో భాగంగా ప్రజల వద్దకే వెళ్లి న్యాయం అందించే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నల్లగొండ జిల్లా కనగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మదనపురం గ్రామానికి చెందిన బొల్లిగొర్ల గురువయ్య అనే వ్యక్తి ఇటీవల ఒక వ్యక్తి దాడిలో గాయపడి, నల్లగొండలోని సంరక్ష ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం పోలీసు అధికారుల దృష్టికి వచ్చింది. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఐపీఎస్ స్పందించి, వెంటనే కనగల్ ఎస్?ఐతో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు కనగల్ పోలీసు అధికారులు తక్షణమే స్పందించి బాధితుడి వద్దకు చేరుకున్నారు. గాయాల కారణంగా బాధితుడు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇవ్వలేని పరిస్థితి ఉండటంతో, పోలీసు అధికారులు ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని కలుసుకొని, అతనికి జరిగిన అన్యాయాన్ని వివరంగా అడిగి తెలుసుకున్నారు. బాధితుడి వాంగ్మూలాన్ని అక్కడికక్కడే నమోదు చేసి, స్పాట్?లోనే ఎఫ్ ఆర్ ఐ నమోదు చేయడం జరిగింది. అనంతరం కేసుపై దర్యాప్తు ప్రారంభించి, నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ మాట్లాడుతూ, ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో న్యాయం కోసం తప్పనిసరిగా పోలీస్ స్టేషన్?కు రావాల్సిన అవసరం లేదని, అవసరమైతే పోలీసులే బాధితుల వద్దకు వెళ్లి ఫిర్యాదు స్వీకరిస్తారని తెలిపారు. ముఖ్యంగా గాయపడిన వారు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు, వృద్ధులు, మహిళలు, అసహాయ వర్గాలకు బాధిత కేంద్రిత పోలీసింగ్ ద్వారా తక్షణ న్యాయం అందించడమే తెలంగాణ పోలీస్ శాఖ లక్ష్యమని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రత, రక్షణ, న్యాయం కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ఎవరైనా అన్యాయానికి గురైతే భయపడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

## మందు బాబుల అరాచకం

- మా రాజన్న అడ్డా...అంటూ...'రాజన్న' పేరుతో దౌర్జన్యం..
- వైన్స్ సిబ్బందిపై దాడి




**చండూరు, జనవరి 22 (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీలో అధికార పార్టీకి చెందిన కొందరు మందు బాబుల ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. వారు భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు చెప్పుకుని కొందరు కార్యకర్తలు చేస్తున్న దౌర్జన్యాలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి.గత మూడు రోజులుగా మండలానికి చెందిన కొందరు మందు బాబులు మద్యం మత్తులో మున్సిపాలిటీ పరిధిలో హల్ చల్ చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఫొటో, "మంత్రి రాజన్న" అని రాసి ఉన్న స్కార్పియో వాహనంలో తిరుగుతూ... రాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ముందు నుంచి అతివేగంగా దూసుకెళ్ళిన ఆ వాహనం, వెనకాలే ఉన్న వైన్ షాపు గేటును ఢీకొట్టి లోపలికి దూసుకెళ్లింది. ఈ ఘటనతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా ప్రాణభయంతో పరుగులు తీశారు.సిబ్బందిపై దాడి వైన్ షాపులోకి చొరబడిన సదరు వ్యక్తులు.. "మిమ్మల్ని ఇక్కడ వైన్స్ ఎవరు పెట్టమన్నారు. తాము రాజన్న అనుచరులం.. మాకు డబ్బులు ఇవ్వాల్సిందే" అంటూ డిమాండ్ చేశారు. "ఇది మా రాజన్న అడ్డా.. మేము అడిగినప్పుడల్లా మద్యం ఇవ్వాలి" అంటూ దబాయించారు. షాపులో పనిచేస్తున్న కస్తాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై పిడిగుద్దులతో విచక్షణారహితంగా దాడి చేశారు.దాడి జరుగుతున్న సమయంలో వైన్స్ నిర్వాహకులు 'డయల్ 100'కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని వారించే ప్రయత్నం చేయగా.. సదరు కార్యకర్తలు పోలీసులనే అసభ్య పదజాలంతో దూషించినట్లు సమాచారం. తాము అధికార పార్టీ వాళ్ళమని, తమకు ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయని పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారు.ఇంతకుముందు కూడా ఇదే వ్యక్తులు మున్సిపాలిటీ స్తంభాలకు 'మంత్రి రాజన్న' అనే బ్యానర్లు కట్టి కలకలం సృష్టించినట్లు స్థానికులు చెబుతున్నారు. వీరికి ఎమ్మెల్యే అండ ఉందనే ప్రచారంతో బాధితులు ఎవరూ ఫిర్యాదు చేయడానికి సాహసించడం లేదు. ప్రశాంతంగా ఉండే చండూరు మున్సిపాలిటీలో ఇటువంటి అరాచక శక్తుల వల్ల శాంతిభద్రతల సమస్య తలెత్తుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి, తన పేరు చెప్పుకుని అరాచకాలు సృష్టిస్తున్న వారిని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## సక్సెస్‌కు సీక్రెట్ ప్రాక్టీస్



**దేవరకొండ, జనవరి 22 (జనం సాక్షి) :** విద్యార్థుల శారీరక దృఢత్వానికి, మానసిక ఎదుగుదలకే కాకుండా క్రీడలు ఎంతో ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని కలిగిస్తాయని సీనియర్ సివిల్ జడ్జ్, మండల న్యాయ సేవ అధికారి సంస్థ చైర్మన్ కే అనిత తెలిపారు. గురువారం పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో అన్యువల్ స్పోర్ట్స్ మీట్లో భాగంగా క్రీడా మహోత్సవం కార్యక్రమాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో రాణించి అంతర్జాతీయ స్థాయి వరకు ఎదగాలని ఆకాంక్షించారు. సరదాల పేరుతో, కబుర్ల పేరుతో సమయాన్ని వృధా చేయవద్దని అన్నారు. ఈ రోజుల్లో చెడు అలవాటు ఉన్న స్నేహాలకు అవసరమనుకుంటే స్వారీ అని చెప్పి వారికి పక్కకు పెట్టలని, మంచి అలవాట్లు మీకు లేకపోతే నిపుణులైన లేదా సైకాలజిస్ట్ ద్వారా సలహాలు తీసుకొని ప్రతిరోజు కొద్ది కొద్దిగా సాధన చేయడం ద్వారా మంచి భవిష్యత్తుకు పునాది వేసుకున్న వారు అవుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వర్, జోనల్ ఇన్చార్జ్ నాగేశ్వరరావు, డైరెక్టర్ రాజ్ కుమార్ రెడ్డి,ప్రిన్సిపల్ నవీన్ గౌడ్, వైస్ ప్రిన్సిపల్ మొహమ్మద్ అన్వర్ హుస్సేన్, అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహిళల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**భూదాన్ పోచంపల్లి, జనవరి 22 (జనం సాక్షి) :** మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్మమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని జె వి ఫంక్షన్ హాల్ లో మెప్మా ఆధ్వర్యం లో మహిళా సంఘాలకు రూ.1 కోటి 11 లక్షల విలువైన వడ్డీ లేని రుణాల చెక్కులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలోనే భువనగిరి నియోజకవర్గంలో స్త్రీ నిధి పథకం ద్వారా మహిళా సంఘాలకు మొత్తం రూ.17 కోట్ల 99 లక్షల నిధులు అందజేశామని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు. అనంతరం మార్కండేయ స్వామి వారి 49వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణ కేంద్రంలోని పలు వార్డులను సందర్శించి స్థానిక సమస్యలపై అధికారులతో చర్చించి పలు అభివృద్ధి పనులకు వరుసగా శంకుస్థాపనలు చేశారు. నారాయణగిరి వద్ద కల్వర్ట్ నిర్మాణ పనులు, సీతవాణి గూడెం నందు స్మశాన వాటిక అభివృద్ధి పనులు, మాధవరెడ్డి చౌరస్తా అభివృద్ధి పనులు, ప్రభుత్వ దవాఖాన వద్ద సిసి రోడ్లు మరియు డ్రైనేజీ నిర్మాణ పనులు, పద్మ నగర్ పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నూతన మీటింగ్ హాల్?ను ప్రారంభించారు. రేవనపల్లి వద్ద కల్వర్ట్ నిర్మాణ పనులు, బసవలింగయ్య స్వామి కాలనీలోని డబుల్ బెడ్ రూమ్, కాలనీ అభివృద్ధి పనులు, ముక్తాపూర్ చెరువు కట్ట అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో శేఖర్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, ఆర్?ఐ వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాక మల్లేష్, పట్టణ అధ్యక్షులు భారత లవ కుమార్,రాష్ట్ర నాయకులు తడక వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ కళ్లెం రాఘవరెడ్డి, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, మర్రి నరసింహారెడ్డి, గునిగంటి రమేష్, గోరంటి శ్రీనివాస్ రెడ్డి, గునిగంటి వెంకటేష్, బండారు ప్రకాశ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విపణి

### ఆరోగ్య అత్యవసరాల్లో పర్సనల్ లోన్..

# అర్బన్‌లోనే ఎక్కువ!

**న్యూఢిల్లీ:**ప్రతిఒక్కరికీ ఏదోఒక సందర్భంలో అత్యవసరంగా నగదు అవసరాలు ఏర్పడుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లో ఎక్కువమంది వ్యక్తిగత రుణం తీసుకోవడానికే మొగ్గు చూపుతుంటారు. అయితే, పర్సనల్ లోన్లు తీసుకోవడంలో వైద్య అత్యవసర పరిస్థితులు కీలక భూమిక పోషిస్తున్నాయని ఓ నివేదిక పేర్కొంది. ముఖ్యంగా అర్బన్ ప్రాంతాల్లో ఈ కారణం చూపుతూ వ్యక్తిగత రుణాలు ఎక్కువగా తీసుకుంటున్నారని 'పైసా బజార్' తన నివేదికలో పేర్కొంది. ఈ మేరకు 'ది పర్సనల్ లోన్ స్టోరీ' పేరిట ఓ నివేదికను విడుదల చేసింది.దేశంలో వ్యక్తిగత రుణాలు తీసుకుంటున్న వారిలో 11 శాతం మంది ఆరోగ్య అత్యవసర, వైద్యం కోసం ఖర్చు చేస్తున్నట్లు తేలింది. టైర్- 1 నగరాల్లో ఇది 14 శాతంగా ఉంది. టైర్-2లో 10 శాతం, టైర్-3 నగరాల్లో ఇది 8 శాతంగా ఉంది. ఆరోగ్య బీమా కవరేజీ తక్కువగా ఉండడం, వైద్య ఖర్చులను నేరుగా చెల్లించాల్సి రావడం, వైద్య ద్రవ్యోల్బణం కీలక భూమిక పోషిస్తున్నాయని నివేదిక పేర్కొంది. ఇందుకోసం దేశంలోని 23 నగరాల్లో నివసిస్తున్న 2,889 మంది నుంచి అభిప్రాయాలు సేకరించింది.

ఇవీ కారణాలు..

దేశ జనాభాలో ఇప్పటికీ 40?42 శాతం మందికి మాత్రమే ఆరోగ్య బీమా కవరేజీ ఉండడం దీనికి కారణం. హెల్త్ ఇన్సూరెన్స్‌పై అవగాహన పెరుగుతున్నప్పటికీ.. ఇంకా కవరేజీ పరిధిలోకి రానివారి సంఖ్య ఎక్కువగా ఉందనేది ఈ నివేదిక చెబుతోంది.ఒక్కోసారి ఆరోగ్యబీమా పాలసీ ఉన్నప్పటికీ.. అందులో ఉండే కో-పే ఆప్షన్, సబ్-లిమిట్స్, కవరేజీ పరిధిలోకి రాని చికిత్సలు/టెస్టుల వల్ల ఇప్పటికీ కొంతమొత్తం నగదు రూపంలో చెల్లించాల్సి వస్తోంది. మొత్తం ఖర్చులో 40 శాతం జేబు నుంచే చెల్లించాల్సి వస్తోందని నివేదిక పేర్కొంటోంది. దేశంలో వైద్య ద్రవ్యోల్బణం వేగంగా పెరుగుతోంది. ఏడాదికి 12-15 శాతం మేర పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే భారత్‌లో వైద్య ఖర్చులు వేగంగా పెరుగుతున్నాయి.

పర్సనల్ లోనే ఎందుకంటే?

వ్యక్తిగత రుణాలు వేగంగా మంజూరవుతాయి. 24-48 గంటల్లోనే డబ్బు చేతికందుతుంది. డిజిటల్ రూపంలో అయితే క్షణాల్లోనే నగదు ఖాతాలో జమ అవుతోంది. పైగా దీనికి ఎలాంటి తనఖా అవసరం లేదు. 5 ఏళ్ల కాలవ్యవధి వరకు చెల్లింపుల వ్యవధిని ఎంచుకోవచ్చు. ప్రైవేటు రుణాలతో పోలిస్తే తక్కువ వడ్డీకే రుణాలు లభిస్తుండడంతో వీటివైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు పైసా బజార్ పేర్కొంది. వైద్య ఖర్చులు కాకుండా 48 శాతం మంది అవసరమైన ఖర్చులు, 36% శాతం మంది ఆకాంక్షలు/లైఫ్‌స్టైల్ కోసం, 16% మంది వ్యాపార పెట్టుబడుల కోసం, 11% వివాహాలు, ఉత్సవాల కోసం ఖర్చు చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది. ఆన్‌లైన్‌లో 32 శాతం మంది రుణాలు తీసుకుంటుండగా.. ఇప్పటికీ 68 శాతం మంది బ్యాంకు శాఖల్లోనే రుణాలు తీసుకోవడానికి ఇష్టపడుతున్నారని నివేదిక పేర్కొంది.

# ఇండిగో 'ఆర్థిక మోత'

### రూ.2,000 కోట్ల ప్రభావం పడొచ్చు
### విమాన సర్వీసుల రద్దు నేపథ్యం



దేశీయ అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో, గత నెలలో వేల సంఖ్యలో విమాన సర్వీసులను రద్దు చేయడం వల్ల చోటుచేసుకున్న పరిణామాలతో.. ఆ సంస్థపై సుమారు రూ.2,000 కోట్ల ప్రభావం పడొచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇందులో చాలా వరకు నేడు వెలువడే డిసెంబరు త్రైమాసిక ఫలితాల్లో కనిపిస్తుందని, మిగతాది జనవరి-మార్చి త్రైమాసికంలో ప్రతిబింబించొచ్చని ఆ వర్గాలు అంటున్నాయి. అత్యధిక వ్యయ భారం ఇండిగో ప్రకటించిన 'గెశ్చర్ ఆఫ్ కేర్' వల్లే పడనుంది. డిసెంబరు 3- 5 తేదీల మధ్య రద్దయిన విమాన సర్వీసులు, 3 గంటలకు మించి సర్వీస్ ఆలస్యమైన ప్రయాణికులకు ఒక్కొక్కరికి రూ.10,000 విలువైన ఓచర్లను ఇండిగో ఇవ్వనుంది. ఇందుకు సుమారు రూ.500-1000 కోట్ల శ్రేణిలో ఇండిగో ఖర్చు చేయాల్సి రావొచ్చని అంచనా.

కార్యకలాపాలు సాధారణ స్థితికి: డీజీసీఏ

నిరంతర పర్యవేక్షణ, దిద్దుబాటు చర్యల వల్ల ఇండిగో కార్యకలాపాలు తిరిగి సాధారణ స్థితికి వచ్చాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా ప్రస్తుతం తగినంత మంది పైలట్లు ఇండిగో వద్ద ఉన్నారని పేర్కొంది. 'ఇండిగో సిబ్బందికి రోస్టర్ పద్ధతి అమలు, పైలట్ల లభ్యత, ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ (ఎఫ్‌డీటీఎల్) నిబంధనల పాటింపును పర్యవేక్షిస్తున్నామ'ని డీజీసీఏ తెలిపింది. 2026 ఫిబ్రవరి 10 తర్వాత తమ కార్యకలాపాల్లో అంతరాయం ఉండబోదని, విమాన సర్వీసుల రద్దు లాంటివి చోటుచేసుకోవని ఈనెల 19న జరిగిన సమీక్షా సమావేశంలో ఇండిగో హామీ ఇచ్చినట్లు డీజీసీఏ తెలిపింది. 'ఫిబ్రవరి 10 తర్వాత తమ కార్యకలాపాలకు 2,280 మంది పైలట్లు అవసరం పడొచ్చని మేం అంచనా వేయగా.. 2,400 మంది ఉన్నారని, ఫస్ట్ ఆఫీసర్స్ సంఖ్య కూడా మా అంచనా అయిన 2,050 కంటే ఎక్కువగా 2,240 మంది ఉన్నార'ని ఇండిగో తెలిపినట్లు డీజీసీఏ వివరించింది.

రోజుకు 2,100- 2,200 సర్వీసులు

డిసెంబరు 9 నుంచి ఇండిగో కార్యకలాపాలు కుదుటపడుతున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విమాన సర్వీసుల సంఖ్యను స్థిరంగా పెంచుకుంటూ వచ్చింది. ప్రస్తుతం రోజుకు 2,100-2,200 విమాన సర్వీసులను నడుపుతోంది. ప్రతి మూడు రోజులకు 10 లక్షల మందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తోంది.

ఏవేవి.. ఎంతెంత..

భారీగా సర్వీసుల రద్దుతో విమానాశ్రయాల్లో నిరీక్షిస్తూ ఉండిపోయిన 3,00,000 మందికి పైగా ప్రయాణికులకు పౌర విమానయాన నిబంధనలకు అనుగుణంగా రూ.10,000 వరకు పరిహారాన్ని ఇండిగో చెల్లించాల్సి ఉంటుంది.

విమాన సర్వీసుల రద్దు అయిన ప్రయాణికులకు రూ.827 కోట్లను టికెట్ రిఫండ్ కింద ఇచ్చింది. ఇది ప్రయాణికులు చెల్లించిందే అయినా, సర్వీసుల రద్దు రూపేణ సంస్థకు ఆదాయం తగ్గినట్లే.

విమాన సర్వీసుల రద్దు ప్రభావిత ప్రయాణికుల కోసం 9,500 హోటల్ గదులను బుక్ చేయడంతో పాటు.. సుమారు 10,000 క్యాబ్‌లు, బస్సులను వారి కోసం ఏర్పాటు చేసింది. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ (ఎఫ్‌డీటీఎల్) నిబంధనలకు తగ్గట్లుగా అదనపు సిబ్బందిని నియమించుకోవాల్సి ఉండటంతో ఉద్యోగుల వ్యయాలూ పెరుగుతాయి.ఫిబ్రవరి 10 వరకు ఇండిగో విమాన సర్వీసుల్లో 10% కోత డీజీసీఏ విధించడం, డిసెంబరు తొలివారంలో వేల సంఖ్యలో సర్వీసుల రద్దు వల్ల ఇండిగోకు భారీగానే ఆదాయ నష్టం ఉంటుంది. ఈ కారణంగా 2025-26లో సంస్థ ఎబిటా మార్జిన్‌పై 290 బేసిస్ పాయింట్లు, ఆదాయంపై 6.2% ప్రభావం ఉంటుందని ఆనంద్ రాఠీ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ విశ్లేషకుడు శోభిత్ సింగాల్ అంచనా వేస్తున్నారు.

## భారీ దెబ్బకొట్టిన 'డిసెంబర్'

లాభంలో 78 శాతం క్షీణత

దిల్లీ: ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ గురువారం త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ.549.1 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2448.8 కోట్ల లాభంతో పోలిస్తే 78 శాతం క్షీణత నమోదైంది. కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు, గతేడాది డిసెంబర్‌లో తలెత్తిన విమాన సేవల్లో అంతరాయం వంటివి లాభాలపై ప్రభావం చూపాయి.కొత్త కార్మిక చట్టాల అమలుకు రూ.969 కోట్లు, కార్యకలాపాల అంతరాయాల కారణంగా రూ.577 కోట్లు ఖర్చయినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. మొత్తంగా ఈ త్రైమాసికంలో రూ.1546 కోట్లు ప్రభావం పడినట్లు పేర్కొంది. కరెన్సీ లావాదేవీలకు సంబంధించి డాలర్ ఆధారిత భవిష్యత్ చెల్లింపుల కోసం మరో రూ.1,035 కోట్లను డిసెంబర్ త్రైమాసికంలో మినహాయించినట్లు ఇండిగో పేర్కొంది. మొత్తం ఆదాయం రూ.24,540.6 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.22,992.8 కోట్లతో పోలిస్తే కాస్త పెరిగింది.గతేడాది డిసెంబర్‌లో వందలాది విమాన సర్వీసులను ఇండిగో రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో టికెట్ మొత్తాలను కంపెనీ రిఫండ్ చేసింది. ప్రయాణికులకు పరిహారం చెల్లించడంతో పాటు, గుడ్‌వెల్ గెశ్చర్ ఓచర్ల కింద ఒక్కో ప్రయాణికుడికి రూ.10వేలు చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చింది.

## మూడు రోజుల నష్టాలకు బ్రేక్..

### రాణించిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. ఈయూపై విధించిన టారిఫ్‌లపై ట్రంప్ వెనక్కి తగ్గడం, భారత్‌తో త్వరలో అద్భుతమైన ట్రేడ్ డీల్ ఉండబోతోందంటూ దావోస్ వేదికగా ఆయన చేసిన ప్రకటన మార్కెట్‌లో ఉత్సాహాన్ని నింపింది. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ వేస్తూ సూచీలు లాభాలతో ముగిశాయి.సెన్సెక్స్ ఉదయం 82,459.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,909.63) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,783.18 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 397.74 పాయింట్ల లాభంతో 82,307.37 వద్ద ముగిసింది. నిఫ్టీ 132.40 పాయింట్ల లాభంతో 25,289.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠాల నుంచి కాస్త కోలుకుని 91.62గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బీఈఎల్, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నల్, టైటాన్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.55 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4824 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**గుడ్ల ధరలు**

హైదరాబాద్ ₹ 5.00
వరంగల్ ₹ 5.02

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్
₹ 1,41,450 (22 క్యారెట్లు)
₹ 1,54,310 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 3,40,000

# ప్రపంచం నెత్తిన ట్రంప్ కుంపటి!



**న్యూఢిల్లీ:**ఏడాది పాలనలో ట్రంప్ అంటించిన మంటలెన్నో..డొనాల్డ్ జాన్ ట్రంప్.. నోరు తెరిస్తే అగ్గిరాజుకుంటుంది. ఆయన నిర్ణయం పెను వివాదాలు రేపుతుంది.. ఆయన పావులు కదిపితే ప్రపంచం ఉక్కిరిబిక్కిరి అవుతుంది. అంతా తానే.. సర్వస్వం అమెరికాయే అనే ధృఢమైన విశ్వాసి. ఓ వైపు శాంతి మంత్రం జపిస్తుంటారు.. మరోవైపు దేశాలపై యుద్ధాలకు కాలు దువ్వుతుంటారు. ఆయన మాటలు ప్రత్యర్థులనే కాదు.. మిత్రులనూ కలవరపాటుకు గురి చేస్తుంటాయి. రెండోసారి అమెరికా అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచే ఆయన ఈ ప్రపంచంపై సవాళ్లు విసరడం ప్రారంభించారు. వాణిజ్య యుద్ధాలు ప్రారంభించి.. అనేక దేశాలను ఉక్కిరిబిక్కిరి చేశారు. స్వదేశంలో వలసదారులపై యుద్ధాన్ని ప్రారంభించి.. వేలమంది గుండెల్లో గుబులు రేపారు. రెండోసారి అధికారాన్ని చేపట్టి ఏడాది పాలనను పూర్తిచేసుకున్న డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాలెన్నో అత్యంత వివాదాస్పదంగా మారాయి. ఆధునిక రాజకీయాల్లో అత్యంత వివాదాస్పద నేతగా ఉన్న ట్రంప్.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచాన్ని ఆ స్థాయిలో వణికిస్తున్నారు.

నాడు పనామా.. నేడు గ్రీన్‌లాండ్..

గత ఏడాది అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా 'మా దారికి ఏదీ అడ్డురాదు' అని ట్రంప్ ప్రకటించారు. ఆ సమయంలో ఆయన దృష్టిలో ఒక్క పనామా కాలువే ఉంది. దానిని స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పుడు అదే విధానాన్ని గ్రీన్‌లాండ్‌పై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. 'మనం దానిని పొందాలి' అనే కొత్త మంత్రాన్ని ఆయన జపిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో కెనడాను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించి వివాదానికి తెరలేపారు. అది తమ 51వ రాష్ట్రమంటూ పలుమార్లు ప్రకటించారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్నాయన్న పేరుతో మెక్సికో, కొలంబియాలపైనా కన్నేశారు. వాటిపైనా దాడులకు దిగుతామని హెచ్చరించారు.

నాటో భవితవ్యానికి పరీక్ష

అమెరికా కమాండర్ ఇన్-చీఫ్‌గా ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి సర్వశక్తులొడ్డుతున్నారు. ఇందుకోసం ఐరోపా దేశాలతో కయ్యానికి సిద్ధపడుతున్నారు. గ్రీన్‌లాండ్ విషయంలో తమను వ్యతిరేకించే దేశాలపై సుంకాలు వేస్తున్నట్లు ప్రకటించారు. ట్రంప్ చర్యలతో 76 ఏళ్ల నాటో భవితవ్యం ప్రమాదంలో పడుతోంది. గత శతాబ్ద కాలంలో ఏ అమెరికా అధ్యక్షుడూ.. మిత్ర దేశాన్ని కబళించాలని చూడలేదు. అంతేకాకుండా ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరించలేదు. ఇప్పుడు గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్ అదే చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏ అమెరికా నేతా.. రాజకీయ సిద్ధాంతాలను పక్కనబెట్టి ఇలా వ్యవహరించలేదు.



ఇరాన్, వెనెజువెలాపై దాడులు..

ఓ వైపు 'శాంతి కోసం కృషి చేస్తున్నా.. నాకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వండని' అంటూనే.. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్‌పై అతి పెద్ద బాంబర్లతో దాడులు చేశారు. అణు స్థావరాలను ధ్వంసం చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత రాజేశారు.గత ఏడాది జూన్‌లో ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసినప్పుడు.. సైనిక చర్యలతో తన దౌత్య మార్గానికి అడ్డంకులు సృష్టించవద్దని నెతన్యాహును ట్రంప్ హెచ్చరించారు. వారం తిరిగే సరికి ఇరాన్‌లోని అణు శాస్త్రవేత్తలను ఇజ్రాయెల్ అంతమొందించడంతో అద్భుతంగా పని చేశారని ప్రశంసించారు. గాజాలో శాంతి స్థాపనకు కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదర్చడమే ఆయన చేసిన గొప్ప పని. ఇందుకోసం ఆయన తన దౌత్య బలాన్ని వినియోగించారు. ఇజ్రాయెల్‌ను, హమాస్‌ను దారికి తెచ్చారు. వెనెజువెలా విషయంలో మాత్రం ట్రంప్ తన కండబలాన్ని ఉపయోగించారు. ఓ సార్వభౌమాధికార దేశంపైకి సైన్యాన్ని పంపి.. బాంబులేసి. ఏకంగా దేశాధ్యక్షుడు మదురోను చెరబట్టారు. శాంతి కోసం ప్రయత్నించి 8 యుద్ధాలను ఆపానని, అయినా నోబెల్ శాంతి బహుమతి తనకు రాలేదని, ఇక నుంచీ బల ప్రయోగంతోనే అమెరికాను గొప్పగా మారుస్తానని ఇటీవల ట్రంప్ ప్రకటించారు. రష్యా, ఉక్రెయిన్ విషయంలో ఒక వారం రష్యా తరపున మాట్లాడతారు. మరో వారం ఉక్రెయిన్‌కు ఆయుధాలిస్తారు.

వలసలపై ఉక్కుపాదం

అమెరికాలో నివసిస్తున్న వేల మంది అక్రమ వలసదారులను ట్రంప్ బలవంతంగా స్వదేశాలకు పంపారు. ఇందుకోసం ఏకంగా పలు నగరాల్లో ఫెడరల్ ఏజెంట్లను వినియోగించి.. ఊళ్లను ఖాళీ చేయించారు. సైనిక విమానాల్లో తరలించారు. వారికి న్యాయపరమైన సాయం అందకుండా చేశారు. అక్రమ వలసలను అడ్డుకునే పేరుతో, ప్రత్యర్థి పార్టీని ఇబ్బంది పెట్టడానికి కేంద్ర బలగాలను నగరాల్లో అడుగడుగునా మోహరిస్తున్నారు. వీధుల్లో కేంద్ర బలగాల కవాతులు నిత్యకృత్యంగా మారాయి. మినియాపొలిస్‌లో 1,500 మంది సైనికులను మోహరించడం ద్వారా ఉద్రిక్తతలకు ట్రంప్ కారణమయ్యారు. ఏకంగా తిరుగుబాటు నిరోధక చట్టాన్ని అమలు చేస్తానని బెదిరించారు.అమెరికాలోని మధ్యతరగతికి ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా మాజీ అధ్యక్షుడు ఒబామా తెచ్చిన చట్టాన్ని నిలిపేశారు. మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో రిపబ్లికన్ల నుంచి ఒత్తిడి వచ్చినా ఆయన ససేమిరా అన్నారు. చివరకు ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా దిగివచ్చారు. అయితే అందులోనూ మార్పులు చేశారు.

భారత్ విషయంలోనూ వివాదమే

మన్మోహన్ హయాంలో అణు ఒప్పందం కుదిరినప్పటి నుంచి భారత్, అమెరికా సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైంది. ఆ తర్వాత ప్రధాని మోదీ దానిని మరింత ముందుకు తీసుకెళ్లారు. ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయనతో మోదీ అత్యంత సన్నిహిత సంబంధాలను కలిగి ఉన్నారు. పలు రంగాల్లో రెండు దేశాలు సహకరించుకున్నాయి. అందుకే ఎన్నికల్లో ట్రంప్‌నకు మోదీ మద్దతు పలికారు. కానీ అధికారంలోకి వచ్చాక అమెరికా అధ్యక్షుడి ధోరణి పూర్తిగా మారిపోయింది. రష్యా నుంచి ఇంధనం కొంటున్నామనే సాకుతో భారత్‌పై ఆంక్షలను విధిస్తూ వస్తున్నారు. ప్రపంచంలో ఏ దేశంపైనా విధించనంత సుంకాలను విధించారు. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు బెడిసికొట్టాయి. వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అటు పాకిస్థాన్‌తో ట్రంప్ అంటకాగుతున్నారు. ఏకంగా సైన్యాధ్యక్షుడిని పిలిచి మరీ శ్వేతసౌధంలో విందు ఇచ్చారు. భారత్‌కు కోపం తెప్పించారు. అంతేకాకుండా భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపానని పదే పదే చెబుతున్నారు. భారత్ ఎన్నిసార్లు ఖండించినా ఆయన వెనక్కి తగ్గడం లేదు. తన మాటే నెగ్గిందని అవకాశం దొరికినప్పుడల్లా ప్రచారం చేసుకుంటున్నారు.

వీసాలపై వెట్టింగ్..

ఏడాదిలో దాదాపు లక్ష వీసాలను రద్దు చేశారు.భారతీయ వృత్తి నిపుణుల కారణంగా



## నీతా అంబానీ పెద్ద మనసు..

**ముంబయి:** రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ గొప్ప మనసు చాటుకున్నారు. నేషనల్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్‌కు రూ.5 కోట్ల విరాళం ప్రకటించారు. ఎన్ఏబీ 75వ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న సందర్భంగా ఈ ప్రకటన చేశారు. దృష్టి లోపంతో బాధపడేవారి కోసం తన వంతుగా రిలయన్స్ ఫౌండేషన్ తరఫున రూ.5 కోట్లు విరాళం అందిస్తున్నట్లు తెలిపారు. రాబోయే 5 ఏళ్లలో ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. 75 ఏళ్లుగా దృష్టి లోపం ఉన్న వారికి విద్య, ఆరోగ్య, ఉపాధి అవకాశాలను ఎన్ఏబీ ఇండియా కల్పిస్తోంది. రిలయన్స్ ఫౌండేషన్ దృష్టి ప్రాజెక్ట్‌లో భాగంగా ఎన్ఏబీతో 22 సంవత్సరాలుగా భాగస్వామ్యం కొనసాగిస్తోంది. ఇప్పటివరకు 22 వేల మందికి కంటి చూపును పునరుద్ధరించి వారి జీవితాల్లో మార్పునకు శ్రీకారం చుట్టారు. ఫౌండేషన్ డే సందర్భంగా చిన్నారులతో నీతా అంబానీ ముచ్చటించారు. టీచర్లు, కేర్ టేకర్ల చొరవను ప్రశంసించారు.

## హైదరాబాద్‌లో ఏఐ ఇంజినీర్లకు గిరాకీ

హైదరాబాద్: ఉద్యోగ మార్కెట్లో వేగంగా వృద్ధి చెందుతున్న వాటిలో 'ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఇంజినీర్' మొదటి స్థానంలో నిలిచింది. హైదరాబాద్ ఉద్యోగ మార్కెట్‌పై ప్రముఖ సామాజిక వేదిక లింక్డ్ఇన్ విడుదల చేసిన 'జాబ్స్ ఆన్ ది రైజ్ 2026' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. 2026లో దాదాపు 72 శాతం మంది వృత్తి నిపుణులు కొత్త ఉద్యోగాల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.సాంకేతికత వేగంగా మారుతుండటంతో, తమ నైపుణ్యాలు సరిపోతాయా లేదా అనే ఆందోళన 38 శాతం మందిలో ఉంది. తీవ్రమైన పోటీలో ఎలా నెగ్గుకురావాలనే భయం మరో 37 శాతం మందిలో వ్యక్తమవుతోంది.హైదరాబాద్ ఇప్పుడు కేవలం ఐటీ హబ్ మాత్రమే కాదని, పలు రంగాలు ఇక్కడకు వస్తున్నాయని లింక్డ్ఇన్ కెరీర్ ఎక్స్‌పర్ట్ నిరాజిత బెనర్జీ అన్నారు. ఏఐ పరిజ్ఞానాన్ని జోడించి, ప్రాజెక్టుల్లో ఫలితాలను చూపించే వారికే ఎక్కువ అవకాశాలుంటున్నాయని తెలిపారు.

## ప్రపంచంలో రెండో అత్యంత ట్రాఫిక్ రద్దీ నగరంగా బెంగళూరు

**బెంగుళూరు:**గత ఏడాదికి సంబంధించి ప్రపంచంలోనే అత్యంత ట్రాఫిక్ రద్దీ నగరంగా మెక్సికోలోని మెక్సికో సిటీ నిలిచింది. రెండో స్థానంలో కర్ణాటక రాజధాని బెంగళూరు ఉంది. ఈ నగరంలో 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటున 36 నిమిషాలకుపైగా సమయం పట్టినట్లు 'టామ్‌టామ్ ట్రాఫిక్ సూచీ-2025 లో వెల్లడైంది. డబ్లిన్ (ఐర్లాండ్), లోడ్జ్ (పోలండ్), పుణె (భారత్)లు టాప్-5లో ఉన్నాయి.బెంగళూరులో సగటు రద్దీ స్థాయి 74.4 శాతంగా నమోదైంది. 2024తో పోలిస్తే 1.7 శాతం పెరిగింది. వాహనదారులు 15 నిమిషాల్లో సగటున 4.2



కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటున 36 నిమిషాల తొమ్మిది సెకన్ల సమయం పట్టింది. అత్యంత రద్దీ వేళల్లో సగటు వేగం గంటకు 13.9 కిలోమీటర్లకు పడిపోయిందని నివేదిక పేర్కొంది.ముఖ్యంగా 2025 మే 17న బెంగళూరులో ట్రాఫిక్ పరిస్థితి దారుణంగా ఉందని, ఆ రోజు సగటు రద్దీ స్థాయి 101 శాతంగా నమోదైనట్లు నివేదిక తెలిపింది. సాయంత్రం 6 గంటల సమయంలో వాహనదారులు 15 నిమిషాల్లో 2.5 కిలోమీటర్లే ప్రయాణించినట్లు వెల్లడించింది.ఈ జాబితాలో ముంబయి (18), దిల్లీ (23), కోల్‌కతా (29), జైపుర్ (30), చెన్నై (32), హైదరాబాద్ (47) స్థానాల్లో నిలిచాయి. హైదరాబాద్‌లో గంటకు సగటు వేగం 18.4 కిలోమీటర్లుగా ఉందని నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 500 నగరాల్లో, 3.65 ట్రిలియన్ కిలోమీటర్లకుపైగా ప్రయాణ డేటా ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు సంస్థ తెలిపింది.

## తెలంగాణ మీదుగా మరో 'అమృత్ భారత్'

### త్వరలో ప్రధాని చేతులమీదుగా ప్రారంభం కానున్న ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్: తెలంగాణకు మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను కేటాయిస్తూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ రైలు తెలుగు రాష్ట్రాల మీదుగా వెళ్లడం ప్రయాణికులకు ఉపయుక్తం కానుంది. చర్లపల్లి జంక్షన్ నుంచి తిరువనంతపురం మధ్య సూపర్ ఫాస్ట్ రైలును కేటాయించింది. శుక్రవారం తిరువనంతపురం నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభించనున్నారు. తెలంగాణలో నల్గొండ, మిర్యాలగూడ.. ఆంధ్రప్రదేశ్‌లోని సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఆగనుంది. తిరువనంతపురంలో ఉదయం 10.45 గంటలకు ప్రారంభమై.. చర్లపల్లికి మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు చేరుకుంటుంది. తెలంగాణకు మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ కేటాయించడం పట్ల.. ప్రధాని మోదీకి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

తొలి రైలు ఇలా..

ఇప్పటికే చర్లపల్లి - ముజఫర్‌పూర్ (బిహార్) మధ్య ఒక అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడుస్తోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక వసతులున్న అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను కేంద్రం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. చర్లపల్లి - ముజఫర్‌పూర్ మధ్య అమృత్ భారత్ రైలు తెలంగాణలోని చర్లపల్లి నుంచి ఉదయం 4.05 గంటలకు ప్రారంభమై.. కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, సిర్పూర్ కాగజ్‌నగర్ మీదుగా మహారాష్ట్రలోకి అడుగుపెడుతుంది.

# వాహనాలను భద్రంగా.. బాధ్యతతో నడపాలి

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** ప్రతి వాహనదారుడు తమ వాహనాన్ని భద్రంగా.. బాధ్యతతో నడపాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల (సడక్ సురక్ష అభియాన్) కార్యక్రమాన్ని వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లో గురువారం జిల్లా రవాణశాఖా ఆద్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితే హాజరై ప్రారంభించారు. ట్రాఫిక్ సిగ్నల్ రంగులలాగా సిద్దం చేసిన బెలూన్లను,శాంతి కపోతాలను ఎగురవేసారు. రోడ్డు భద్రతకు సంబంధించిన స్టికర్లను వాహనాలకు అతికించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోతే ఆ కుటుంబం చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ప్రతి వాహనదారుడు ఓవర్ స్పీడ్ డ్రైవింగ్ చేయవద్దని,ట్రాక్టర్ డ్రైవర్లు జాగ్రతగా నడపాలన్నారు. మహాశివరాత్రి సందర్భంగా వేములవాడకు వచ్చే రహదారులకు మరమ్మ త్తు చేయిస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని, హెల్మెట్ ధరించని వారికి పెట్రోల్ బంక్ యజ మానులు సామాజిక బాధ్యతగా పెట్రోల్ పోయవద్దని కోరారు. శివరాత్రి సందర్భంగా ఆటో డ్రైవర్లు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చే యాత్రికు లు, భక్తులను క్షేమంగా గమ్యం చేర్చాలని సూచించారు.అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ వాహనాలు అతివేగంగా నడపవద్దని, మొబైల్ చూస్తూ వాహనాలు నడపవద్దని, స్కూల్ ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తీసుకు వెళ్ళవద్దని సూచించారు. ఎక్కువగా రోడ్డు ప్రమా దాల్లో ద్విచక్ర వాహనదారులు, ఆటో వారికి ఇబ్బంది అవుతుందన్నారు.నో హెల్మెట్.. నో పెట్రోల్ జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తు న్నామని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివారణకు కృషి చేస్తున్నా మని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడినని మొదటి గంటలో దవాఖనకు తరలించినకి రహ వీర్ పథకం కింద రూ 25 వేల ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ఎస్పీ మహేష్ బీగితే మాట్లా దుతూ డ్రైవ్ తోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతు న్నాయని,పరిమితికి మిం చి ప్రయాణీకులను వాహనాల్లో తీసుకు వెళ్ళవద్దన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల,రోడ్డు ప్రమా దాల సమాచారం ఆటో డ్రైవర్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఏఎస్పీ రుత్విక్ సాయి, ఆర్డీఓ రాధా భాయి, జిల్లా రవాణా శాఖ అధి కారి లక్ష్మణ్, ఆర్టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ రాకేశ్, వేము లవాడ డిపో మేనే జర్లు ప్రకాష్ రావు,శ్రీనివాసు పాల్గోన్నారు.

# అభివృద్ధి మా విధానం ... హిందుత్వం మా నినాదం

- కేంద్ర నిధులతోనే కరీంనగర్ కార్పొరేషన్ సహా మున్సిపాలిటీల్లో అభివృద్ధి
- బీజేపీని ఆశీర్వదించి అత్యధిక స్థానాల్లో గెలిపించండి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- బీఆర్ఎస్ కు షాకిచ్చిన జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ విజయ గణపతి బీఆర్ఎస్ నేతలతో కలిసి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన దంపతులు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 22 (జనంసాక్షి) :** రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జరిగిన అభివృద్ధే ఎజెండాగా ప్రజల్లోకి వెళతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో జిల్లా పరిషత్ తాజా మాజీ ఛైర్ పర్సన్, బిఆర్ఎస్ నేత కనుమల్ల విజయ గణపతి గురువారం రోజు కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. విజయగణపతి దంపతులిద్దరికీ కాషాయ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వారితోపాటు జమ్మికుంటకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీ కండువా కప్పుకు న్నారు. అనంతరం బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ సహాతన పార్లమెంట్ నియోజకవర్గంలోని మున్సిపాలి టీల్లో అంతో ఇంతో అభివృద్ధి జరిగిందంటే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతోనే సాధ్యమైందని తెలిపారు. స్మార్ట్ సిటీ, అమ్రుత్ 1, 2, స్వచ్ఛ భారత్ వంటి పథకాలతోపాటు 14,15, 16వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులతోనే కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే రాబోయే ఎన్నికల్లో అభివృద్ధే మా విధానం, హిందుత్వమే మా నినాదం పేరుతో ప్రజల వద్దకు వెళతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లలో మున్సిపాలిటీలకు నయాపైసా ఇయ్యలేదని గుర్తు చేశారు. ఎన్నికలు వస్తున్నయని తెలియడంతో ఓట్ల కోసం అభివృద్ధి పనులకు శంకుస్థాపనల పేరుతో కాంగ్రెస్ నేతలు హడావుడి చేసేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో లేని బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి ఏం లాభమని, గెలిచిన తరువాత పార్టీ ఫిరాయింపులకు పాల్పడతారని పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలు గమనించాలని కోరారు. బీజేపీని ఆశీర్వదించి కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు మున్సిపాలిటీల్లో అత్యధిక స్థానాల్లో గెలిపిస్తే కేంద్రం నుండి అత్యధిక నిధులు తీసుకురావడంతోపాటు సీఎస్సార్ నిధులను సైతం తీసుకొచ్చి అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, కరీంనగర్ మాజీ మేయర్ డి.శంకర్, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, బీజేపీ జమ్మికుంట నేతలు ఆకుల రాజేందర్, పుప్పాల రఘు పాల్గొన్నారు.



# తెలంగాణలో ఏబీ ఇన్‌బెవ్ యూనిట్ విస్తరణకు సిద్ధం



**మంథని, (జనంసాక్షి) :** ప్రపంచంలో అతిపెద్ద బీరు తయారీ సంస్థగా పేరుగాంచిన ఏబీ ఇన్‌బెవ్ తెలంగాణలో ఇప్పటికే ఉన్న తన తయారీ యూనిట్‌ను విస్తరించేందుకు భారీగా పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. ఈ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 50కుపైగా దేశాల్లో సంస్థ కార్యకలా పాలు నిర్వహిస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక 2026 సదస్సులో భాగంగా దావోస్‌లో.. ముఖ్యమంత్రి ఎ.రేవం త్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృం దం ఏబీ ఇన్‌బెవ్ చీఫ్ లీగల్ అండ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ జాన్ బ్లడ్తో సమావేశమయ్యారు. తెలంగాణలో ప్రస్తుతం రెండు తయారీ యూనిట్లు నిర్వహిస్తున్న ఏబీ ఇన్‌బెవ్, సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తోంది. రాష్ట్రానికి కొత్త పెట్టుబడి లభించినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్రా న్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ఆదాయవృద్ధి, సామర్థ్య నిర్మాణమే కీలకమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. విధాన స్థిరత్వం, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, వ్యాపార సౌలభ్యంతో తెలంగాణ లో పెట్టుబడిదారుల్లో దీర్ఘకాలికంగా విశ్వాసం పెరుగుతో ందని తెలిపారు. ఈ సమావేశంలో సర్క్యులర్ వాటర్ విని యోగం, మహిళా సాధికారత, విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించిన సీఎస్ఆర్ వ్యయాలు వంటి అంశాల్లో తెలంగాణతో కలిసి పనిచేసే అవకాశాలపై కూడా చర్చించారు.

# అర్హత లేని వ్యక్తి.. అల్లోపతిక్ మాత్రలతో వైద్యం

## సీజ్ చేసిన జిల్లా ఆరోగ్య వైద్యశాఖ అధికారిణి రాజశ్రీ



**బోధన్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :** బోధన్ పట్టణం నడిబొడ్డున ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి పక్కనే ఎలాంటి అర్హత లేని వ్యక్తి అల్లోపతిక్ మాత్రలతో నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్న సాలూర మండలం కుమ్మన్ పల్లి గ్రామానికి చెందిన డి నరసింహ రెడ్డి నిర్వహిస్తున్న డివిన్ రెడ్డి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ను జిల్లా ఆరోగ్య వైద్యశాఖ అధికారిని రాజశ్రీ తనిఖీలు నిర్వహించి బోధన్ పట్టణ సీఐ వెంకట్ నారాయణ సమక్షంలో సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య వైద్యశాఖ అధికారిని రాజశ్రీ మాట్లాడుతూ, వైద్య రంగంలో ఎలాంటి అర్హత లేకపోయినప్పటికీ అల్లోపతి మాత్రలు అందిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వ్యక్తులను ప్రజలు నమ్మవద్దని స్పష్టం చేశారు. ప్రజలు అర్హత కలిగిన డాక్టర్ల వద్దని తమ ఆరోగ్య సమస్యలను చూయించుకోవాలని తద్వారా రోగాలు నయమవుతాయని ఆమె అన్నారు. ఇక ముందు సైతం ఎలాంటి అనుమ తులు లేని ఫస్ట్ ఎయిడ్ సెంటర్లో చికిత్స కోసం వెళ్లి తమ ప్రాణుల మీదికి తెచ్చు కోవద్దన్నారు. జిల్లాలో ఇలాంటి చర్యలకు ఎవరైనా పూనుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆరోగ్య వైద్యశాఖ అధికారిని రాజశ్రీ హెచ్చరించారు. ఆమె వెంట బోధన్ ఉపవైద్య శాఖ అధికారిని డాక్టర్ సమత, డాక్టర్ శిఖర, డాక్టర్ ప్రవీణ్, రవి, గ్రేస్ నిర్మల ఉన్నారు.

### అవినీతి అనకొండ సునీల్ రావును
# చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయం

## వెలిచాల సమక్షంలో 150 మందితో కాంగ్రెస్ పార్టీలో చేరిన డాక్టర్ రాజన్న గౌడ్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 22 (జనంసాక్షి) :** ప్రపంచంలోనే ఎక్కడా లేని భయంకరమైన అవినీతి అనకొండ సునీల్ రావును ఆ డివిజన్ ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆరోపించారు. మేయర్ గా ఉన్న సమయంలో వందలాది కోట్ల రూపాయల అవినీతికి పాల్పడి ప్రజలను పీడించి దౌర్జన్యాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఇల్లు కట్టాలన్న, అపార్ట్మెంట్ నిర్మించాలన్న, షాపు పెట్టుకోవాలన్నా సునీల్ రావు డబ్బులు దండుకునేవారని ప్రజలే బహిరంగంగా చెప్పుకుంటున్నారని ఆరోపించారు. గురువారం కొత్తపెల్లి లోని వెలిచాల ప్రజా కార్యాలయంలో 42వ డివిజన్ కు చెందిన పశుసంవర్ధక శాఖ రిటైర్డ్ జిల్లా అధికారి డాక్టర్ పంజాల రాజన్న గౌడ్ 150 మంది డివిజన్ ప్రజలు, మహిళలు యువకులతో కలిసి వెలిచాల రాజేందర్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. డాక్టర్ రాజన్న గౌడ్ కు రాజేంద్రావు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్రావు మాట్లాడుతూ... 42వ డివిజన్ కు చెందిన రాజన్న గౌడ్ నీతికి నిజాయితీకి మారుపేరని విద్యార్థి నేతగా ఉన్న సమయంలో అలుపెరగని ప్రజా పోరాటం చేశారని పేర్కొన్నారు. ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో రాజన్న గౌడ్‌కు అత్యంత గౌరవం ఇస్తామని పేర్కొన్నారు. భయంకరమైన అవినీతి అనకొండ మాజీ మేయర్ పై నీతి గా నిజాయితీగా వ్యవహరించే రాజన్న గౌడ్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన డాక్టర్ రాజన్న గౌడ్ మాట్లాడుతూ.. వెలిచాల రాజేందర్రావు మార్గదర్శకంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని రాజన్న గౌడ్ తెలిపారు. 42 వ డివిజన్ ప్రజల ఆశీర్వాదం అండదండలతో కార్పొరేటర్ గా మంచి మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. పంజాల రాజన్న గౌడ్ తో పాటు మహిళలు, యువకులు, డివిజన్ ప్రజలు దాదాపు 150 మందికి రాజేందర్ రావు పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆకుల నరసన్న, ఆర్ష మల్లేశం, మల్లికార్జున రాజేందర్, గుడూరి మురళి, కోటగిరి భూమా గౌడ్, వేల్పుల వెంకటేష్, పడాల అజయ్ గౌడ్, కొత్తూరు జగన్ గౌడ్, నేరేళ్ల నాగన్న గౌడ్, పలువురు కాంగ్రెస్ నాయకులు, డివిజన్ ప్రజలు, యువకులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి
- సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి
- కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 22 (జనంసాక్షి) :** ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాల్లో నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బి, పోలీస్, రవాణా, ఆర్టీసీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో జిల్లా రోడ్డు భద్రత కమిటీ, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ... గత రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు ఏమిటని రవాణా, పోలీస్, రోడ్లు భవనాలు, మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ లను గుర్తించి రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద ప్రదేశాలలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద అవకాశం ఉన్న స్థలాల్లో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న చోట్ల వాటికి గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే అథారిటీ, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్, పోలీస్, రోడ్లు భవనాలు, రవాణా అధికారులు రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్‌లో చర్చించిన అంశాలపై, ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ... కరీంనగర్ – జగిత్యాల రోడ్డుకు ఇరువైపులా ఆరు అడుగుల మేర చదును చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని పలుచోట్ల స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక సైన్ బోర్డులు, లైటింగ్ తదితర ఏర్పాట్లు అవసరం ఉన్నాయని, తాము సూచించిన ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను, అక్కడ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను గురించి వివరించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. గత సమావేశంలో చర్చించిన విధంగా నగరంలో అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, సోలార్ లింకింగ్ సిస్టం వంటివి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ కీర్తి భరద్వాజ్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి 563లో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలను గురించి వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం, ఆర్టీసీ డిఎం సునంద, ఏసీపీ వెంకటస్వామి,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాల సమస్యలపై కలెక్టర్‌కు బీజేపీ వినతి



**బోయిన్ పల్లి జనవరి 22 (జనంసాక్షి):** బోయినపల్లి మండలంలోని ముంపు ప్రభావిత గ్రామాలైన నీలోజిపల్లి, కొదురుపాక, మానువాడ, వరదవెల్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ బోయినపల్లి మండల శాఖ నాయకులు జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.మండల శాఖ అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముంపు గ్రామాల ప్రజల సమస్యల పై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు కొండం శ్రీనివాస్ రెడ్డి, అన్నమల్ల మోహన్ బాబు, సారంపల్లి రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర దొంగను అరెస్టు చేసిన పోలీసులు

- కిలో వెండి, ఆరు తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన బోధన్ ఏసిపి శ్రీనివాస్




**బోధన్, జనవరి 22 (జనంసాక్షి) :** గత నెలలో జరిగిన బంగారు దుకాణాల చోరీ కేసు చేదనలో భాగంగా కేసుతో సంబంధం ఉన్న మరొక అంతరాష్ట్ర దొంగను పట్టుకోవడం జరిగిందని ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు బోధన్ ఏసిపి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ నెల 21న అర్ధరాత్రి నిజామాబాద్ రైల్వే స్టేషన్లో మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ఉమ్రి గ్రామానికి చెందిన మహమ్మద్ మౌలా సాబ్ షేక్ ను అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎసిపి స్పష్టం చేశారు. నిందితుడి నుంచి 5 తులాల బంగారు నగలు, 1 కిలో వెండిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసును ఛేదించిన బోధన్ పట్టణ సీఐ వెంకట్ నారాయణ, ఎస్సై బి. మనోజ్ కుమార్, ఏఎస్ఐ బాబురావు, సిబ్బంది కె.రవి, మహేష్, ఎ.సాయి కుమార్లను, కేసు దర్యాప్తులో సహకారం అందించిన కొండల్వాడి, ఉమ్రి పోలీస్ శాఖల అధికారులను నిజామాబాద్ నగర పోలీస్ కమిషనర్ అభినందించారు.

# ఫిబ్రవరి చివరి నాటికి ప్యాక్స్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- మార్చి వరకు పి.హెచ్.సి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి
- మంథనిలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలో సహకార సంస్థల ఆధ్వర్యంలో చేపడుతున్న పీఎం-కుసుమ్ సోలార్ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని, ఫిబ్రవరి నెలాఖరు లోగా గ్రిడ్ కు అనుసంధానం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం మంథని మండలంలో విస్తృతంగా పర్యటించారు. మంథని మండలం కన్నాల గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నాగారం గ్రామంలో ఎంపిపిఎస్, పీ.హెచ్.సి సబ్ సెంటర్ , గుంజపడుగు గ్రామంలో నిర్మాణంలో ఉన్న పీ.హెచ్.సి భవనం, జడ్పీహెచ్ఎస్, 1 మెగా వాట్ సోలార్ ప్లాంట్ నిర్మాణం, మంథని లోని ఆర్డిఓ కార్యాలయ నిర్మాణ పనులు, జడ్పీహెచ్ఎస్ బాలికలు, బుట్టుపల్లి లోని ఆర్ అండ్ ఆర్ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. కన్నాల పాఠశాలలో ప్రహరి గోడ, గేట్ ఏర్పాటు, మైనర్ మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నాగారం గ్రామం లోని పాఠశాలలో మంజూరు చేసిన పనులు, సబ్ సెంటర్ నిర్మాణ పనులు నెల రోజుల్లో లోగా పూర్తి చేయాలని అన్నారు. గుంజపడుగు జడ్పీహెచ్ఎస్‌లో మంజూరు చేసిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. గుంజ పడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ నిర్మాణ పనులు, అవసరమైన పరికరాల బిగింపు పూర్తి చేసి మార్చి నాటికీ హ్యాండ్ ఓవర్ చేయాలని అన్నారు. గుంజపడుగులో ఫ్యాక్స్ ద్వారా ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్ పనులు పూర్తి చేసి ఫిబ్రవరి చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుతో పాటు, సమాం తరంగా విద్యుత్ రవాణా కోసం ట్రాన్స్ మిషన్ లైన్ నిర్మాణ పనులు కూడా రెండు రోజుల్లో మొదలు పెట్టాల ని, దీనికి డిస్కం అధికారులు సహకరించాలని పేర్కొన్నారు. రెడ్కో, విద్యుత్ శాఖలను మంచి సమన్వ యం చేస్తున్నారని డిసీఓ ను అభినందించారు. తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా సహకార రంగంలో నిర్మిస్తు న్న తొలి ప్రాజెక్టులు పెద్దపల్లి జిల్లాలో చేపట్టడం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నామని, అందుకు సంబంధిత అధికారులు సంకల్ప సిద్ధితో కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా గోదాముల ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. బిట్టు పల్లి ఆర్‌ఆర్ కాలనీ లో పెండింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలని అన్నారు. ఆర్ ఆర్ కాలనీ లో అంతర్గత రోడ్లు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డీసీఓ శ్రీమాల, రెడ్కో జిల్లా మేనేజర్ దురిశెట్టి మనోహర్, కేడీసీసీ బ్యాంకు సీఈఓ సత్యనారాయణ రావు, ఎంపిడిఓ శ్రీజ, తహశీల్దార్ అరీఫోద్దీన్, ఏడీఈ వెంకట నారాయణ, రెడ్కో డిఓ మునీందర్, ఏడీఓ లక్ష్మీకాంత్, గ్రీన్ సెక్యూర్ రమాకాంత్ , ఏఈ పి.ఆర్. అనుదీప్, విక్రమ్,సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# పురపోరులో బీఆర్ఎస్ పట్టు నిలిచేనా..?

**రెండేళ్లుగా పట్టణ,అర్బన్ మండల అధ్యక్షుని పోస్ట్ ఖాళీ**

**సర్పంచ్ ఎన్నికల్లో చతికిల**

**త్వరలో ఎంపీటీసీ,జడ్పిటిసి ఎన్నికలు**

**నియోజకవర్గ ఇన్చార్జి, ముఖ్య నాయకులపైనే భారం**







**రాజన్న సిరిసిల్ల వేములవాడ (జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు కావడం, నోటిఫికేషన్ వెలువడక ముందే వేములవాడ లో రాజకీయ వాతావరణం వేడెక్కింది.ఇప్పటికే ఎన్నికల బరిలో వుండే ఆశావాహులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేసి ఓటర్లను ప్రసన్నం చేసేందుకు అని ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ ,బిజెపి పురపూర్ లో పట్టు నిలుపుకోవడానికి ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే బిఆర్ఎస్ పార్టీకి పట్టణ అధ్యక్షులు లేకపోవడంతో ఎన్నికల్లో వెనుకబాటుగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలో ఎంపీటీసీ,జెడ్పిటిసి ఎన్నికలు జరగనున్న క్రమంలో అర్బన్ మండల అధ్యక్షుడు లేకపోవడం పార్టీ అధ్యక్షులు నియామకలపై పార్టీ పెద్దలు దృష్టి సారించకపోవడం గులాబి శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.వేములవాడ గ్రామపంచాయతీ నుంచి నగర పంచాయతీగా, మునిసిపల్ గా అప్గ్రేడ్ అయింది.నగర పంచాయతీగా వున్నా సమయంలో బిజెపీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి చైర్పర్సన్ పదవి కైవసం చేసుకుంది. తదుపరి రాజకీయ పరిణామాలు మారిన క్రమంలో చైర్పర్సన్ బిజెపి నుంచి టిఆర్ఎస్ లోకి మారారు.నగర పంచాయతీ నుంచి మున్సిపల్ గా అప్గ్రేట్ అయిన తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్ కు పట్టం కట్టారు. మున్సిపల్ గా అప్గ్రేడ్ అయ్యే క్రమంలో గ్రామపంచాయతీలుగా ఉన్నటువంటి అయ్యోరుపల్లి, కోనాయపల్లి, శాత్రాజుపల్లి, తిప్పాపూర్, నాంపల్లి గ్రామాలను మునిసిపల్లో విలీనం చేశారు. ప్రస్తుతం 28 వార్డులు మున్సిపల్ పరిధిలో ఉన్నాయి.

**నోటిఫికేషన్‌కు ముందే ఊపందుకున్న ప్రచారం**

మున్సిపల్ ఎన్నికలకు వార్డుల రిజర్వేషన్లు ఖరారు కావడంతో నోటిఫికేషన్ వెలువడక ముందే ఆశావాహులు తమ వార్డులో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రధాన పార్టీలు గెలుపే లక్ష్యంగా సర్వేలు అభ్యర్థుల విజయాల శాతాన్ని అంచనా వేస్తున్నాయి. కాగా ప్రతి వార్డులో ఆశావాహులు రెండు నుండి నలుగురు అభ్యర్థులు బరిలో ఉండగా బీ ఫామ్ ఎవరికి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరి కొంతమంది బీఫామ్ దక్కకపోతే పార్టీలు మారి ఇతర పార్టీ నుంచి పోటీ చేయడం లేదా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉండేందుకు ప్రణిలికలు రూపొందించుకుంటున్నారు.

**బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడి పోస్ట్ ఖాళీగా..**

ఓవైపు మున్సిపల్ ఎన్నికల వాతావరణం నెలకొనగా పార్టీ కార్యక్రమాలు ప్రభుత్వ వ్యతిరేక విధానాలు గత ప్రభుత్వంలోని పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలకంగా ఉండే పట్టణ అధ్యక్షుడు పోస్టు ఖాళీగా ఉంది. దీంతో నియోజకవర్గ ఇన్చార్జి, పట్టణ ముఖ్య నాయకుల పైనే పార్టీ ఆధార పడాల్సి వస్తుంది. కొన్నేళ్లుగా పట్టణ అధ్యక్షుడి పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ దానిని భర్తీ చేసేందుకు పార్టీ పెద్దలు ప్రత్యేక దృష్టి సారించడం లేదంటూ పార్టీ వర్గాల్లో అభిప్రాయం వ్యక్తం అవుతుంది. పురపోర్‌లో పార్టీ పట్టు నిలుపుకునేనా అన్న చర్చ కొనసాగుతుంది. ఏది ఏమైనప్పటికీ ప్రధాన పార్టీల మధ్యలో త్రిముఖపోరు రసవత్తరంగా మారనుంది.

# హైదరాబాద్ భవిష్యత్తుకు వికేంద్రీకృత జల నిర్వహణే కీలకం

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్
- వరదలు, మురుగు నీటి సమస్యల పరిష్కారానికి డీసెంట్రలైజ్డ్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి
- ఐజీబీసీతో కలిసి వ్యూహాత్మక చర్చలు ప్రారంభం




**హైదరాబాద్, జనవరి 22 (జనంసాక్షి):** హైదరాబాద్ నగరానికి దీర్ఘకాలిక జల భద్రత, వరదల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా వికేంద్రీకృత జల నిర్వహణ కీలకమని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ( ఐజీబీసీ)తో కలిసి సీఐఐ?సోహ్రాబ్జీ గ్రీన్ బిజినెస్ సెంటర్‌లో గురువారం నీటి విడుదల మురుగు నీరు, వర్షపు నీటి నిర్వహణపై స్టేక్‌హోల్డర్ ఇంటరాక్షన్, బ్రెయిన్‌స్టార్మింగ్ సెషన్ నిర్వహించింది. ఈ సమావేశంలో డీసెంట్రలైజ్డ్ వాటర్ మేనేజ్‌మెంట్, మురుగు నీరు, వర్షపు నీటిని పునర్వినియోగం చేసే పద్ధతులపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ కార్యక్రమ ంలో క్రెడాయి, నారెడ్కో, ఐపీఏ, ఐఐఏ, యూఎఫ్ ఈఆర్‌వీఏఎస్, ఎన్జీవోలు, సాంకేతిక సంస్థలు, డొమైన్ నిపుణులు పాల్గొని జీహెచ్ఎంసీ కమిషనర్, హెచ్ఎండబ్ల్యుఎస్బీ ఎండీ, ఇతర ఉన్నతాధికారులతో అభిప్రాయాలు పంచుకున్నారు. రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టులు ఇక కేవలం మున్సిపల్ సేవల వినియోగదారులు మాత్రమే కాదని, అవి నీటి ఉత్పత్తి కేంద్రాలు, నిల్వ కేంద్రాలు, పునర్వినియోగ కేంద్రాలుగా కూడా పనిచేస్తాయని తెలిపారు. సక్రమ నిర్వహణ జరిగితే ఇవి భారీ వర్షాల సమయంలో బఫర్లుగా పనిచేసి వరద ముప్పును తగ్గిస్తాయని, నిర్వహణ లోపిస్తే ప్రజామౌలిక వసతులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పాలసీ ఫ్రేమ్‌వర్క్, ఎస్టీపీల నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు, డీసెంట్రలైజ్డ్ వాటర్ మేనేజ్‌మెంట్‌ను ప్రోత్సహించేందుకు ప్రోత్సాహకాలు (ఇన్సెంటివ్‌లు) వంటి అంశాలపై అనేక ప్రాక్టికల్ సూచనలు అందాయి.

# మరణంలోనూ వైద్యుడి సేవ

**ఆర్ఎంపీ వెంకటేష్ నేత్రదానంతో ఇద్దరికి కొత్త జీవితం**



**గోదావరిఖని, (జనంసాక్షి):** స్థానిక మేదరి బస్తీకి చెందిన ఆర్ఎంపీ జంజర్ల వెంకటేష్(43) బుధవారం మృతి చెందారు. వ్యక్తిగత విషాదంతో కుటుంబం తీవ్ర దుఃఖంలో ఉన్నప్పటికీ, మానవత్వాన్ని చాటే గొప్ప నిర్ణయం తీసుకుంది. వెంకటేష్ మరణానంతరం ఆయన నేత్రాలను దానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించేలా ముందుకు వచ్చింది. కుటుంబ సభ్యుల సమ్మతితో బుధవారం రాత్రి ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ నేత్రాలను సేకరించారు. జీవితాంతం రోగులకు సేవ చేసిన వెంకటేష్, మరణానంతరం కూడా సమాజానికి సేవ చేసి చిరస్మరణీయుడిగా నిలిచారు. విషాదంలోనూ సేవా భావాన్ని చాటిన కుటుంబ సభ్యుల నిర్ణయాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు సానా రామ కృష్ణా రెడ్డి, మారెల్లి రాజిరెడ్డి, లగిశెట్టి చంద్రమౌళి, భీష్మా చారి వాసు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎల్లప్ప, సారయ్య, రాజేంద్ర కుమార్, ముద్దసాని ప్రమోద్ కుమార్ రెడ్డి, పి.మల్లికార్జున్ అభినందించారు.

# నా భారత్ - నా ఓటు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి , జనవరి 22, (జనంసాక్షి):** ఈ నెల 25న 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఓటరు దినోత్సవ వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవంలో "నా భారత్ – నా ఓటు" అనే నినాదంతో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందని తెలిపారు. ఓటరు దినోత్సవ సంబంధిత పోస్టర్లు, బ్యానర్లు, ప్రసార మాధ్యమాలు, ప్రచార కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికలలో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటరు దినోత్సవ నినాదాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లను ఓటు వేసేలా ప్రోత్సహిస్తూ వారిని స్ఫూర్తిదాయంగా చూపించడం జరుగుతుందని, బ్యాంకులు, పోస్టాఫీసులు, రైల్వే, పంచాయతీరాజ్ ఇతర శాఖల సమన్వయంతో, కార్పొరేట్ సంస్థలు, సొసైటీల ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాసం, వెబినార్, సెమినార్ల ద్వారా ప్రజలందరికీ తెలిసేలా ఓటు ఆవశ్యకతను వివరించడం జరుగు తుందని తెలిపారు. ఓటరు ప్రతిజ్ఞ వాట్సాప్ గ్రూపుల ద్వారా అందరికీ చేరే విధంగా చర్యలు తీసుకోవడం జరుగు తుందని తెలిపారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంట లకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో ఓటరు ప్రతిజ్ఞ చేయాలని, సంబంధిత ఫోటోలు, వీడియోలను ఆయా శాఖల సోషల్ మీడియా ఖాతాలలో అప్ లోడ్ చేయా లని, ఈ నెల 25వ తేదీన ఉదయం 11 గంట లకు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఓటరు దినోత్సవ వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అధికారులు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఏఐ, లైఫ్ సైన్సెస్ పాలసీలపై ప్రత్యేక దృష్టి

**దావోస్ పర్యటనలో మీడియాతో మంత్రి శ్రీధర్ బాబు**



**మంథని, (జనంసాక్షి) :** గత రెండు సంవత్సరాలుగా తెలంగాణ ఐటీ, బయోటెక్నాలజీ, ఏరో స్పేస్, రక్షణ రంగాలలో బలమైన పెట్టుబడులను ఆకర్షించిందని తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. దావోస్ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు ఎన్‌డి టీవీ ప్రతినిధితో ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఈ సంవత్సరం దావోస్‌లో దృష్టి ఒప్పందాల నుండి భవిష్యత్తు- సన్నద్ధ విధానాలను నిర్వచించడంపై మళ్లిందన్నారు. ఏఐ విధానం, ఏఐ హబ్, లైఫ్ సైన్సెస్ పాలసీ ఆవిష్కరణ ప్రతిభ, ఆవిష్కరణ, స్టార్టప్‌ల లో లంగరు వేయబడిన అంకితమైన ఏఐ పర్యా వరణ వ్యవస్థను నిర్మించడం వైపు స్పష్టమైన పురోగతిని ప్రతిబింబిస్తుందన్నారు. దీనికి ప్రణాళికాబద్ధమైన ఏఐ నగరం మద్దతు ఇస్తుంది. హైదరాబాద్, అంతకు మించి నైపుణ్యాలు విస్తరించి ఉండటంతో, ఈ దార్శనికత తెలంగాణ రైజింగ్ 2047,ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థను నిర్మించాలనే ఆశయంతో సమానంగా ఉంటుందని తెలియజేశారు.

# అంబేద్కర్ వర్సిటీ పాత బ్యాచ్‌ల

**విద్యార్థులకు రీ అడ్మిషన్**

**హైదరాబాద్, జనవరి 22 (జనంసాక్షి):** డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పాత బ్యాచ్ ల విద్యార్థుల నుండి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి, వారు కోర్సు పూర్తి చేసుకోవడానికి ప్రత్యేక అవకాశం (స్పెషల్ రీ – అడ్మిషన్) కల్పిస్తున్నట్లు విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా. వై వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా సంవత్సరం 1986 నుండి 2013 వరకు డిగ్రీ (బి.ఏ/ బి.కాం /బి.యస్సి) బ్యాచ్లకు చెందిన విద్యార్థులకు విశ్వవిద్యాలయం స్పెషల్ రీ– అడ్మిషన్ పొందడానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో విశ్వవిద్యాలయంలోని పలు కోర్సుల్లో చేరి, సకాలంలో కోర్సు పూర్తి చేయలేకపోయిన (ఓల్డ్ బ్యాచ్) విద్యార్థులకు వాటిని పూర్తి చేయడానికి ప్రత్యేక అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. స్పెషల్ రీ అడ్మిషన్ పొందాలి అనుకునే విద్యార్థులందరూ, జూబ్లీ హిల్స్ (హైదరాబాద్) లోని విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్, విద్యార్థి సేవల విభాగంను సంప్రదించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇదే చివరి అవకాశం గా పేర్కొన్నారు. రీ– అడ్మిషన్ పొందిన విద్యార్థులకు డిసెంబర్ 2026 వరకు నిర్వహించే పరీక్షలు రాయడానికి రెండు అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ : www.braou.ac.in లేదా కాల్ సెంటర్: 18005990101 లేదా హెల్ప్ డెస్క్ : 040-23680-222/333/555 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# గచ్చిబౌలిలో 2500ల గజాల పార్కును కాపాడిన హైడ్రా




**శేరిలింగంపల్లి, జనవరి 22 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో అత్యంత విలువైన 2 వేల 5 వందల గజాల పార్కు స్థలాన్ని గురువారం హైడ్రా విభాగం అధికారులు పరిరక్షించారు. గచ్చి బౌలి డివిజన్ పరిధిలో టెలికాంనగర్ పేరిట బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు 1982లో 32 ఎకరాల పరిధిలో అప్పటి హుడా అనుమతితో లేఔట్ ను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఇందులో 4వేల గజాల స్థలాన్ని ప్రజాప్ర యోజనాల విభాగం క్రింద పార్కుకోసం కేటాయించారు. ఇందులో 1500ల గజాల వరకూ ఇప్పటికే ఆక్రమణలు జరిగిపోయినట్లు విశ్వాసనీయ సమాచారం. ప్రస్తుతం అందులో ఏకంగా నివాసాలు కూడా ఉన్నాయి. మిగిలిన 2500 ల గజాల స్థలంలోకూడా తమవి కూడా ప్లాట్లు ఉన్నాయంటూ తప్పుడు డ్రోపత్రాలను సృష్టించి కొంతమంది బలవంతంగా ఆక్రమించుకున్నారు. ఈ నేపథ్యంలో టెలికామ్ నగర్ నివాసితులు హైడ్రాను ఆశ్రయించడం జరిగింది. ఇందులో భాగంగా టెలికాం నగర్ వాసులంతా హైడ్రా కార్యాలయానికి తరలి వెళ్లి ఇంతకు ముందు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, జీహెచ్ఎంసి అధికారులతోకలసి హైడ్రా అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. తమకు లభించిన ఆధారాల ప్రకారం, అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం 4 వేల గజాలు పార్కుకు కేటాయించినట్టు స్పష్టంగా నిర్ధారణ అయ్యింది. ఇందులో ఇప్పటికే 15 వందల గజాల స్థలంలో నివాసాలు ఉండడంతో వాటిని మినహాయించి మిగిలిన 2 వేల 5 వందల గజాల పార్కు స్థలంలో ప్రస్తుతం నెలకొని ఉన్న ఆక్రమణలు తొలగించి పార్కుస్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. భవిష్యత్తులో ఆక్రమణలకు ఆస్కారం లేకుండా హైడ్రా ఫెన్సింగ్ వేసింది.

# ఆహార నాణ్యతలో తేడా వస్తే వేటు తప్పదు



- హోంగార్డ్ నుండి ఎస్పీ వరకు ఒకే ఆహారం అందించాలి
- ఎస్పి సుధీర్ రామనాథ్ కేకాన్

**ములుగు బ్యూరో,జనవరి22 (జనంసాక్షి):** ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బందికి అందిస్తున్న భోజన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.మెస్‌లో భోజన నాణ్యతను పరిశీలించి, అన్ని ర్యాంకుల అధికారులు, సిబ్బంది తో పాటు పారిశుధ్య కార్మికులకు కూడా సమానమైన, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని ఆదేశించారు. భోజనం పరిశుభ్రత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్పీ స్పష్టం చేశారు.

ఎస్పీ స్థాయి అధికారి స్వయంగా తీసుకునే ఆహారమే బందోబస్తు విధుల్లో ఉన్న ప్రతి సిబ్బందికి అందించాలని ఆహార విభాగం ఇన్‌చార్జ్ అధికారులను ఆదేశించారు.బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బంది ఆరోగ్యం, భద్రత అత్యంత ముఖ్యమని పేర్కొంటూ,ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్పితో పాటు ఓఎస్డి శివమ్ ఉపాధ్యాయ (డిసిపి పదోన్నతి ఎస్పి స్థాయిలో) ఏఎస్పి ఏటూరునాగారం మనన్ బట్, ఎస్బి సిఐ శంకర్, ఏటూరునాగారం సిఐ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నేడు ఖానాపూర్ బంద్‌కు జెఏసి పిలుపు




**ఖానాపూర్ రూరల్ 22 జనవరి (జనంసాక్షి):** ఖానాపూర్ కు మంజూరైన యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఉట్నూర్ కు తరలించడం నిరసిస్తూ గురువారం పట్టణం లోని మెట్ పల్లి రహదారి పై జె ఏ సి నాయకులు బి జె పి, బీఆర్ఎస్ నాయకులు కలిసి రోడ్డు పై బైఠాయించి నల్ల బ్యాడ్జి లతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక ఐ బి నుండి తెలంగాణ చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి మాట్లాడుతూ ఈ ఉద్యమం ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఖానా పూర్ లో నిర్మించే వరకు ఉద్యమం అగదన్నారు.ఉద్యమంలో భాగంగా శుక్రవారం ఖానాపూర్ బంద్ కు పిలుపునివ్వడం జరిగింది అని ఖానాపూర్ వ్యాపారస్తులు సహకరించాలిఅని అన్నారు.ఈ కార్యక్రమంలో నందిరామయ్యా, ఆకుల శ్రీను ,ప్రణయ్,ఉదయ్,ఉపేందర్,గంగరావు,అనిల్,అంకం మహేందర్, ఎనగందుల నారాయణ,ఉన్నారు.

# పాఠశాలల్లో నిరుపయోగంగా 'వంటశాలలు'

- లక్షలాది రూపాయల సొమ్ము వృధా పాలు
- లక్షలు వెచ్చించి నిర్మిస్తే... అలంకారప్రాయంగా మారిన దుస్థితి




**మంగపేట జనవరి 22(జనంసాక్షి):** మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో లక్షలాది రూపాయల సొమ్ముతో వంటశాలలను నిర్మిస్తే వాటిని ఎవరు పట్టించుకోకపోవడంతో పూర్తిగా నిరుపయోగంగా మారిపోయాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న నాడు 2021 -2022 సంవత్సరంలో మన ఊరు? మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన లో భాగంగా సుమారు 3 లక్షల రూపాయల నిధులతో వంటశాల (వంట గది)లను నిర్మించింది. కానీ వాటి నిర్మాణం కొరకు కాంట్రాక్ట్ పద్ధతిలో గుత్తేదారులకు ఒప్పో చెప్పడంతో త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తిచేసి ఆయా పాఠశాలలకు అప్పగించారు. కానీ నాటి నుండి నేటి వరకు కూడా వాటిని ఉపయోగించకపోవడంతో పూర్తిగా నిరుపయోగంగా మారాయి అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా, మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి నెలకొంది అని తల్లిదండ్రులు ఆరోపించారు. ఇలా లక్షలాది రూపాయల సొమ్మును వృధా పాలు చేస్తూ నిర్మించడం ఎందుకు వాటిని ఉపయోగించకుండా నిరుపయోగంగా మార్చడంలోని ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు అని తల్లిదండ్రులు బహిర్గతంగానే ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై జనంసాక్షి దినపత్రిక గురువారం మండలంలోని కొన్ని పాఠశాలలను పరిశీలించగా మండలంలోని నరసింహసాగర్ జెడ్పీ హైస్కూల్, ప్రైమరీ స్కూల్ ఆవరణంలో లక్షలాది రూపాయల సొమ్ము నిర్మించిన వంట శాలలు వినియోగించుకోకుండా పూర్తిగా నిరుపయోగంగా మారిన పరిస్థితులు కనిపించాయి. ఈ విషయాన్ని తల్లి దండ్రులు ఆరోపించిన ఆరోపణలు నిజమేనని పరిశీలనలో వెల్లడైంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించి లక్షలాది రూపాయల సొమ్ముతో నిర్మించిన వంటశాలలను పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

**వంటశాలలను వినియోగంలోకి తేవాలి:**



బొల్లికొండ సాంబయ్య గౌడ్ (బీజేపీ మండలశాఖ ప్రధాన కార్యదర్శి) మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో మన ఊరు - మనబడి కార్యక్రమంలో భాగంగా 2021-2022 సంవత్సరంలో వివిధ పాఠశాలల్లో సుమారు 3 లక్షల రూపాయల నిధులతో నిర్మించడం జరిగింది. కానీ నాడు నిర్మించిన వంటశాలలో నేటి వరకు కూడా పూర్తి స్థాయిలో వినియోగించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారి ఇంకా కొన్ని రోజుల్లోనే శిథిలావస్థకు చేరే పరిస్థితి నెలకొంది అని ఆవేదన వ్యక్త పరిచారు. కొన్ని పాఠశాలలలో వంట శాలలను స్టోర్ రూమ్ గదులుగా ఉపయోగించుకుంటున్నారని వంట చేయడం కొరకు ఉపయోగించుకోవడంలేదని వారన్నారు. ఇలా ప్రభుత్వం లక్షలాది రూపాయల సొమ్ముతో నిర్మించిన వంటశాలలను ఇప్పటికైనా సంబంధిత జిల్లా, మండలస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించివిని యోగంలోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

# మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ నమోదు

**వెబ్‌సైట్‌ను ప్రారంభించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**




**మేడ్చల్ జిల్లా ప్రతినిది (జనంసాక్షి):** తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు ప్రక్రియను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.విజయేందర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జి.కాంతమ్మ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్‌తో పాటు పాంప్లెట్లు, బ్యానర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో ఐదో తరగతి , ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోరుకునే విద్యార్థులు tgmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ విద్యాసంస్థల్లో ఆధునిక మౌలిక వసతులతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్, ఈఏంసెట్, వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. మైనారిటీతో పాటు నాన్‌మైనారిటీ విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. మేడ్చల్ ప్రిన్సిపాల్ ఎం.కృష్ణ, బాలా నగర్, సీరి లింగంపల్లి బాలుర పాఠశాలల ప్రిన్సిపాళ్లు, మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్ బాలికల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు హాజరయ్యారు.

**రోడ్డును కబ్జా..**

# కూల్చివేసిన హైడ్రా



**శామీర్ పేట్, జనవరి 22 (జనంసాక్షి):** శామీర్ పేట్‌లో ఫ్రెండ్స్ కాలనీ వాసులు ఇచ్చిన ఫిర్యాదుతో ఎన్నో ఏళ్లుగా రోడ్డు కబ్జా చేసి గోడను, గేటును నిర్మించిన దానిని హైడ్రా అధికారులు పోలీస్ సిబ్బందితో వచ్చి జేసిబితో కూల్చివేశారు. గురువారం శామీర్ పేట్ లోని ఫ్రెండ్స్ కాలనీలో గత 30 ఏళ్లుగా 20 ఫీట్ల రోడ్డు కబ్జా చేసి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారని కాలనీ వాసుల పిర్యాదు మేరకు హైడ్రా ప్రహరీ గోడను కూల్చివేసి రోడ్డు డైరెక్షన్ ఇవ్వడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఏలాంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## తమిళనాడు, కేరళ తరహాలో

# కర్నాటక గవర్నర్ వ్యవహారం

- ఉభయసభల్లో ప్రసంగించకుండా నిష్క్రమణ
- గవర్నర్ తీరుపై సిఎం సిద్ధరామయ్య ఆక్షేపణ
- రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తించారని ఆగ్రహం



**బెంగళూరు, జనవరి 22 (జనంసాక్షి) :** తమిళనాడు, కేరళ మాదిరిగానే కర్ణాటకలోనూ గవర్నర్ వ్యవహారం వివాదాస్పదం అయ్యింది. కొత్త ఏడాదిలో కర్ణాటకలో తొలి అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగ ప్రతులను గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ చదవకుండా పక్కన పెట్టారు. 'ఈ రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది.. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ రెండు లైన్లలో తన ప్రసంగాన్ని ముగించారు. అనంతరం సభ నుంచి వెళ్లిపోయారు. ఈ వ్యవహారం గవర్నర్ కార్యాలయం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య విభేదాలకు దారితీసింది. ఈ తీరుపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్యగా సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్యలు చేశారు. రెండేళ్లుగా గవర్నర్ థావర్‌చంద్ కాంగ్రెస్ సర్కారు తయారుచేసిన సభా ప్రసంగాలను ఉభయ సభల్లో యథావిధిగా చదివారు. అయితే ఈసారి తన ధోరణిని మార్చుకున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే అంశాలతో తన ప్రసంగాన్ని సిద్ధంచేసిన తీరును ఆయన ముందుగానే ఆక్షేపించారు. దాంతో గురువారం అసలు ఆయన సభకు వస్తారా లేదా అనే ఉత్కంఠ కనిపించింది. అయితే ఎట్టకేలకు సభకు వచ్చిన ఆయన్ను సీఎం ఆహ్వానించారు. దాంతో ఆ ప్రసంగంపై అభిప్రాయభేదాలు పరిష్కారం అయ్యాయనే అభిప్రాయం కలిగింది. కానీ కొద్దిసేపటికే అలాంటిది ఏమీ లేదని అర్థమైంది. ఆయన కేవలం రెండులైన్లు చదివి సభ నుంచి వెళ్లిపోయారు. క్యాబినెట్ సిద్ధం చేసిన ప్రసంగాన్ని చదవకుండా తాను సిద్ధం చేసుకున్న ప్రసంగాన్ని గవర్నర్ చదివారు. ఆయన రాజ్యాంగబద్ధంగా వ్యవహరించలేదు. దీనిపై మేం నిరసన తెలియజేయనున్నాం. అలాగే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాన్ని పరిశీలిస్తున్నాం అని సిద్ధరామయ్య అన్నారు. కర్ణాటక అసెంబ్లీ సమావేశాల్లో ప్రారంభం రోజే హైడ్రామా నడిచింది. ఉపాధి హామీ పథకానికి సవరణలు వద్దనే తీర్మానంపై కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగాన్ని గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్.. కేవలం రెండు లైన్లు చదివేసి సభ నుంచి వాకౌట్ చేశారు. ఈ ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక పురోగతి వేగాన్ని రెట్టింపు చేయడానికి కట్టుబడి ఉంది. జై హింద్, జై కర్ణాటక!' అంటూ ప్రసంగాన్ని ముగించారు గవర్నర్. దీంతో గవర్నర్ తీరుపై కాంగ్రెస్ నేతలు భగ్గుమన్నారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'లోక్ భవన్ బీజేపీ కార్యాలయంగా మారిందా అని గవర్నర్‌ను ప్రశ్నించారు. గవర్నర్ గహ్లోత్ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన తర్వాత.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. 'ప్రతి కొత్త సంవత్సరం గవర్నర్ అసెంబ్లీ ఉమ్మడి సమావేశంలో ప్రసంగించాలి. ఆ ప్రసంగ పత్రాలను క్యాబినెట్ తయారు చేయాలి. ఇది రాజ్యాంగబద్ధమైన అవసరం. నేడు క్యాబినెట్ తయారు చేసిన ప్రసంగాన్ని చదవడానికి బదులుగా.. గవర్నర్ స్వయంగా రూపొందించుకున్న ప్రసంగాన్ని చదివారు. ఇది భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 176, 163ను ఉల్లంఘనల కిందకు వస్తుంది. రాజ్యాంగం ప్రకారం.. ఆయన తన విధులను సక్రమంగా నిర్వర్తించలేదు. అందువల్ల గవర్నర్ వైఖరికి వ్యతిరేకంగా నిరసన తెలపబోతున్నాం. సుప్రీంకోర్టును ఆశ్రయించాలా.. వద్దా.. అని పరిశీలిస్తున్నాం' అని సీఎం సిద్ధరామయ్య అన్నారు.



## నేడు రాష్ట్ర గవర్నర్ కోదాడ పర్యటన

- జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఏర్పాటుకు శంకుస్థాపన

**కోదాడ, జనవరి 23( జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హుజూర్ నగర్, కోదాడ లో పర్యటించనున్నారు. గవర్నర్ తన పర్యటనలో భాగంగా రాష్ట్ర నీటి పారుదల మరియు పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఉదయం 10 గంటలకు మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం 123 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించే వ్యవసాయ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం కోదాడలో 50 కోట్లతో నిర్మించనున్న జవహర్ నవోదయ విద్యాలయ సమితి భవనాలకు శంకుస్థాపన చేస్తారు.

## ఈడీ విచారణకు హాజరైన విజయసాయి

- దాదాపు 7 గంటలపై పాటో లిక్కర్ స్కామ్‌పై విచారణ



**హైదరాబాద్, జనవరి 22 (జనంసాక్షి) :** ఏపీ లిక్కర్ స్కాం కేసులో వైసీపీ మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన విచారణ ముగిసింది. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విజయసాయిని దాదాపు 7 గంటల పాటు అధికారులు ప్రశ్నించారు. విచారణలో భాగంగా లిక్కర్ పాలసీ రూపకల్పన, విధాన నిర్ణయాలు, అలాగే రహస్య ఆర్థిక లావాదేవీలపై ఈడీ ఆరా తీసింది. లిక్కర్ పాలసీకి సంబంధించిన సమావేశాలు తన సమక్షంలోనే మూడు సార్లు జరిగినట్లు విజయసాయి రెడ్డి ఈడీకి స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు సమాచారం. అదేవిధంగా.. విదేశాలకు నగదు తరలింపు అంశం, షెల్ కంపెనీల ఏర్పాటు, వాటి ద్వారా జరిగిన లావాదేవీలపై కూడా అధికారులు ప్రశ్నలు సంధించారు. షెల్ కంపెనీల ద్వారా అంతిమ లబ్దిదారులు ఎవరు అనే అంశంపై ఈడీ ప్రత్యేకంగా వివరాలు కోరినట్లు సమాచారం. విచారణ సమయంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కొన్ని కీలక డాక్యుమెంట్లను విజయసాయి రెడ్డి ఈడీ అధికారులకు సమర్పించారు. ఈ మేరకు ఆయన స్టేట్‌మెంట్‌ను కూడా ఈడీ అధికారులు రికార్డు చేశారు.

## మేడారం గిరిజన జాతరకు భారీగా ఏర్పాట్లు

- జాతరకు ముందే తరలివస్తున్న భక్తులు
- బెల్లం కొరుగోళ్లకు విపరీతమైన గిరాకీ



**ములుగు బ్యూరో, జనవరి 22 (జనంసాక్షి) :** మేడారంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేసింది. ఈ ఏడాది జనవరి 28 నుంచి జనవరి 31 వరకు జరగనుంది. కోట్లాది మంది భక్తులు వనదేవతలను దర్శించుకునేందుకు వస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం 4వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈసారి రికార్డు స్థాయిలో భక్తులు వస్తారనే అంచనాతో తెలంగాణ ప్రభుత్వం రూ. 100 కోట్లకు పైగా నిధులతో ఏర్పాట్లు చేస్తోంది.గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీని తట్టుకునేలా క్యూలైన్లను వెడల్పు చేశారు. జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలను ఆధునీకరించారు. ఆర్టీసీ వేల సంఖ్యలో ప్రత్యేక బస్సులను నడుపుతోంది. అడవిలో తాత్కాలిక వైద్య శిబిరాలు, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక గ్రిడ్లను ఏర్పాటు చేశారు. లక్షలాది మంది భక్తులు వచ్చినా ఇబ్బంది కలగకుండా వేల మంది సిబ్బందితో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ జాతర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి కులమతాలకు అతీతంగా కోట్లాది మంది భక్తులను ఆకర్షిస్తూ.. సమ్మక్క-సారక్కల త్యాగాలను, గిరిజన సంస్కృతిని సజీవంగా నిలబెడుతోంది. కాకతీయుల కాలం నుంచి ఇప్పటి వరకు మేడారం జాతరకు వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతూనే ఉంది. గిరిజన ఆదివాసీ జాతర సమ్మక్క-సారలమ్మ వనదేవతల జాతరకు అన్నీ సిద్ధమవుతున్నాయి. జాతర సమయం సమీపిస్తున్నకొద్దీ అధికార యంత్రాంగం భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ముమ్మరం చేసింది. రెండేళ్లకోసారి నిర్వహించే జాతర వేడుకలు మాఘశుద్ధ పౌర్ణమికి ముందు నాలుగురోజులపాటు సమ్మక్క-సారలమ్మ జాతరను భక్తులు కోలాహలంగా జరుపుకుంటారు. పేరుకే గిరిజన జాతర అయినప్పటికీ అన్నివర్గాలకు చెందిన భక్తులు భక్తిశ్రద్ధలతో వనదేవతలకు పూజలు చేస్తారు.ఈనెల 28నుంచి సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా తల్లులను దర్శించి మొక్కులు చెల్లించడానికి భక్తజనం సిద్ధమవుతున్నారు. వనదేవతలకు బెల్లం కొనుగోలు చేసి భక్తులు పంచిపెడుతున్నారు. దీంతో బెల్లందుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. మార్కెట్లో 10కిలోల బెల్లంముద్దలు రూ.50 కిలో అయితే రూ.55వరకు అమ్మకాలు కొనసాగుతున్నాయి. దీంతో బెల్లం అమ్మకాలకు గిరాకీ పెరిగింది. దీనిని బంగారంగా భావించి అమ్మవార్లకు సమర్పిస్తారు.

## విజయవాడలో ఫిజిక్స్ అరుణ్ బిగ్‌బ్యాంగ్ పుస్తకావిష్కరణ



- అక్షర ప్రవీణ జాతీయ ప్రతిభా పురస్కారం

**విజయవాడ (జనంసాక్షి) :** తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్, శ్రీ శ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని చాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియం నందు ప్రాచీన కవుల వారసులచే నిర్వహించిన సాహితీ సాంస్కృతిక పట్టాభిషేక మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఫిజిక్స్ అరుణ్ కుమార్ రచించిన బిగ్ బ్యాంగ్ పుస్తకావిష్కరణ ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక రక్షణదళ ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండెడ్ రాజమహేంద్రవరం యస్ పి, అఖండ శంఖారావం వరల్డ్ రికార్డ్ గ్రహీత కొండా నరసింహ్మారావు, అలివేలు మంగా దేవి దంపతులు, ఏపీ ప్రభుత్వ కళా రత్న పురస్కార గ్రహీత కత్తిమండ ప్రతాప్, ప్రపంచ తొలి మహిళా శిల్పి దేవికారాణి తదితరుల అతిథుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అరుణ్‌ను అక్షర ప్రవీణ జాతీయ ప్రతిభా పురస్కారంతో నిర్వాహకులు సత్కరించారు. దీనిని పురస్కరించుకొని ఫిజిక్స్ అరుణ్ మాట్లాడుతూ.. తెలంగాణ తో పాటు ఆంధ్రప్రదేశ్ లో కూడా తన పుస్తకాలు శూన్యం కాకినాడ లో, బిగ్ బ్యాంగ్ విజయవాడలో ఆవిష్కరణ జరగడంలో సహకరించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలనీ, సాహితీరంగంలో జాతీయస్థాయిలో సేవలందించడానికి అవకాశం కల్పించిన కత్తిమండ ప్రతాప్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ దినపత్రికల్లో వచ్చిన కవితలు, వ్యాసాల సంకలనంగా వచ్చిన తన రెండు పుస్తకాలు భిన్న రకాలుగా సమీక్షిస్తూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల పాఠకులు, వివిధ రకాల ప్రముఖులు స్పందిస్తున్నారని అన్నారు. నిర్వాహకులు శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కత్తిమండ ప్రతాప్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులతో పాటు శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పార్థసారథి, ప్రెస్ అకాడమీ కార్యదర్శి తిలక్, డాక్టర్ కావూరి శ్రీనివాస్,గుండాల రాకేష్ డాక్టర్ శాంతి బాయ్ ,దేబా విజయ్ కుమార్, నూక సంపత్ కుమార్, బాలార్జున, బాలచందర్, శ్రీనుబాబు తదితరులతో పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కవులు, రచయితలు, కళాకారులు పాల్గొన్నారు.

## అటెన్షన్ డైవర్షన్ స్కీమ్

- కెటిఆర్‌కు నోటీసులపై బిఆర్‌ఎస్ నేతల ఆగ్రహం




**హైదరాబాద్, జనవరి 22 (జనంసాక్షి) :** కెటిఆర్‌కు సిట్ నోటీసులపై బిఆర్‌ఎస్ నేతలు మండిపడ్డారు. ఇదంతా కేవలం డైవర్షన్ స్కీమ్ అంటూ విమర్శలు గుప్పించారు. బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్పలేక .. నిన్న నాకు, ఇవాళ కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసే వరకు వెంట పడుతూనే ఉంటామన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా సీఎం ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. బామ్మర్ది బాగోతం బయటపెట్టడంతో ఈ నోటీసులు ఇస్తున్నారని అన్నారు. రెండేళ్ల క్రితం నుంచి సడీచప్పుడు లేకుండా ఇప్పుడే నోటీసులు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు కాంగ్రెస్ సర్కారు నాటకమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు.పాలన గాలికి వదిలి సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న చిల్లర ప్రయత్నాలు ఇవి. రాష్ట్రంలో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రజల కర్మానికి వదిలేసి దావోస్, అమెరికా పర్యటన పెట్టుకున్నారు. సర్కారు డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పసలేదని న్యాయస్థానాలు తేల్చి చెప్పినా.. కాంగ్రెస్ ప్రభుత్వం మొగలి రేకులు సీరియల్ నడిపిస్తోంది. రేవంత్‌రెడ్డి విదేశాల్లో విహరిస్తూ అక్కడి నుంచి వచ్చే వరకు ఈ సీరియల్ నడిచేలా ప్లాన్ చేసినట్లు అనిపిస్తోంది. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని ప్రభుత్వ శాఖల వెన్ను విరిచారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్‌ఎస్ నేతలకు నోటీసులు ఇవ్వడం హాస్యాస్పదం అని నిరంజన్‌రెడ్డి అన్నారు. రెండేళ్ల క్రితం నమోదైన కేసులో కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చిందని బీఆర్‌ఎస్ నేత సోమా భరత్ విమర్శించారు. 'నోటీసు ఇచ్చి .. విచారణకు వచ్చేందుకు కనీసం 24 గంటల సమయం కూడా ఇవ్వలేదు. రెండ్రోజుల క్రితం మరో సీనియర్‌నేత హరీశ్‌రావుకు నోటీసులు ఇచ్చారు. కేవలం ప్రశ్నిస్తున్న పార్టీ లక్ష్యంగానే నోటీసులు ఇస్తున్నారు. సిట్ ఎందుకు వేశారో కూడా తెలియదు. ఒక పద్ధతి లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ అక్రమాలను బయటపెడుతుంటే నోటీసులు ఇస్తున్నారు. విచారణకు కేటీఆర్‌తో పాటు న్యాయవాదిని అనుమతించాలని కోరాం. సాక్షిగా విచారణ చేసినప్పుడు న్యాయవాదిని అనుమతించబోమని ఏసీపీ చెప్పారని భరత్ తెలిపారు.

## గాయని జానకి ఇంట విషాదం

- కుమారుడు మురళీకృష్ణ అస్తమయం



**చెన్నై, జనవరి 22 (జనంసాక్షి) :** దక్షిణాది ప్రముఖ గాయని ఎస్.జానకి ఇంట విషాదం చోటు చేసుకుంది. ఆమె ఏకైక కుమారుడు మురళీకృష్ణ (65) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తున్న ఆయన, పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని గాయని కె.ఎస్ చిత్ర సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 'మేమంతా ఎంతో ఇష్టపడే సోదరుడు, మన ప్రియమైన జానకి అమ్మగారి ఏకైక కుమారుడు మురళీ ఆకస్మికంగా మరణం ఎంతో షాక్‌కి గురి చేసింది. మంచి సోదరుడిని కోల్పోయాం. భరించలేని ఈ దుఃఖాన్ని, విషాదాన్ని అధిగమించేందుకు జానకమ్మకు ఆ భగవంతుడు అపారమైన శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను. మురళీ ఆత్మ శాంతించాలని కోరుకుంటున్నా' అని చిత్ర పోస్ట్‌లో పేర్కొన్నారు. మురళీకృష్ణ జానకి కుమారుడిగానే కాకుండా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన సుప్రసిద్ధ భరతనాట్య కళాకారుడు. శాస్త్రీయ నృత్యంలో మంచి ప్రావీణ్యం ఉన్న ఆయన, పలువురు విద్యార్థులకు శిక్షణ కూడా ఇచ్చారు. అంతేకాకుండా, నటనపై ఉన్న ఆసక్తితో 'వినాయకుడు', 'మ్లలెపువ్వు' వంటి చిత్రాల్లో నటించారు. కన్నడ సినిమా 'కూలింగ్ గ్లాస్'కు రచయితగానూ వర్క్ చేశారు. మురళీ కృష్ణకు భార్య ఉమ, ఇద్దరు కుమార్తెలు వర్ష, అప్సర ఉన్నారు.

## జనసేనపై దుష్టశక్తుల దృష్టి

- అప్రమత్తంగా ఉండాలని పవన్ సూచన




**అమరావతి, జనవరి 22 (జనంసాక్షి) :** జనసేనపై ఎలాంటి దుష్టశక్తుల దృష్టి పడకుండా కాపుకాస్తున్న జన సైనికులు, వీర మహిళలు, నాయకులు సర్వదా ప్రశంసనీయులని డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కొనియాడారు. గురువారం నాడు అమరావతిలో జనసేన పార్టీకి చెందిన కొందరు నాయకులతో పవన్ సమావేశం నిర్వహించారు. పార్టీ సంస్థాగత విషయాలపై కార్యకర్తలకు దిశానిర్దేశర చేశారు పవన్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో వ్యక్తుల మధ్య జరుగుతున్న ఘర్షణలు, ఆర్థిక లావాదేవీలు, మానసిక బలహీనతలు, వ్యక్తిగత కుల విభేదాలను జనసేనకు ఆపాదించడానికి కిరాయి వక్తులు, మాధ్యమాలు కలిసి కుయుక్తులు పన్నుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వివాహేతర సంబంధాల రచ్చను కూడా పార్టీపై రుద్దాలని మార్గాలను అన్వేషిస్తున్నాయని పవన్ తెలిపారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి ప్రచారాలను తీవ్రంగా ఖండించవలసి ఉందని పార్టీ నేతలకు సూచించారాయన. రాజ్యాంగ బద్ధంగా, ప్రజాసేవే పరమావధిగా జనసేన ప్రయాణం అప్రతిహతంగా కొనసాగుతుందన్నారు. ఈ ప్రయాణంలో తోడూ నీడగా ఉన్న జనసేన శ్రేణులకు జనసేనాని పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370